మహిమ

(నవల)

నవ్య ఏడువారాల సీరియల్ పోటీలో
బహుమతి పొందినది

రచన

డి. కామేశ్వరి

Mahima - Novel

(Navya Weekly Prize Novel)

by D. Kameswari

First Edition : November 2019

Address :

D. Kameswari

H Block 7, Jalvayu Towers

Lower Tank Bund Road

Hyderabad - 500 080

E-mail : durvasulakameswari@gmail.com

Ph : 040-2764 2486, Cell : 92473 31446

Copies : **300**

Book Price : Rs. **130/-**

Printed at :

Sri Uday Printers

Hyderabad - 29, **Cell : 98490 38058**

For Copies :

Sole Distributors

Navodaya, Kachiguda, Hyderabad

Ph : 2465 2387, Cell : 92474 71361

(తెలుగు యూనివర్సిటీ పాక్షిక ఆర్థిక సహాయంతో)

నవరసాల సాహితీ గరిమ



కామేశ్వరి గారి 'మహిమ' నవల, నవ్య వారపత్రిక నిర్వహించిన ఏడు వారాల సీరియల్స్ పోటీలో బహుమతి పొంది పత్రికలో ధారావాహికగా వస్తున్నప్పుడు, అసంఖ్యాకమైన పాఠకులతో బాటు నేనూ చదివాను. చదువుతూ ఒక ఆశ్చర్యానికి లోనయాను. ఈ నవలలో ఆమె ఎన్నుకున్న ఇతివృత్తం నవీనమైనది. ఇంతవరకు పెద్దగా ఏ రచయితా ప్రయత్నించని, ఎనభయ్యవ పడిలో ఉన్న ఒక రచయిత్రి ఇవాళ్టి ప్రకటనారంగాన్ని నేపథ్యంగా ఎన్నుకుని ఇంత కన్విన్సింగ్‌గా రాయడం, జీవితపు నవరసాలనీ ఒక వంద పేజీల నవలలో పొదుగుతూ, అందులో మొదటి నుంచి చివరి వరకు ఉత్కంఠని నిలుపుతూ, పాత్రలన్నిటిలోనూ మానవీయ కోణాన్ని హృద్యంగా ఆవిష్కరిస్తూ కథని కదను తొక్కించడం చూసి ఈవిడ సాహితీ సృజనలో 'నైంటీ నాటవుట్' అయినా ఆశ్చర్యం కలగదనుకున్నాను.

డి. కామేశ్వరి గారు నాకెప్పటి నుంచి తెలుసు అంటే చెప్పడం కష్టం. జ్ఞానం తెలిసినప్పటి నుంచీ నేను వింటూ వచ్చిన పేరది. నేను పుట్టిన సంవత్సరమే రచనా వ్యాసంగంలో అడుగుపెట్టిన ఆమె నేను అక్షరాలు దిద్దేనాటికి ప్రసిద్ధ రచయిత్రిగా గొప్ప పేరు సంపాదించుకున్నారు. పత్రికల్లో వచ్చే ఆమె సీరియల్స్ కోసం మా ఇంటిల్లిపాదీ ఎదురుచూస్తూ ఉండడం నాకు బాగా గుర్తు.

అయిదున్నర దశాబ్దాలకి పైగా విరివిగా కథలు, నవలలూ రాస్తూ పాఠకులని అలరించగలగడం, సంపాదకులని మెప్పించగలగడం సామాన్యమైన విషయం కాదు. పత్రికల్లో వచ్చే సాహిత్యాన్ని చదివే వారిలో కౌమారప్రాయం నుంచి ముది వయసు వరకూ అన్ని వయసుల వారూ ఉంటారు. రచయితగా ఇంతకాలం నిలబడాలంటే కాలంతో పాటు మారే సమాజాన్ని గమనించి, ఆయా కాలాలకి తగిన ఇతివృత్తాలని ఎన్నుకోవలసి ఉంటుంది. అందరినీ ఆకట్టుకునే రచన చేస్తూనే ఆ రచనకు సామాజిక ప్రయోజనం ఉండేలా తీర్చి దిద్దాలంటే అది కత్తిమీద సామే.

కామేశ్వరి గారి చూపు సునిశితమైనది. ఆమె పరివారంలో ఉన్నత విద్యావంతులున్నారు. అనేక దేశాలు వెళ్ళి అక్కడ స్థిరపడిన బంధుమిత్రులున్నారు. ఇన్నేళ్ల సాహితీ యానంలో పోగు చేసుకున్న స్నేహితులూ, పరిచయస్థులూ ఉన్నారు. రోజుకున్న 24 గంటల్లోనే అందరినీ పలకరిస్తూ, అందరి జీవితాలనీ పరిశీలిస్తూ, తన దృక్పథాన్ని విశాలం చేసుకుంటూ వచ్చిన ఆమెకి బద్ధకం లేదు. 'ఇంత సాధించాం, ఇక చాలు' అని ఆగిపోయే ధోరణి కాదు ఆమెది. మన ఇళ్లలో ఎనభై దాటిన పెద్దవాళ్ళతో ఆమెని పోల్చి చూస్తే ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది. ఇప్పటికీ తానొక్కరే సాహితీ సమావేశాలకి వచ్చి, అందర్నీ గలగలా పలకరించి, మనసులో మాటని నిర్మొహమాటంగా వెల్లడించి, నచ్చిన దాన్ని మనసారా మెచ్చుకుని, నచ్చనిదాన్ని నిక్కచ్చిగా ప్రకటించి, కొంచెమైనా తొణకని ఆత్మవిశ్వాసంతో ఎవరినీ సహాయం అడుగకుండా హుందాగా వెళ్ళిపోయే ఆమె, తన నవలల్లో హీరోయిన్ లాగే కనిపిస్తారు.

వాట్సాప్, ఫేస్‌బుక్ మాధ్యమాలని అర్థం చేసుకుని, ఎలా వాడాలో నేర్చుకుని, వాటిని నిత్య జీవితంలో ఉపయోగించుకుంటూ నిరంతర చైతన్య శీలిగా ఆమె జీవిస్తున్న విధానం, కంప్యూటర్ వాడకం నేర్చుకుని తనకు కలిగే సందేహాలను నివృత్తి చేసుకుంటూ, ఇవాల్టి యువతతో సమానంగా ప్రపంచ

విషయాలు తెలుసుకుంటూ ఉండడం గొప్ప స్ఫూర్తిదాయకమైన విషయం. తన మేథకు నిరంతరం పదును పెట్టుకుంటూ, చుట్టూ ఉండే సమాజాన్ని పరిశీలనా దృష్టితో పరికిస్తూ వచ్చిన ఆమె, తనకన్నా అయిదారు దశాబ్దాలు చిన్నవారైన యువతరాన్ని సానుకూల దృక్పథంతో అర్థం చేసుకుంటూ, తన అనుభవ జ్ఞానానికి ఆలోచనా సారాన్ని జతచేసి, సమకాలీన సమస్యలకి కారణాలని శోధిస్తూ, పరిష్కారాలని అన్వేషిస్తూ, చక్కని కథలుగా నవలలుగా అందిస్తూ వచ్చారు.

ఈ రచనలు యువతరం పాఠకులకు చక్కని పెంపకాన్ని అందిస్తాయంటే అది సత్య దూరం కాదు. వీటిని చదివిస్తే చాలు కొండొకచో తల్లిదండ్రులు వాదించి, చర్చించి, తమ పిల్లలకు వివరించలేకపోయిన విషయాలని కామేశ్వరి గారి సాహిత్యం కొంతవరకూ అవగతం చేయించ గలుగుతుందనిపిస్తుంది. కౌమారదశలో ఉన్న వ్యక్తి ఆవిడ సాహిత్యం అంతా చదివితే ఆ వ్యక్తి జీవితానికి పనికివచ్చే ఆణిముత్యాలెన్నో అందులోంచి ఏరుకోవచ్చు. అనేక దశాబ్దాలుగా, స్త్రీలకి ఎలాంటి సమస్యలు ఎదురవవచ్చో వాటిని ఎలా ఎదుర్కొంటే బాగుంటుందో చెప్తూ ఆమె రాసిన కథలూ, నవలలూ చదివితే ఆ వస్తు వైవిధ్యం మనని సంభ్రమానికి గురిచేస్తుంది. ఆలోచనాత్మకమైన ఆమె విశ్లేషణ, సరళాతి సరళమైన భాషా, వేగవంతమైన ఆమె శైలీ పాఠకులకి చక్కని పఠనానుభవాన్ని అందిస్తాయి.

సుదీర్ఘమైన ఆమె రచనాప్రస్థానంలో ఆమె చేసిన సృజన అమూల్యమైనది. ఇప్పటివరకూ వచ్చిన ఆమె రచనలన్నీ చదివితే 1960 నుంచి ఆరు దశాబ్దాల సామాజిక జీవనపు అనేక పార్శ్వాలని ఆమె ప్రతిభావంతంగా అక్షరబద్ధం చేశారనీ, ముఖ్యంగా మధ్యతరగతి తెలుగువారి జీవితాన్ని చరిత్ర కెక్కించడంలో ఆమె సఫలీకృతులయ్యారనీ అర్థమవుతుంది. ఇది సామాన్యమైన కృషి కాదు.

నిరంతరం వేగంగా మారిపోతున్న జీవన సరళిలో రోజువారీ వాడకానికి

అవసరమైన టెక్నాలజీని అర్థం చేసుకోవడం, నలభై యాభై ఏళ్ల వాళ్లకే కష్టం అనిపిస్తుంటే ఆమె ఎప్పటికప్పుడు అందనని మొరాయించే సాంకేతికతని నేర్పుగా లొంగదీసుకుని, కంప్యూటర్‌లో టైప్ చేస్తూ, ఈమెయిల్, వాట్సప్ మాధ్యమాలతో బయటి ప్రపంచంతో సంబంధ బాంధవ్యాలని కొనసాగిస్తూ, నగరంలో జరిగే సాహితీ సభలన్నిటిలో ఉత్సాహంగా పాల్గొంటూ, ఏ సభకు వచ్చినా అక్కడ వాతావరణాన్ని కెమెరాలో పదిలపరుచుకుంటూ, ఆ అనుభూతులని ముఖ పుస్తకంలో పదుగురితో పంచుకుంటూ ఉండడం నిజంగా ఒక అద్భుతమే. వయసు ఆమె ఉత్సాహాన్నీ, జ్ఞానార్జనలో ఆమెకున్న ఆసక్తినీ ఏ మాత్రం తగ్గించలేదు సరికదా ఎనభై వసంతాల వర్ణశోభితమైన అనుభవసారం ఆమె ఉత్సాహానికీ, ఆసక్తికీ తోడై కామేశ్వరి గారి రచనకి పరిపుష్టినిచ్చిందనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

సమాజంలో మంచివాళ్లు చెడ్డవాళ్లూ కాకుండా, మంచీ చెడూ అనేక పాళ్లలో కలిసి ఉన్న వ్యక్తులే ఉంటారన్నది మనకు తెలిసిందే. జీవితపు అనేక పార్శ్వాలని సునిశితంగా గమనించిన కామేశ్వరిగారు ఏ పాత్రని సృష్టించినా ఆ పాత్ర మనస్తత్వ చిత్రణలో తనదైన ముద్ర చూపిస్తారు.

మహిమ నవలలో అందగాడూ, చక్కగా చదువుకున్నవాడూ అయిన వినోద్ పరిస్థితుల ప్రాబల్యం వల్ల, ఒక ధనవంతుడి ఏకైక పుత్రికా, అనాకారీ, అహంకారీ అయిన సుస్మితను పెళ్లిచేసుకోవలసి రావడం, తన యాడ్ ఏజెన్సీలో అందమైన చలాకీ అమ్మాయిలు ఎదురుగా తిరుగుతూ ఉంటే చూస్తూ వారి మధ్య పనిచేయాల్సి రావడం నేర్పుగా చిత్రించి, పెళ్ళై ఒక పిల్లవాడున్న ఆ పాత్ర చిత్రణలో అతని వ్యక్తిత్వంలోని బలహీనతని చూపిస్తూనే అతని ప్రవర్తనకి కారణాలని విశ్లేషించడం, అతని పట్ల పాఠకులకి ఒక సానుభూతిని రేకెత్తించడం సమర్థవంతంగా చేశారు.

జీవన ప్రయాణంలో ప్రతి వ్యక్తీ క్రమంగా కొంత మార్పు చెందుతాడు. అలాగే తల్లి అయాక, ఇంటి ఆర్థిక పరిస్థితిలో మార్పులు వచ్చాక సుస్మితలో వచ్చిన మార్పుని కూడా ఈ నవలకున్న పరిమితమైన నిడివిలోనే చిత్రించ గలిగారు రచయిత్రి. ఇక కథానాయకి పాత్రలో ఒక ఆదర్శమూర్తిని, సౌందర్యం, సహృదయం, తెలివీ, చాకచక్యం, సృజనాత్మకతా ఉన్న యువతిని అందంగా ఆవిష్కరించారు. కథనకవసరమైన వర్ణనలని ఆచి తూచి వేయడం, అధిక శాతం కథని సంభాషణల్లోనే చెప్పించి, మెప్పించడం ఆమె ప్రత్యేకత.

ప్రీతి, డ్రైవర్ అన్వర్‌ల మనస్తత్వాల విశ్లేషణ, వ్యాపారవేత్తలైన సుస్మిత తండ్రి కిషన్‌లాల్, వినోద్ తండ్రి అవినాష్‌జైన్‌ల పాత్ర చిత్రణ, పిల్లలు తప్పు చేస్తున్నా సంతానం విషయంలో తండ్రుల్లో సహజంగా కనబడే పితృ వాత్సల్యం ... పాత్రలన్నిటినీ రక్తమాంసాలున్న వ్యక్తులుగా తీర్చిదిద్దారు. ఆయా జీవితాల్లో ఏర్పడిన కల్లోలాన్ని వాస్తవికంగా చూపించగలగడం, కథానాయకి చూపించిన చొరవతో ఆ కల్లోలం సర్దుకున్నట్టుగా చూపించి, కథని సుఖాంతంగా ముగించడం, కేవలం ఏడువారాల సీరియల్‌లో ఎక్కడా అవకతవకగా అనిపించ కుండా ఇంత కథని నడిపించి నిభాయించడం ... కామేశ్వరి గారి రచనా సామర్థ్యానికి ఈ నవల మచ్చుతునక అని చెప్పవచ్చు.

పదకొండు కథా సంపుటాలు, ఇరవైఒక్క నవలలు, కవితలు ట్రావెలోగ్స్‌తో కలిపి ఆవిడ సృష్టించిన సాహిత్యమూ, ఆ సాహితీ సంపదని సమాజానికి అందించినందుకు ఆమె అందుకున్న సన్మానాలు, విశిష్ట పురస్కారాలు ఆమె ప్రతిభకి నిలువుటద్దాలు. "అత్యాచారానికి గురైన అమ్మాయికి ముందున్న దారులు రెండే. ఆ దారుణానికి ఒడిగట్టిన వ్యక్తిని పెళ్లాడడం లేదా ఆత్మహత్య చేసుకోవడం" అనుకునే కాలంలో 'అంతటి దుర్మార్గాన్ని ఒకసారి భరించడమే కష్టమైతే, జీవితమంతా అదే వ్యక్తితో బతకాలని నిర్దేశించడం ఏం న్యాయం ?'

అంటూ ఆనాటి సమాజాన్ని ఎలుగెత్తి ప్రశ్నించిన 'న్యాయం కావాలి' లాంటి ఒక్క నవల చాలు, ఆమె అభ్యుదయ దృక్పథాన్ని తెలియజెప్పడానికీ, ఆమె తానున్న కాలంకన్నా, కొన్ని దశాబ్దాలు ముందున్నారని చెప్పడానికే.

'ఇంక నాకు ఓపిక లేదు, ఇదే నా ఆఖరి పుస్తకం' అని ప్రకటించేసినా, అనతికాలంలోనే మళ్లీ మరో కొత్త పుస్తకంతో మన ముందుకి రావడం కామేశ్వరి గారికి అలవాటు. అది ఆమె సృజనాత్మక చైతన్యశీలతకు నిదర్శనం. షడ్రసోపేతమైన సాహితీ విందు ఎదురుగా ఉండగా మిమ్మల్ని ముందు మాటలతో ఆపేయడం భావ్యం కాదు. వెంటనే ఆ విందు నాస్వాదించి, ఆమె కలం ఇలాగే ఆగకుండా ముందుకి సాగాలని, ఆ ప్రయాణానికి అవసరమైన ఆరోగ్యమూ, ఆయుర్దాయమూ ఆమెకి లభించాలనీ కోరుకోవడమే మీరైనా నేనైనా చేయవలసింది.

16-11-2019
హైదరాబాద్

వారణాసి నాగలక్ష్మి

నా స్పందన



డి. కామేశ్వరి ... ఈ పేరు వినగానే ఎమెస్కో పాకెట్ సైజు పుస్తకం వెనకాల సన్నగా, నాజూకుగా ఉన్న ఆమె ఫోటో గుర్తొస్తోంది నాకు. రచయిత్రిగా ఆమె మొదటి నవల, పాఠకురాలిగా నేను చదివిన మొదటి నవల "కొత్తనీరు"! అరవై ఎనిమిదిలో రాశారుట. అప్పుడు నేను రెండేళ్ళ పిల్లని ! కాని ఆమె అప్పటికే నలుగురికీ తెలిసిన పేరు పొందిన రచయిత్రి ! అలాంటిది ఈ ప్రముఖ రచయిత్రి నవలిక మీద నా అభిప్రాయం రాయడమంటే కాస్త జంకుగానే ఉన్నా, ఈ నవల కథాంశం, మీడియా ప్రపంచం మీద ఆమెకున్న అవగాహనా, వర్కింగ్ విమెన్స్ హాస్టళ్లలో వారి పద్ధతులు, వారి సంభాషణలూ ఇప్పటి రోజులకి తగ్గట్టుగా ఆమె రాసిన తీరు ... ఇవన్నీ నాకు కొంచెం విస్మయాన్ని కలిగించాయి ! దీని గురించి ఏదైనా రాయాలన్న ఉత్సాహాన్ని, ధైర్యాన్ని ఇచ్చాయి ! నా పిల్లలిద్దరూ కొంతకాలం అలా వున్నవారే ! మనం నిత్యం చూసే వేల ప్రకటనలు ప్రింట్ మీడియాలో, విజువల్ మీడియాలో ఎన్ని స్టేజ్‌లు దాటి మనవరకూ వస్తాయో ఆమె ఒక యంగ్ జర్నలిస్ట్‌లాగా రీసెర్చ్ చేసి, చదువరికి ఎక్కడా విసుగు రాకుండా కథలో ఇమిడ్చి రాశారు. ఈ నవల చదవగానే మొదటగా అందరూ అనుకునేది ఇదే !

కానీ కథలో ఆమె చర్చించిన కొన్ని విషయాలు సీనియర్ రచయిత్రిగా

ఆమె పరిణితిని తెలుపుతున్నాయి. ప్రస్తుతం స్త్రీ పురుష వివాహేతర సంబంధాల విషయంలో సమాజం దృష్టి విచిత్రంగా వుంటోంది ! వివాహం స్త్రీకి భద్రత, మహిళగా ఒక గౌరవమైన స్థానాన్నిస్తుంది. పురుషుడి జీవితంలో రెండో స్త్రీగా ఇష్టంతోనో, గత్యంతరం లేకనో ప్రవేశించిన మహిళకి ఎటువైపు నుంచీ గౌరవం గానీ, భద్రత గానీ దొరకదు. కానీ ఇటువంటి ఆకర్షణలు, సంబంధాలు కలగడానికి గల కారణాలు కాస్త ఆలోచిస్తే, అవకాశం, అందుబాటులో ఉండడం మగవాడికి కారణమైతే, అవసరం, గత్యంతరం లేకపోవడం దీనికి కారణం. ఇలాంటి తప్పటడుగులకి కేవలం ఒకరే కారణం కారు. ఈ రకపు రిలేషన్‌లో కాలం గడుస్తున్న కొద్దీ ఒకరిపట్ల ఒకరికి డిమాండ్స్ పెరిగే తీరు, చివరికి ఒకరి నొకరు భరించలేని దశకు రావడం, జలతారు తెరలు తొలగి వాస్తవ ప్రపంచంలోని కాఠిన్యాన్ని ఎదుర్కోలేక రకరకాల చెడు మార్గాల వైపు మళ్ళడం జరుగుతోంది. ఈ సందర్భంగా కేవలం ఒక సైడ్ తీసుకోక ఇద్దరివైపునా రచయిత్రి రచించిన తీరు, ఆమె ఆలోచనా విధానం ఒక మూసలో కాక ఎంతో ప్రోగ్రెసివ్‌గా ఉంది. ఇదే ఇతివృత్తంతో ఈ నవల తరువాత వచ్చిన "సెక్షన్ 375" సినిమా ప్రస్తావించకుండా ఉండలేను.

ఒక చక్కని ధారలాంటి కథనం కామేశ్వరి గారి సొంతం. మొదలు పెడితే చివరికంటా చదవాల్సిందే ! ఒక భిన్నమైన సబ్జెక్ట్‌తో నవ్యలో ధారావాహికగా వస్తున్నప్పుడే ఎంతోమంది అభిమానాన్ని పొందిన నవల "మహిమ". ఏదైనా సమస్య గురించి చర్చించినప్పుడు పరిష్కారం కూడా సూచించడం నాకు వీరి రచనలలో నచ్చిన అంశం. అలాగే ఈ నవలలో ఒంటరి పోరాటం చేసిన ప్రీతికి కూడా తగిన మార్గం చూపిస్తే మరింత సంపూర్ణంగా వుండేదేమో ! కామేశ్వరిగారు ఇలాగే రాస్తూ ఉండాలి. ఆమె రచనలకోసం ఎదురుచూసే పాఠకులు ఈ తరంలోనూ ఉన్నారు. భగవంతుడు ఆమెకు చక్కటి ఆరోగ్యాన్నీ, మరింత ఉత్సాహాన్నీ ఇచ్చి మరిన్ని చక్కటి రచనలను మాకందించాలని నా శుభకామన !

ఇందిర జొన్నలగడ్డ

16-11-2019

హైదరాబాద్

నామాట



ఈ 'మహిమ' నవల నా 22వ నవల. నవ్య వారపత్రికలో ఏడువారాల సీరియల్ పోటీలో బహుమతి పొందింది. సీరియల్‌గా వచ్చినప్పుడు చాలామంది చదివే వుంటారు. మళ్లీ ఇది పుస్తకంగా తీసుకురానా వద్దా అని తర్జన భర్జన పడి, చాలామంది బావుంది వేయించు అనడం, ఎలాగో యిది నా ఆఖరి పుస్తకం. ఇంక రాసే ఓపిక తగ్గింది, పుస్తకాలుగా వేయించుకునే ఆసక్తి తగ్గిపోయింది. పుస్తక ప్రచురణ అంటే చాలా వ్యవహారమే ఉంటుంది. ప్రూఫులు దిద్దుకోడం, ముందుమాటలు రాయించుకోడం, ముఖచిత్ర డిజైనుల ఎంపిక - అచ్చు వేయించుకోడం ఒక ఎత్తు - అమ్ముకోడం ఒక ఎత్తు. పుస్తకాలు కొనే చదువరులు తగ్గిపోయిన కాలంలో ఒక 500 కాపీలు అమ్ముకోడం అసాధ్యం, గగనం అవుతున్న రోజుల్లో 40, 50 వేలు పెట్టి ఒక రచయిత పుస్తకం వేయించు కోడం సాహసమే ! అయితే కడుపున పుట్టిన బిడ్డలని గాలికి వదిలేయలేం. అలాగే మనసున పుట్టిన యీ రచనని నిర్దయగా మూలపడేయకుండా ఒక పుస్తక రూపంలో భద్రపరిచి ముందు తరాలకి అందించాలన్న బలహీనతకి రచయితలు లొంగిపోయి పుస్తకాలు వేయించుకుంటున్నారు. ఆ కారణంగా యిది నా ఆఖరి పుస్తకంగా నిర్ణయించుకొని (మాట తప్పను, మడం తిప్పను) రంగంలోకి దిగాను. నమ్మండి నా మాట.

ఈ 'మహిమ' కథావస్తువు ఐదేళ్లుగా నా మనసులో వుంది. సరి అయిన సమాచారం కోసం వెతుకుతూ, యిక్కడ అక్కడ విని, కని, చదివి ఆఖరికి కొంత సేకరించి, ముద్రా వ్యవస్థాపకుడు ఎ.జె. కృష్ణమూర్తి గారితో పరిచయం అయ్యాక ఆయనతో చూచాయగా చెపితే తప్పకుండా మీకు కావల్సిన సమాచారం యిస్తానన్నారు. దురదృష్టవశాత్తు ఆయన హఠాత్తుగా పోవడంతో మళ్లీ ఆగిపోయాను. తరువాత ఏడు వారాల సీరియల్‌గా పోటీ అనగానే ఎక్కువ రాయక్కరలేదు. చూద్దాం అని మొదలు పెట్టగానే ఆసువుగా, సుళువుగా దానంతట అదే రాసుకుపోయాను. రాశాక అందరూ నీకీ విషయాలు ఎలా తెలుసు అని ప్రశ్నించారు చాలామంది. మొత్తం మీద దాన్లో తెలియని విషయాలు, ఏమన్నా పొరపాట్లు వున్నాయేమో ఆ రంగంలో వారు చెప్పాలి. కథాగమనం సంక్షిప్తంగా వుంది బాగుందని అందరూ మెచ్చుకున్నారు.

ఈ నవలకి ముందుమాట రాయించుకోడానికి యండమూరి గారిని సందేహిస్తూనే ఆయన ముందుమాట రాస్తారో రాయరో తెలియదు, నాకు ఆయనతో వున్న పరిచయంతో అడిగాను. ఆయన వెంటనే అంగీకరించి, నేను ఆశించిన దానికంటె చాలా గొప్పగా, చక్కగా నవల గురించి, నా గురించి రాసి యిచ్చి నన్ను సంతోష పెట్టడమే కాకుండా, నవల సగం చదివి చాలా యింప్రెస్ అయి వెంటనే చెప్పకుండా వుండలేకపోయానని ఫోను చెయ్యడం నాకు మరింత ఆనందాన్ని, ఉత్సాహాన్ని యిచ్చింది. ఆయన కంటె వయసులో చాలా పెద్ద, రైటర్‌గా సీనియర్ని అయినా తెలుగు సాహిత్యంలో ఆయనకున్న పేరు, ప్రతిష్ఠలు, ఆయన స్థాయి ముందు నేను తక్కువే. లబ్దప్రతిష్టులు నాలుగు మాటలు రాయడం ఏ రచయితకైనా గర్వకారణమే. అందుకు యండమూరికి కృతజ్ఞతాభి వందనాలు.

ఎప్పుడూ సీనియర్లు, ప్రముఖులు, పేరు ప్రతిష్టలు గల వారిచేత

సాధారణంగా ముందు మాటలు రాయించుకుంటాం. దానికి భిన్నంగా నా తరువాత తరం వారు, నా కంటె తెలివైనవారు, విద్యాధికులు, యీ కొత్త తరం వారు ఈ కథని ఏ దృష్టితో చూస్తారు అని తెలుసుకోవాలని యిద్దరు నాతో సన్నిహితంగా, నన్ను అభిమానించి, గౌరవించే వారిని మీ స్పందన తెలియ జేయమని కోరగానే సంతోషంగా అంగీకరించిన శ్రీమతి వారణాసి నాగలక్ష్మి, జొన్నలగడ్డ ఇందిరలకి కృతజ్ఞతలు.

వారణాసి నాగలక్ష్మి నా కూతురు వయసు, విద్యాధికురాలు, స్వయంగా రచయిత్రి , కవయిత్రి, గేయరచయిత్రి, అన్నిటిని మించి మంచి చిత్రకారిణి. మంచి రచయిత్రి, మంచి భాష, శైలి, విశ్లేషకురాలు, ఆమె ఎంత చక్కగా నవల గురించి విశ్లేషించి, నా మీద వున్న అభిమానాన్ని, గౌరవాన్ని ఆమె మాటల్లో చక్కగా వ్యక్తపరిచి చక్కని పరిచయవాక్యాలు రాసినందుకు ఆ అభిమానానికి ఎలా వెలకట్టగలం.

అలాగే ఇందిర. ఆవిడ రచయిత్రి కాదు. గొప్ప చదువరి, పాఠకురాలు, విమర్శకురాలు. అందరూ రచయితలైతే చదివేవారు ఎవరు అన్న ప్రశ్నకి జవాబుగా పుస్తకాలు కొని మరీ చదివి, విమర్శ, విశ్లేషణ చేయగల భాష, భావం, అది అక్షర రూపంలో పెట్టగల దిట్ట ఇందిర. మంచి గాయని, మంచి పాటలు, సినిమాలు, పుస్తకాలు ఆమె అభిమాన అభిరుచులు గల ఇందిర, నేనంటే ఆమెకి వున్న అభిమానం తెల్సినదాన్ని కనక, యీ తరం రచయితలకి ఈ నవల ద్వారా నేనేం చెప్పదలిచానో చక్కగా చెప్పిన ఆమెకీ కృతజ్ఞతలు. అందులో ఇందిర ప్రీతి పాత్రకి ఏదన్నా న్యాయం జరిగేట్టు చూస్తే బాగుండేదేమో అన్నారు. నేను రాసిన యీ నవలలో ప్రీతికే కాదు ఈ తరం అమ్మాయిలందరికి చెప్పేది ఒకటే. నాలుగురాళ్లు గుచ్చుకుంటున్నవని రాజబాట వదిలి పక్కదారిబడితే ఏ వూబిలోనో దిగచ్చు. ముళ్ల కంచెల్లో చిక్కుకోవచ్చు, దారి కనపడక గమ్యం

చేరలేరు - చేరాల్సిన గమ్యాన్ని అందుకోడంలో ఆలస్యం అయినా సవ్యమార్గంలో ప్రయత్నించండి. స్వశక్తిని నమ్ముకోండి. ప్రలోభాలకు లోబడకండి. అలా మోసపోయిన అందరికి న్యాయం జరగాలంటే ఎప్పుడో ఏ పుణ్యాత్ముడో దొరకాలి. ఈ రోజుల్లో అలాంటి అవకాశాలు మృగ్యం. అందుకే లేనిదానికోసం ఆరాటం, అర్రులు చాచకండి. ఇదే నా సందేశం ఈ నవలలో...

అందరికి వందనాలు ...

డి. కామేశ్వరి

మహిమ

"సో, యూ ఆర్ ఫ్రమ్ 'ముద్రా ఇనిస్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్స్' అహ్మదాబాద్ ! అయామ్ ఇంప్రెస్‌డ్ విత్ యువర్ బయోడేటా'' మహిమ బయోడేటా కాగితాలు పరిశీలిస్తూ అవినాష్ జైన్ అన్నాడు.

"థాంక్స్ సార్ ! మీ ప్రకటన నన్నూ ఇంప్రెస్ చేసింది. 'మీలో భావుకత ఉందా ? భావాన్ని మాటల్లో పొదగగల సృజనాత్మకశక్తి మీలో ఉంటే, మీరే మాకు కావాల్సినవారు' ప్రకటనలోని వాక్యాలను తన నోటివెంట వినిపిస్తూ, మహిమ చిరునవ్వు నవ్వింది.

ఇంటర్వ్యూకి వచ్చిన అభ్యర్థి అంత నిర్భయంగా, అంత ఆత్మవిశ్వాసంతో ప్రవర్తించడం తనకు నచ్చినట్లు అవినాష్ ముఖంలో మెచ్చుకోలు. పక్కనే కూర్చున్న కొడుకు విశాల్ వంక భావగర్భితంగా చూశాడు. ఆమెనే పట్టిపట్టి చూస్తున్న కొడుకు కళ్ళల్లో మెరుపు ఆయన దృష్టిని దాటిపోలేదు. ఈసారి కాగితాల మీదనుంచి మహిమ ముఖం వైపు తిరిగింది ఆయన చూపు. తెలుపు పసుపు కలిసిన ఛాయ, భుజాలవరకు కత్తిరించిన జుత్తు, ఆత్మవిశ్వాసం తొణికిసలాడే కళ్లు. సగం చేతుల కుర్తా, లూజు సల్వార్, మెడకి వేలాడుతున్న చున్నీ, కుడిచేతికి రెండు బంగారు గాజులు, ఎడమచేతికి వాచి, వేలికి చిన్న ఉంగరం, చెవులకి చిన్న డైమండ్ దుద్దులు, నుదుట బొట్టు, కళ్లకి కాటుక. సింపుల్‌గా ఉన్నా ఏదో తెలియని హుందాతనం, దర్జా ఆమె వేషంలో కనిపించింది.

"సో, యూ థింక్ యు హేవ్ గాట్ ఆల్ దట్ క్వాలిటీస్" చిరునవ్వుతో అడిగాడు.

"అందుకేగా ఇంటర్వ్యూకి వచ్చాను" అదే చిరునవ్వుతో జవాబిచ్చింది.

"ఓకే, లెటజ్ సీ !" అంటూ ఒక్క క్షణం ఆలోచించి, "చూడండి మిస్ మహిమ ఒక డోర్‌మేట్ ప్రకటనలో 'మీ పాదాల ముందు మా అందాలు' అని ఉంది. అది అంత సహజంగా ఉందని నాకనిపించలేదు. అవే పదాలు ఉపయోగిస్తూ అంతకంటే అర్థవంతంగా, సహజంగా ఉండేట్టు మార్చి చెప్పగలరా?" అని అడిగాడు.

మహిమ ఒక్కక్షణం ఆలోచించి ... "మా అందాలు మీ పాదలముందు" అనాలి. కాని నాకెందుకో 'మా అందాలు మీ పాదాలకోసం' అంటే ఇంకాస్త అర్థవంతంగా ఉంటుందనిపిస్తోంది".

మొహంలో భావం మార్చకపోయినా ఆయన కళ్ళల్లో ప్రశంస కనపడింది. "సరే, ఒక కొత్త డిటర్జెంట్ పౌడరు మార్కెట్‌లోకి రావాలి. ఎన్నోరకాల సబ్బులు, పౌడర్లు ఉండగా కొత్త ప్రోడక్ట్‌ని ఆకర్షణీయంగా మార్కెట్ చెయ్యాలంటే ... ఎంతో ఆకర్షించే, ఆకట్టుకునే ప్రకటన ఉండాలి. అలాంటి ఒకటి ఏదన్నా చెప్పగలరా ?" కంపెనీ డైరెక్టర్ విశాల్ అడిగాడీసారి. మహిమ రెండు నిమిషాలు కళ్లు మూసుకుంది. తరువాత కళ్లు తెరిచి విశాల్ వంక సూటిగా చూస్తూ "మా కొత్త డిటర్జెంట్ పౌడరునే వాడమని మేము చెప్పము. కానీ వాడితే మాత్రం మీరు మమ్మల్ని క్షమించరు ... 'ఇన్నాళ్లు ఆలస్యం చేసినందుకు' ! ప్రజలను పాజిటివ్ అప్రోచ్ కంటే నెగెటివ్ అప్రోచే ఎక్కువ ఆకర్షిస్తుందని నా ఉద్దేశం" నిబ్బరంగా ఇద్దరివంకా చూస్తూ అంది మహిమ.

ఒక్కక్షణం ఇద్దరూ విస్మయంగా చూస్తుండిపోయారు. తరువాత తేరుకుని చప్పట్లు కొట్టి, "వెల్ సెడ్ మహిమ" అన్నాడు అవినాష్ ఆనందంగా. విశాల్ అయితే అభినందనపూర్వకంగా చూస్తుండిపోయాడు.

"సరే, ఇది చెప్పండి. ఒక ప్రొడక్షన్ తయారీలో ప్రకటనల కోసం ఎంత వరకు ఖర్చుపెట్టడం సబబుగా ఉంటుంది ?'' అవినాష్ అడిగాడు.

"ఓ ప్రొడక్షన్ బయటికి రావాలంటే వంద రూపాయల్లో ఇరవై రూపాయలు మెటీరియల్ కాస్ట్, ఇంకో ఇరవై ప్రొడక్షన్ కాస్ట్, నలభై రూపాయలు ప్రకటనలకి ఖర్చుపెట్టాల్సి ఉంటుంది. వందకి ఇరవై శాతం లాభం మిగలకపోతే నష్టపోతారు''.

"నలభై శాతం ప్రకటనలకి ఖర్చు చెయ్యడం అవసరమా ?''

"ఆ ఖర్చు తప్పనిసరి. ఏదన్నా వస్తువు తయారుచేయడం సులభమే కానీ, మార్కెటింగ్ కష్టం. వస్తువు తయారయ్యాక ప్రజలలోకి వెళ్లి అమ్ముడవకపోతే ఏం లాభం ? అంచేత ప్రకటనల ఖర్చు తగ్గించి లాభం పెంచుకోవాలనుకోవడం అవివేకం'' మహిమ నిష్కర్షగానే చెప్పింది.

"కొత్త ప్రోడక్ట్ సరే, మరి పాతవీ, మార్కెట్‌లో నిలదొక్కుకున్న వాటికీ అంత ఖర్చు అవసరమా ?''

"అవసరమే ! రోజురోజుకీ మార్కెట్‌లోకి ఎన్నో కొత్త రకాల వస్తువులు వస్తున్నాయి. వినియోగదారుడు కొత్తవాటి మోజులో పాతవి మర్చిపోకుండా ప్రకటనలు వస్తుండాలి. అంతగా అయితే ఒక పదిశాతం ఖర్చు తగ్గించుకునే వీలుండచ్చు ...''

"ఈ మధ్య కొన్ని ప్రోడక్ట్స్ లాభాలు తగ్గిపోవడం, కాంపిటీషన్ పెరిగి పోవడంతో ఎక్కువ ఖరీదు పెడితే వినియోగదారులు కొనరని, వెయిట్ తగ్గించి అదే ధరకి అమ్ముతున్నారన్న విషయం బయటికి వచ్చింది. దాన్ని మీరెలా సమర్థిస్తారు ?''

"అవును సార్ ! కొంతమంది చాలా తెలివిగా సబ్బులు, టూత్‌పేస్టులు, సబ్బు పౌడర్లు వగైరా వాటి డిజైన్లు, షేపులు మార్చి వెయిట్ తగ్గించి లోటు భర్తీ చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారన్న వార్తలు వచ్చాయి. అది వినియోగదారుడిని

మోసం చెయ్యడం కిందకి వస్తుంది. ఒకసారి నమ్మకం, విశ్వాసం కోల్పోతే ఆ కంపెనీని జనం నమ్మరు. కనుక అది మంచి పద్ధతి కాదు''.

తండ్రీ కొడుకూ మొహాలు చూసుకున్నారు. "ఓకే యంగ్‌లేడీ ! బయట కాసేపు వెయిట్ చేయండి. ఇంకా కొందరున్నారు ఇంటర్వ్యూకి. వారిని కూడా ఇంటర్వ్యూ చేశాక, కొద్ది నిమిషాలలో ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయినవారి పేర్లు ప్రకటిస్తాం. గుడ్ డే ..." అన్నాడు అవినాష్ జైన్, కంపెనీ ఛైర్మన్.

"థ్యాంక్యూ సర్" మర్యాద పూర్వకంగా అని మహిమ బయటికి వెళ్ళింది.

ముప్పావుగంట తరువాత మహిమకి లోపలికిరమ్మని పిలుపు వచ్చింది. ఇంటర్వ్యూ అయ్యాక ఎందుకో తను సెలెక్ట్ అవుతానన్న నమ్మకం కలిగింది మహిమకి. ఆ నమ్మకం వమ్ముకాలేదన్నట్లు, "కంగ్రాట్స్ మిస్ మహిమ ! యూ ఆర్ సెలెక్టెడ్ ! మీ జీతం, పెర్క్స్, మీ బాధ్యతలు, మా రూల్స్ అన్ని వివరాలు ఈ ఫారంలో ఉన్నాయి. చదివి మీకు అంగీకారం అయితే సంతకాలు పెట్టి ఇచ్చి వెళ్ళండి. మా నిబంధనలు అంగీకరిస్తే, మీరు రేపే జాయిన్ అవ్వచ్చు" కాగితాలు అందిస్తూ అన్నాడు అవినాష్.

కాగితాలు ఒకసారి చకచక చదివేసి అంగీకారంగా తల ఆడించి, "థాంక్యూ సర్ !" అంటూ సంతకాలు పెట్టింది.

"బై ది బై ... మీకు అకామడేషన్ ఉందా ? మీరు ఉండేది ఎక్కడ ? ట్రాన్స్‌పోర్ట్ ఉందా ?" విశాల్ వివరాలు అడిగాడు.

"నేను వైజాగ్ నుంచి వచ్చాను. ఏదన్నా వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ గాని, పేయింగ్ గెస్ట్ అకామడేషన్ గాని చూసుకోవాలి. ప్రస్తుతం మా కజిన్ బ్రదర్ దగ్గర దిగాను''.

"అలాగా. ఎందుకడిగానంటే ... ఈ ఆఫీసులో పనిచేసే అమ్మాయిలు ఐదారుగురు కలిసి, దగ్గరలో ఒక అపార్ట్‌మెంట్ అద్దెకు తీసుకుని షేర్ చేసుకుని ఉంటున్నారు. జస్ట్ ఎ మినిట్" అంటూ ఇంటర్‌కమ్ నొక్కి "సోనీ, మన ఆర్టిస్ట్ సెక్షన్‌లో పనిచేసే సీమని ఒకసారి రమ్మను" అన్నాడు విశాల్.

కాసేపటికి సీమ లోపలికి వచ్చి వినయంగా నమస్కారం చేసింది.

"ఆ, సీమా, ఈమె మహిమ. కొత్తగా మన కంపెనీలో చేరుతున్నారు. ఆమెకి అకామడేషన్ కావాలి. మీ అపార్ట్‌మెంట్స్‌లో ఏమన్నా ఖాళీ ఉందా ? మీ దాన్లో లేకపోతే ఇంకో రెండు మూడు ఉన్నట్టున్నాయి గదా, ఎనీ వేకెన్సీ ?" విశాల్ ఆరాతీశాడు.

"వారం కిందట నయన సింగిల్ బెడ్‌రూమ్ తీసుకుని వెళ్లిపోయింది. తను ఆ రూములో వర్షతో షేర్ చేసుకు ఉండవచ్చు సార్" అంది సీమ.

"సో, మీకు ఈ ఏర్పాటు నచ్చితే సీమతో ఈ విషయం మాట్లాడి, అపార్ట్ మెంట్ చూసుకుని సెటిల్ చేసుకోండి" అవినాష్ ఫైలు తీసుకుంటూ అన్నాడు.

"థాంక్స్ సీమగారు ! అకామడేషన్ వెతుక్కునే బాధ తప్పించారు" బయటికి వచ్చాక మహిమ అంది. "రండి నా క్యాబిన్‌లో కూర్చుని మాట్లాడుకుందాం" సీమ తన సీటువైపు దారితీస్తూ అంది.

ఎస్టాబ్లిష్‌మెంట్... ఇంత పెద్ద కార్పోరేట్ లెవల్లో ఉంటుందని అనుకోలేదు మహిమ. పూర్తిగా ఎయిర్ కండీషన్డ్ ఆఫీసు. అందమైన పరదాలు, పూలగుత్తులు. చిన్న చిన్న క్యూబిక్స్. ప్రతి సీటు ముందు కంప్యూటర్లు. ఎవరి పనులు వారు నిశ్శబ్దంగా చేసుకుంటున్నారు. ఆ అంతస్తులోనే వందమంది దాకా ఉన్నారు. ఒక్కో అంతస్తులో ప్రత్యేకంగా రిసెప్షన్ కౌంటర్. చూస్తుంటే సంతోషంతో మహిమ మనసు నిండిపోయింది. ఇలాంటిచోట ఉద్యోగం దొరకడం తన అదృష్టం. ముద్రా కమ్యూనికేషన్స్‌లో సీటు రావడమే ఒక అదృష్టం అనుకుంటే, చదువవగానే ఇంత పెద్ద అడ్వర్‌టైజింగ్ ఏజెన్సీలో ఉద్యోగావకాశం తన అభిరుచికి తగిన అవకాశం.

"సీమగారూ, మీ ప్లేస్‌మెంట్ ఏమిటి ?" సీమ చూపించిన సీట్లో కూర్చుంటూ అడిగింది మహిమ.

"కాల్ మీ సీమ. గారులు అవి అక్కరలేదు. నేనిక్కడ ఆర్టిస్ట్‌ని. వచ్చిన కాప్షన్స్‌కి బొమ్మలు గీయాలి. పత్రికలలో ప్రకటనలకి".

"ఓ ! చిత్రకారిణి అన్నమాట. ఐ యామ్ హ్యాపీ టు మీట్ యూ" అంది మహిమ సంతోషంగా.

"మా అపార్ట్‌మెంట్స్‌లో మూడు బెడ్‌రూముల ప్లాట్లు రెండు అద్దెకి తీసుకున్నాము. ఇక్కడ పనిచేసే అమ్మాయిలం కొందరం కలిసి ఒక్కొక్క రూములో ఇద్దరం ఉంటున్నాం. డ్రాయింగు, కిచెను, డైనింగ్ కామన్. మూడు గదులకు మూడు బాత్‌రూములు.

"మరి భోజనం ... వంట చేసుకుంటారా అంతా కలిసి ?"

"అబ్బే ... ఈ ఉద్యోగాలతో అంత ఓపిక ఎక్కడ ? ఒక పనమ్మాయి ఉంది. అన్ని పనులు తనే చేస్తుంది. ఆరుగురికి వంట, ఇంటిపని అంతా తనే. బాగానే జీతం ఇస్తాం. ఖర్చు సమంగా పంచుకుంటాం".

"ఓ గ్రేట్ అన్నీ బాగున్నాయి. నా రూమ్మేట్ ఎవరు" కుతూహలంగా అడిగింది.

సీమ నవ్వి "నేనే ! ఇఫ్ యూ డోంట్ మైండ్ !" వర్ష రూముకి నా రూమ్మేట్ వెడతానంది.

"బాగుంది. ముందొచ్చి సెటిల్ అయింది మీరు. మీకే ఏదన్నా అభ్యంతరం ..."

"నో నో ! చూడగానే నువ్వెందుకో నచ్చేశావు. నిజానికి వర్ష రూములో ఖాళీ ఉంది. కాని నిన్ను నా రూమ్మేట్ చేసుకోవాలనిపించింది" భుజం తట్టి ఆప్యాయంగా అంది సీమ.

"థాంక్స్ సీమా ..." మహిమ మనస్ఫూర్తిగా అంది. "ఓకే డన్ ! ఇవాళ మీతో వచ్చి ఇల్లు చూసి, రేపు లగేజ్ తెచ్చుకుంటా".

"సరే. అలా అయితే ఓ అరగంట రిసెప్షన్‌లో కూర్చో పని పూర్తిచేసి వస్తా".

మహిమ రిసెప్షన్ వైపు నడిచింది. సీమ వచ్చేలోగా ఓసారి ఆఫీసంతా

చుట్టి రావాలనిపించింది. రిసెప్షన్‌లో అడిగింది. ఆమె నవ్వి తల ఊపి "ఫిఫ్త్‌ఫ్లోర్ నుండి మొదలుపెట్టండి. విజువల్ సెక్షన్! ఇంటరెస్టింగ్‌గా ఉంటుంది" రిసెప్షనిస్ట్ సలహా ఇచ్చింది. లిఫ్ట్‌లో ఐదో అంతస్తుకి వెళ్ళింది మహిమ.

పెద్ద కార్పొరేట్ ఆఫీసు లెవల్లో ఎంతో ఆధునికంగా ఉంది ఆఫీసు. ఐదో అంతస్తు మొత్తం విజువల్స్. అంటే చాలామటుకు ఇండోర్‌లో చిన్న చిన్న యాడ్స్ షూట్ చేస్తూ ఉంటారు. వంటగది, బాత్‌రూమ్, డాక్టర్ ఛాంబర్ ... లాంటి వాటిల్లో ప్రకటనలకి సరిపోయే చిన్న చిన్న సెట్స్ కొన్ని, స్టూడియోలు, మేకప్ రూములు, రకరకాల ఆర్టిస్ట్‌లు మేకప్‌లతో, మెడలో ఐడెంటిటీ కార్డులు వేలాడేసుకుని ఎవరి పనులతో వారు బిజీగా ఉన్నారు. ఓ చోట ఏదో షూటింగ్ జరుగుతోంది. లైట్స్ ఆన్, కెమెరా అంటూ మాటలు వినిపిస్తున్నాయి. కొందరమ్మాయిలు, జూనియర్ ఆర్టిస్ట్‌లు కాబోలు చేతిలో కాగితాలు చూసుకుంటూ స్క్రిప్టు కాబోలు చదువు కుంటున్నారు. కట్ ... లైట్సాఫ్ ... నిశ్శబ్దంగా స్టూడియో తలుపులు మూసి మిగతా ఆఫీసు అంతా తిరిగింది.

నాలుగో ఫ్లోర్‌లో విజువల్స్ చూస్తూ, మార్పులు చేర్పులు చేసుకుంటూ ఎవరి పనిలో వారున్నారు. షూట్ అయి వచ్చిన ప్రకటనలని ఏ చిన్న తప్పు లేకుండా చూస్తూ, ఎడిట్ చేస్తూ, నెంబర్లేస్తూ, పేర్లురాస్తూ, పై అధికార్ల చేత ఓకే చేయించాక టీ.వి.లకి, ప్రింట్ మీడియాకి వెళ్ళాల్సిన సెక్షన్ల వారీగా సి.డి.లు ర్యాక్‌ల నిండా సర్దివున్నాయి.

మూడో ఫ్లోరంతా క్రియేటివ్, కమ్యూనికేషన్ సెక్షన్. ప్రతివాళ్ల ప్రకటనలకి కావల్సిన స్క్రిప్టులు తయారుచేస్తూ, కంప్యూటర్లతో కుస్తీపడుతున్నారు. తను పని చేయబోయేది ఈ సెక్షన్ అన్నమాట. కొత్తగా ఆర్డరు వచ్చిన ప్రకటనలకి, ప్రోడక్టులకి స్క్రిప్టు సిద్ధమయ్యేది ఇక్కడే. వివిధ ప్రకటనల విజువల్స్ తయారు చేసే డైరెక్టర్స్, ప్రొడ్యూసర్లు, ఎడిటర్లు, మ్యూజిక్, ఆర్టిస్టులు అంతా విజువల్ డిపార్ట్ మెంట్ కిందకి వస్తారు. ముద్రా కమ్యూనికేషన్స్‌లో ట్రైనింగ్ పీరియడ్‌లో ప్రతి డిపార్ట్‌మెంట్, సెక్షన్స్ గురించి చెపుతారు. వాళ్ళ సెక్షన్స్‌తోటే కాక అన్ని

సెక్షన్స్‌తో ఇంటరాక్షన్ ఉంటుంది. ఆఖరి నిమిషంలో ఏ డైరెక్టరుకో ఇంకో మంచి ఐడియా తట్టి స్క్రిప్టులో మార్పులు చేర్పులు సూచించవచ్చు. సి.డి. వచ్చాక ఓకే చేసే ముందు తాము ఇచ్చిన స్క్రిప్టుకి అనుగుణంగా యాడ్ తయారయిందో లేదో, భావం సరిగ్గా ప్రజెంట్ చేశారో లేదో చూసి సంతృప్తి చెందాకే ఓకే చెయ్యాలి. అలాగే ప్రకటనకి కావల్సిన ఖర్చుకి ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ శాంక్షన్ తీసుకోవాలి. క్రియేటివ్ డిపార్ట్‌మెంట్‌లో భారతీయ భాషలన్నింటిలోకి ప్రకటనలు తయారవు తాయి. ముందు ఇంగ్లీషు తయారుచేసి తరువాత తర్జుమా చేస్తారు కాపీరైటర్స్. దాన్ని పర్యవేక్షించడానికి ఒక సీనియర్ రైటరుంటారు.

రెండో ఫ్లోర్ అంతా అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్. ఛైర్మన్, డైరెక్టర్లు, ఫైనాన్స్ డైరెక్టర్, అకౌంట్స్ విభాగాలున్నాయి.

ఫస్ట్‌ఫ్లోరంతా అవుట్‌డోర్ యూనిట్. సామాన్లు, ప్రొడక్షన్ మెటీరియల్, స్టోర్స్, క్యాంటిన్ అన్నీ ఉన్నాయి. అండర్ గ్రౌండ్ పార్కింగ్‌లో షూటింగ్ వ్యాన్స్, అందరి కార్లకి పార్కింగ్ ప్లేస్‌లు అలాట్ చేసి ఉన్నాయి.

అంతా చుట్టివచ్చేసరికి సీమ వచ్చింది. "సారీ ! కాస్త ఆలస్యం అయింది. పద వెడదాం'' అంది.

"ఫరవాలేదు, ఆఫీసంతా చూసి వచ్చాను ఈలోగా ...''

"ఇదో సముద్రం. మొత్తం నాలుగు వందల స్టాఫ్ ఉన్నారు. కాంట్రాక్ట్ ఆర్టిస్టులు కాక ఎవరెవరో కూడా సరిగా గుర్తుండరు, ఒకే ఆఫీసులో పనిచేస్తున్నా. అపార్ట్‌మెంట్‌లో కలిసి ఉన్నవాళ్లం స్నేహితులవుతాం. మిగతా అంతా పని వరకే పరిచయం. పద వెడదాం'' స్కూటీ స్టాండ్ వైపు నడిచింది.

"ఓ స్కూటీ ఉందా ?''

"ఆ ... అపార్ట్‌మెంట్‌కి ఇక్కడికి ఒక కిలోమీటరు కూడా ఉండదు. నడిచే దూరం కాదు. రోజూ ఆటోలకి, క్యాబ్‌లకి ఎక్కడ ఖర్చుపెట్టగలం. నీకు స్కూటీ నడపడం వచ్చా ...''

"ఓ ఎస్'' అంది మహిమ ఉత్సాహంగా.

"మరింకేం. నీకెప్పుడు కావల్సి వచ్చినా, నాది వాడుకో. కొత్తది కొనుక్కో. లోన్ కావాలంటే ఇస్తారు'' అంది సీమ.

మెయిన్‌రోడ్ మీద నుంచి, ఓ సందులోకి దారితీసి, మై హోమ్ అపార్ట్‌మెంట్ గేట్‌లోంచి బేస్‌మెంట్‌లోకి తీసుకెళ్ళి తన స్కూటీని పార్క్ చేసింది సీమ.

"ఇదే మా అపార్ట్‌మెంట్. మన ఫ్లాట్ థర్డ్‌ఫ్లోర్‌లొ ఉంది. రా'' ఇద్దరూ లిఫ్ట్‌లో పైకి వెళ్ళారు. "ఇవిగో ... 304, 306 ఈ రెండు ఫ్లాట్‌లు మనవే. మేం అందరం కలిసి తీసుకున్నాం. ఎదురెదురుగా ఉన్నాయి రెండు ఫ్లాట్లు. లోపలికి వెళ్ళగానే డ్రాయింగ్ రూము, సోఫాసెట్టు, టీ.వి., ఓ పక్క డైనింగ్ టేబుల్ ఉన్నాయి.

"ఇదిగో, ఇది మన రూము'' అంది సీమ.

ఓ మాదిరిగా గది పెద్దదే. రెండు కిటికీల దగ్గర రెండు మంచాలు. ఎవరి మంచం దగ్గర వారికి టేబిల్, రెండు కప్‌బోర్డ్‌లు. సీమ టేబిల్ ... కంప్యూటర్, పుస్తకాలు ... సామానుతో నిండి ఉంది. గదికి ఆనుకుని చిన్న బాల్కనీ ఉంది. బట్టలు ఆరేసున్నాయి. రెండు ప్లాస్టిక్ కుర్చీలు, బాత్‌రూమ్, గీజరు, షవరు అన్నీ సదుపాయంగా ఉన్నాయనిపించింది.

"ఓ గుడ్ ! చాలా బాగుంది రూము. ఇద్దరికి కంఫర్టబుల్‌గా సరిపోతుంది. ఒకరికొకరు తోడు. చక్కగా కబుర్లు చెప్పుకోవచ్చు'' సంతోషంగా అంది మహిమ.

"సరే అయితే, రేప్పొద్దున ఎనిమిది గంటలకల్లా సామానుతో వచ్చేయి. సామానిక్కడ పడేసి ఆఫీసుకు వెడదాం. టిఫిన్ ఇక్కడే చేద్దాం'' అంటూ "రేణుకా ...'' అని పిలిచింది సీమ. వంటింట్లో పనిచేస్తున్న ముప్ఫై, ముప్ఫై ఐదేళ్ల పనమ్మాయి వచ్చింది. "రేణుక ... ఈ అమ్మాయి మహిమ. రేపటి నుంచి నా రూమ్మేట్. తనూ రేపు టిఫిన్ చేస్తుంది. తనకు కూడా లంచ్ బాక్స్ ఇవ్వాలి'' అని రేణుకకు చెప్పి, మహిమ వైపు తిరిగింది.

"తను రేణుక. మన పన్లన్నీ చూస్తుంది. వంట అన్నీ తనే. నీకేం కావాలన్నా తనని అడుగు" అంది సీమ. "నమస్తే అమ్మా" అంది రేణుక. "ఇంక నేను రేపటినుంచి ఇక్కడి మెంబర్‌ని" నవ్వుతూ అంది మహిమ.

"ఇంకా అందరూ ఇంటికి వచ్చినట్టు లేదు. అందరిని రేపు పరిచయం చేస్తా, ఇంక బయలుదేరు. మళ్ళీ ఆలస్యం అవుతుంది. ఎనిమిదికల్లా రావాలి, ఆలస్యం చేయొద్దు. ఇల్లు కనుక్కోగలవు గదా ! అన్నట్టు నా సెల్ నెంబర్ నోట్ చేసుకో, నీది నాకు చెప్పు" అంటూ నెంబర్ తీసుకుంది. "బై సీమా ... సీ యూ టుమారో" అంటూ వెళ్ళింది మహిమ. ఇంత మంచి అకామడేషన్, ఇంత మంచి రూమ్మేటు, మంచి ఉద్యోగం ... మహిమకి గాలిలో తేలిపోతున్నట్లు సంబరంగా ఉంది.

※ ※ ※

"డాడీ ! నాకు ఉద్యోగం వచ్చేసింది. జీతమెంతో తెలుసా ? గెస్ ! అకామడేషన్ కూడా దొరికింది. ఆ కంపెనీలోనే పనిచేసే అమ్మాయిలు కొందరు అపార్ట్‌మెంట్‌లో రెండు ఫ్లాట్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. వారిలో ఒకరితో రూమ్ షేర్ చేసుకుంటాను. ఎవ్రీథింగ్ సెటిల్డ్. రేపే రూముకి షిఫ్ట్ అవుతున్నా" రాత్రి ఇంటికి ఫోను చేసింది మహిమ, చాలా ఉద్విగ్నంగా.

"ఓ ... గ్రేట్" సంతోషంగా అన్నాడు కృష్ణమూర్తి. "జాగ్రత్తమ్మా ! ప్రకటనల ప్రపంచంలో అనేకానేక కథలు వింటుంటాం. ఎంత తొందరగా పైకి వెళ్ళొచ్చో అంత త్వరగాను కిందకి జారచ్చు. నీ లిమిట్స్ దాటకు. నీ రూమ్మేట్ మంచి అమ్మాయేనా ? చెడు అలవాట్లకి ..."

"అబ్బ డాడీ ... నేనేమైనా టీనేజ్ అమ్మాయినా ? నా లిమిట్స్ నాకు తెలుసు డాడీ. నేను చేసేది క్రియేటివ్ జాబ్. మోడల్‌ని, యాక్టర్‌ని కాను, డెస్క్ వర్క్ నాది. డాడీ, ఆఫీసు ఎంత పెద్దదో తెలుసా ? ఎన్ని సెక్షన్స్ ఉన్నాయో?

నాలుగైదు వందలమంది స్టాఫ్. నన్ను చూసి మా బాస్ ఇంప్రెస్ అయినట్టే కనిపించాడు. జవాబులు విని ఓపెన్‌గానే మెచ్చుకున్నారు'' సంతోషంగా అంది.

“మంచిది. కీపిట్ ఆప్. రూమ్‌కి మారాక అడ్రసు, అది ఇవ్వు. సెల్‌ఫోను దగ్గరుంచుకో. అన్నట్టు భోజనం అది ...''

“ఆ చెప్పలేదు కదూ ... మర్చిపోయా. అందరూ కలిసి వంటపని, మిగతా పనులు చూసేందుకు పనమ్మాయిని పెట్టుకున్నారు. మూడు బెడ్‌రూముల్లో ఆరుగురం ఉంటాం. అందరికి వంట, టిఫిన్లు అన్నీ చూస్తుంది. ఖర్చులు అందరం షేర్ చేసుకుంటాం. ఏ ప్రాబ్లమ్ లేదు డాడీ ...''

“సరే మహీ ! ఫోను చేస్తాండు. మీ మమ్మీ పడుకుంది. రేపు రూముకి షిఫ్ట్ అయ్యాక అమ్మతో మాట్లాడు. ఓకే బై గుడ్‌నైట్'' నిశ్చింతగా సోఫాలో వెనక్కి వాలారు ఆయన. కూతురు అహ్మదాబాద్ సీటు కోసం ఎంత కష్టపడి చదివిందో ఆయనకి తెలుసు. ఇంజనీరింగ్ చదవమంటే కాదని, తన అభిరుచి క్రియేటివ్ రైటింగ్ అని, యాడ్ వరల్డ్‌లో రాణించాలని కలలు కంది. మొదటి మెట్టు ఎక్కింది. ఇంక పరవాలేదు. నిశ్చింతగా అనిపించింది.

✲ ✲ ✲

రెండు సూట్‌కేసులు, ఓ షోల్డర్ బ్యాగుతో ఎనిమిది గంటలకల్లా అపార్ట్ మెంట్‌కు వచ్చింది మహిమ. “వెల్‌కమ్ వెల్‌కమ్'' అంటూ సీమ సంతోషంగా చేయిచాపి చేతిలో సామాన్లు అందుకుంది. అప్పటికింకా నైట్‌గౌనులోనే ఉంది. మొహం నిండా ఏదో క్రీము పట్టించింది. జుత్తుకు నూనె. “రా, ఇదిగో ఈ కప్ బోర్డ్ నీది. బట్టలు తీసి సర్దేసుకో. ఈ టేబిల్ మీద నీ సామానేం పెట్టుకుంటావో పెట్టుకో. ఈలోగా నేను స్నానం చేసి వస్తా. తరువాత టిఫిన్ చేద్దాం'' అంటూ బాత్‌రూములో దూరింది.

బట్టలన్నీ తెచ్చుకున్న హాంగర్లకి తగిలించి, వార్డ్‌రోబ్‌లో మంచిబట్టలు

ఒక వైపు, రోజా కట్టుకునేవి ఒకవైపు ఎక్కడికక్కడ నీట్‌గా సర్దుకుంది. అడుగున ఉన్న అరలో చెప్పులు, ఇంటి నుంచి తెచ్చుకున్న సబ్బులు, షాంపూలు, టూత్‌పేస్ట్‌లు పెట్టింది. అద్దం ముందు రోజా వాడుకునే మామూలు మేకప్ సామానులు పెట్టుకుంది. టేబుల్‌మీద ల్యాప్‌టాప్, పుస్తకాలు, టూ ఇన్ వన్ డైరీలు, కాగితాలు, పెన్నులు లాంటివన్నీ సర్దుకుంది.

"గుడ్ ! అయిపోయిందా ?" అంటూ జుత్తును డ్రయ్యర్‌లో ఆరబెట్టు కుంటూ చుట్టూ చూసింది. 'మన ఆఫీసుకి డ్రస్ కోడ్ లేదు. సల్వార్ కుర్తా, జీన్స్, లాంగ్ స్కర్ట్స్ ఏవయినా మన ఇష్టం వచ్చినవి వేసుకోవచ్చు. జుత్తు దువ్వి పైకి లాగి క్లిప్ పెట్టి, "పద టిఫిన్ చేద్దాం. అక్కడ అందరం కలుస్తాం గదా. అందరికి పరిచయం చేస్తాను" ఎనిమిదిన్నరకల్లా టిఫిన్ టేబిల్ దగ్గరకి వెళ్లాలి అందరూ. ఏ రోజన్నా సెలవుపెట్టినా, ఇంకేదన్నా పని ఉండి వెడితే ముందుగా రేణుకకి చెపితే వేరే పెట్టి ఉంచుతుంది టిఫిన్. ఉతకాల్సిన బట్టలు బాత్‌రూములో బాల్చీలో నానపెట్టాలి. రా" అంటూ డైనింగ్ హాల్లోకి తీసుకెళ్లింది. అప్పటికే నలుగురమ్మాయిలు టేబిల్ ముందు కూర్చుని మాట్లాడుకుంటున్నారు".

"హాయ్ ..." అన్నారంతా. మహిమని చూసి "కొత్త రూమ్మేటా ?"

"ఆ ... మహిమ. క్రియేటివ్ సెక్షన్‌లో ఇవాళే జాయిన్ అవుతోంది. మనతో ఉంటుంది. నా రూమ్మేట్. పేరెంట్స్ వైజాగ్‌లో ఉంటారు" అని చెప్పి, "మహిమ ... తను స్రవంతి. ఫైనాన్స్‌లో ఉంది ..."

చామనచాయ రంగు, పెద్దకళ్ళు, తెలివైన మొహం. నవ్వుతూ చేయిచాచి, "హాయ్, వెల్‌కమ్ టు అవర్ నెస్ట్" అంది మహిమ చెయ్యినొక్కి.

"ఈమె మంగళ. క్రియేటివ్ సెక్షన్‌లో తమిళ సెక్షన్. మద్రాసు పొన్ను" అంది నవ్వి సీమ. తమిళ అమ్మాయని చెప్పకపోయినా గుర్తుపట్టేట్లు, స్టిక్కర్ పైన విభూతి బొట్టు, కాటన్ సల్వార్ కుర్తా. సింపుల్‌గా ఉంది. పలకరింపుగా నవ్వి "హాయ్ ..." అని.

"ఇదిగో తను ఆరతి. విజువల్స్. ఇప్పుడిప్పుడే చిన్న చిన్న యాడ్స్‌లో యాక్ట్ చేస్తోంది. చేరి ఆర్నెల్లయిందిలే ... మంచి మోడల్ అయిపోవాలని, ఆ తర్వాత ఫ్యాషన్ వరల్డ్‌లోకి వెళ్లిపోవాలని, ఆ తరువాత దేవుడనుగ్రహిస్తే సినిమాల్లోకి ... చాలా చాలా కలలున్నాయి" హాస్యంగా అంది సీమ.

"యార్, నవ్వకు. ఏదో ఒకరోజు సినిమాతారనయిపోయి చూపిస్తా" తనూ నవ్వుతూ స్పోర్టివ్‌గా అంది ఆరతి. మార్వాడీ అమ్మాయి. చక్కగా, అందంగా ... అందం కంటే ఆకర్షణీయంగా ఉంది. కళైన మొహం. చూడగానే బాగుంది అనిపిస్తుంది. సినీతార కాదగ్గ అర్హతలన్నీ ఉన్నాయి. యాడ్ వరల్డ్ నుంచి ఎంత మంది సినీరంగానికి వెళ్లలేదు. ఆరతి మహిమని చూస్తూ చేయిపట్టుకు స్నేహంగా "క్రియేటివ్ సెక్షనేమిటి, ఇంత చక్కగా ఉన్నావు. రాంగ్ ఛాయిస్. యాడ్ వరల్డ్‌లో ఉండాలి నీవు" అంది చనువుగా.

"ఇదిగో నీకు పోటీ వచ్చిందంటే తట్టుకోలేవు. పిచ్చిసలహాలిచ్చి నీ ఫ్యూచర్‌ని నువ్వే పాడుచేసుకోకు" సీమ నవ్వుతూ అంది. అంతా నవ్వారు.

రేణుక కేస్‌రోల్స్ తెచ్చి టేబిల్ మీద పెట్టింది. మరో దాన్లో సాంబారు, ఒక బౌల్‌లో పచ్చడి తెచ్చిపెట్టింది. అంతా ఎవరికి కావల్సిన ఇడ్లీలు వారు పెట్టు కున్నారు. అందరి ప్లేట్ల దగ్గర తలో అరటిపండు తెచ్చిపెట్టింది. అంతా తినడం పూర్తి అయ్యేలోగా అందరికీ వేడివేడి కాఫీ, టీ తెచ్చింది. 'ఫరవాలేదు, ఇంత మాత్రం టిఫిన్ దొరికితే. ఇడ్లీ, సాంబారు రుచిగానే ఉన్నాయి' అనుకుంది మహిమ.

"మహిమ ... వారంలో రోజుకొక టిఫిను. అంటే ఇడ్లీ, పూరి, ఉప్మా, ఆదివారం స్పెషల్ దోశ ... ఇలా చేయిస్తాం. ఉదయం కాఫీ, టీ, ఎవరికేది కావలిస్తే అది. మళ్ళీ టిఫిన్‌తో పాటు కాఫీ, టీలు. లంచ్‌బాక్స్‌లో తలో రెండు చపాతీలు. కూర చేసి ఇస్తుంది. రాత్రి డిన్నరు. మనం అంతా వెళ్లాక సావకాశంగా రూములన్నీ తుడిచి, బట్టలుతికి మిగతా పనులు చేస్తుంది. కూరలు కావల్సినవి తనే తెచ్చుకుంటుంది. మొత్తం పని బాధ్యత అంతా

రేణుకదే. ఇస్త్రీకి రోజూ చాకలి వస్తాడు. ఇంటి అద్దె, కరెంటు, భోజనం ఖర్చు, రేణుక జీతం మొత్తం అందరం షేర్ చేసుకుంటాం. లెక్కలు రాయడం, అందరి దగ్గర డబ్బులు కలెక్ట్ చేయడం ... మన ఫైనాన్స్ మినిస్టర్ స్రవంతి చూస్తుంది'' టిఫిన్ చేస్తూ అన్నీ వివరించింది సీమ.

"ముందు అడ్వాన్స్‌గా ఇవాళ పదివేలు ఇవ్వు. నెలాఖరుకి మిగతా లెక్కలు. సరేనా ?''

మహిమ తల ఊపి, "ఏటీఎమ్‌లో డ్రా చేసి సాయంత్రం ఇస్తాను'' అంది. తల ఊపింది స్రవంతి. అందరూ టిఫిన్ తిని, కాఫీ తాగుతుండగా, నైట్ గౌనులో బద్ధకంగా ఆవలిస్తూ ఒక అమ్మాయి వచ్చింది. "హాయ్ ! గుడ్‌మార్నింగ్ ఎవ్రీబడీ!'' మహిమని ప్రశ్నార్థకంగా చూస్తూ "ఎవరీ ఏంజిల్ ?'' అంది ముద్దు ముద్దుగా. "ఇంకా మత్తు వదల్లేదా తల్లీ ? ఏ దేవకన్యా దిగి రాలేదులే. తను మహిమ. ఇవాళే కొత్తగా జాయిన్ అవుతోంది'' సీమ ముక్తసరిగా అంది.

"మహిమ ! బూటిఫుల్ నేమ్, బ్యూటిఫుల్ ఫేస్. ట్రై యువర్ లక్ ఇన్ దిస్ ఫ్యాషన్ వరల్డ్. బట్, కేర్‌ఫుల్ ! ఏ మగాడినీ నమ్మకు. పనిని నమ్ముకో, నీ టాలెంట్‌ని నమ్ముకో. ఇదిగో నా అనుభవంతో చెపుతున్నాను ... నమ్మకు, ఏ మగాడినీ నమ్మకు. ఏ మగాడి పొగడ్తలకి పడిపోకు. నిన్నేదో స్టార్‌ని చేసేస్తామని ఎవరన్నా అంటే, బుల్‌షిట్, నమ్మకు'' కసిగా అంది.

"ప్రీతి స్టాపిట్ ! మహిమ విజువల్స్ కాదు. క్రియేటివ్ సెక్షన్. నీ సెర్మన్స్ చాలు'' స్రవంతి విసుగ్గా అంది.

"ఏ యూనిట్ అయితేనేం ... అందంగా ఉంది కదా. నిన్ను యాడ్ వరల్డ్‌లో స్టార్‌ని చేసేస్తాం అంటూ చుట్టుముడతారు. నమ్మకు ఆ మాటలు ...''

"సరే, సరే, అలాగే. మాకు టైమైంది. వెళ్లాలి. పద మహిమ'' అంటూ సీమ లేచింది.

అమ్మాయిలంతా లేచి వెళ్లారు. సీమ రూముకెళ్ళి కాస్త జుత్తు బ్రష్ చేసి క్లిప్ పెట్టి, లైట్‌గా లిప్‌స్టిక్ వేసుకుని, చున్నీ తీసుకుని, రూము తాళం వేసి, రింగు లోంచి ఓ తాళం తీసి మహిమ కిచ్చింది. "నీ 'కీ' నీ దగ్గరుంచుకో. ఎప్పుడొచ్చినా నీ ఇష్టం. నా దగ్గరొకటి, రేణుక దగ్గర ఒకటి ఉంటుంది. మనం వెళ్లాక రూము శుభ్రం చేస్తుంది గదా. కప్‌బోర్డు తాళం వేశావుగా, అది నీ దగ్గరుంచుకో. రేణుకతో ముందే చెప్పాం. నిన్ను నమ్మి తాళం ఇచ్చాం. ఏం పోయినా నీదే బాధ్యత అని చెప్పాం. అయినా నమ్మకంగానే ఉందిలే. అందుకే జీతం కాక అందరం బోలెడు బట్టలు అవి అన్ని బాగా ఇస్తాం. మనతోపాటే భోజనం అన్నీ ... తనకి పెళ్ళయింది. కానీ మొగుడు ఇంకొకామెతో చెప్పా చెయ్యకుండా వెళ్లిపోయాడు. పిల్లలు, బాదర బందీలు లేవు. నమ్మకంగా మన దగ్గరే ఉంటోంది. అందుకే ..." లిఫ్ట్‌లో వస్తూ గబగబా అన్నీ చెప్పింది. "నీ ట్రాన్స్‌పోర్ట్ నీవు ఏర్పాటుచేసుకునే వరకు నాతో వచ్చేయి. లేదంటే పెట్రోలు ఇద్దరం షేర్ చేసుకుంటూ ఇదే వాడుకోవచ్చు. చూడు ... ఇలా ఖచ్చితంగా అంటున్నానని ఏమనుకోకు. డబ్బు దగ్గర గొడవలు రాకూడదు. అందుకే అందరం ముందే మాట్లాడుకున్నాం. ప్రతి రూపాయి ఖర్చు షేర్ చేసుకుంటాం. లేకపోతే గొడవలు వస్తాయి. ఐ హోప్ యూ అండర్‌స్టాండ్ ..."

"ఇదే మంచి పద్ధతి. నాకు ఇదే ఇష్టం. మా డాడీ ఎప్పుడూ అంటారు ఎంత మంచి స్నేహితులైనా డబ్బు దగ్గర మొహమాటాలుండకూడదని".

"ఇక్కడ మేమందరం ఒక ఫ్యామిలీలా ఉంటూ, ఎవరికి ఏ అవసరం, ఇబ్బంది వచ్చినా అందరం ఒకరికొకరం అన్నట్టు ఉంటాం ..."

"సీమా ! రియల్లీ అయామ్ వెరీ హ్యాపీ ! కొత్త ఊర్లో మంచి అకామడేషన్, భోజన ఏర్పాట్లు అన్నీ ఇంత తొందరగా, ఇంత చక్కగా అమరిపోయాయి. మీలాంటి ఫ్రెండ్స్ దొరికారు. రియల్లీ హ్యాపీ !" అంది మనస్ఫూర్తిగా.

"ఇందాక ప్రీతి అన్న అమ్మాయి ఎవరు ? ఆఫీసుకు వెళ్లదా ... ?" ఆఫీసు లిఫ్ట్‌లో కుతూహలంగా అడిగింది. "ప్రీతి ... తనకు ఒక టైము పాడు

ఏం ఉండదు. ఏదన్నా షూటింగ్ కాల్ వస్తే తయారయి వెళ్తుంది. లేదంటే తిని దొర్లుతూ ఉంటుంది'' విరక్తిగా అంది సీమ.

"యాడ్స్‌లో నటిస్తుందా ? ఎక్కడో చూసిన మొహంలా అనిపించింది''.

"ప్రీతి సంగతి తరువాత. అదంతా ఓ పెద్ద కథలే ! పద, వెళ్లి జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చిరా. తెల్సుగా ఎక్కడో'' అంటూ తన సీటు వైపు వెళ్ళింది సీమ.

'సో, యూ ఆర్ మహిమ', అపాయింట్‌మెంట్ కాగితాలు, జాయినింగ్ రిపోర్టు కాగితాలు అందుకుని పరిశీలిస్తూ మహిమని కళ్లెత్తి ఓసారి పైనించి కింది వరకు చూస్తూ అన్నాడు మీనన్, క్రియేటివ్ హెడ్ మీనన్ ఏభై ఏళ్ళ లోపు, బట్టతలతో, గంభీరంగా ఉన్నాడు.

'ఓకే ! బీ సీటెడ్ ! మీరు చెయ్యాల్సిన పని ... లెట్‌మీ ఎక్స్‌ప్లెయిన్. మా దగ్గరకు అనేక కంపెనీల కొత్త, పాత ప్రోడక్ట్స్ వస్తాయి. కొన్ని కేవలం పేపరులో ప్రకటనలకి, కొన్ని విజువల్ యాడ్స్‌గా, కేవలం ప్రోడక్ట్‌ని పరిచయం చేసే వాక్యాలు, కొన్ని బొమ్మలతో, కొన్ని డాక్యుమెంటరీలుగా, కొన్ని ఒకటి రెండు నిమిషాల వీడియోలుగా ... అనేక విధాలుగా ప్రోడక్ట్‌ని కస్టమర్ కోరినట్టు తయారు చేయడం మన పని. ఏ ప్రకటనకైనా ముందు ఇక్కడ స్క్రిప్టు తయారుచెయ్యాలి. ఉదాహరణకి ఒక టూత్‌పేస్ట్ ప్రకటన చెయ్యాలంటే ఆ టూత్‌పేస్ట్ బొమ్మ, కొన్ని కొటేషన్స్, లేక పరిచయ వాక్యాలు ... కస్టమర్ ఎంత ఖర్చుపెట్టగలడు అన్నదాన్ని బట్టి తయారు చెయ్యాలి. ఆ టూత్‌పేస్ట్ చిన్న ప్రకటనలా విజువల్‌గా, అంటే ఒక డాక్టరు చెప్పినట్టో, తల్లి ఇంట్లో పిల్లలకి చెప్పి చూపిస్తున్నట్టో షూట్‌చేసి ప్రెజెంట్ చెయ్యాలి. అదే ఉట్టి ప్రకటన అయితే ఆ టూత్‌పేస్ట్ గురించి రెండు మూడు కాచింగ్ వాక్యాలతో మంచి అర్థమొచ్చి, కొనుగోలు దారులని ఆకర్షించే విధంగా ఉండాలి. "ఏ ప్రోడక్ట్ ఎలా తయారుచెయ్యాలి అన్నది కస్టమర్ కోరిక ప్రకారం, పేమెంటు ప్రకారం మనం తయారుచేసి వారికి అందించాలి. యూ గాటిట్'' !

"ఎస్ సర్ ! ముద్రా ఇనిస్టిట్యూట్‌లో ఇవన్నీ వివరంగానే బోధపరుస్తారు".

"ఓకె దెన్. అది ఎంత కొత్తగా, ఆకర్షణీయంగా ప్రెజెంట్ చెయ్యాలన్నది క్రియేటివ్ డిపార్ట్‌మెంట్ పని. ఇక్కడ ప్రతి చిన్నది ముందు ఇంగ్లీషులో తయారు చెయ్యాలి. తరువాత భారతీయ భాషల్లో, వారు కోరిన భాషలో అదే ప్రకటన తర్జుమా చెయ్యాలి. ఇంగ్లీషులో చేసిన భావప్రకటన ఇతర భాషలలో చేసేటప్పుడు సహజంగా ఉండాలి. కాని వర్డ్ టూ వర్డ్ అనువదించినట్లు ఉండకూడదు. అన్ని భాషలకి కాపీ రైటర్లుంటారు. అది వారి పని. ఇంగ్లీషు డిపార్ట్‌మెంట్ మెయిన్ కనక, మీ ఒరిజినల్ టాలెంట్ ఇక్కడ బయటపడాలి. అంటే మీ క్రియేటివిటీ, టాలెంట్ అన్నీ వెచ్చించి ఆకర్షణీయమైన స్క్రిప్టు తయారుచెయ్యడంలో మీ ప్రతిభ కనపడాలి. గాటిట్ ..." మీనన్ మహిమకు అర్థమయ్యేట్టు చెపుతూ, ఆమె ఎంత వరకు గ్రహించింది అన్నట్టు చూశాడు.

"ఎస్ సర్ ! నాకు క్రియేటివిటి అన్నది ఇష్టమైన సబ్జెక్ట్. అందుకే ఈ వృత్తి ఎంచుకున్నాను. భాష మీద పట్టు ఉంది. అర్థమైన విషయాన్ని అక్షరాలలో భావ వ్యక్తీకరణ చెయ్యగలనని, మెప్పించగలనని అనుకునే ఈ జాబ్‌కి వచ్చాను" చాలా నమ్మకం, ఆత్మవిశ్వాసంతో అంది మహిమ.

"దెన్ లెటజ్ సీ ! మా దగ్గరికి వచ్చిన ప్రకటనల ఆర్డర్ మీ దగ్గరికి వస్తుంది. అది మీరు కస్టమర్ కోరిన విధంగా ప్రజెంట్ చేసిన స్క్రిప్టు మళ్ళీ ఇక్కడికి వస్తుంది. ఆ తరువాత వాటిల్లో ఏమయినా మార్పులు చేర్పులు చెయ్యాల్సి ఉంటే, తిరిగి సవరించి పంపాలి. అది యాడ్‌గా, లేక విజువల్స్ డిపార్ట్‌మెంటుకి వెడుతుంది. ఈ పనికి మీతోపాటు ఇంకా ఇద్దరున్నారు. ఒక అమ్మాయి పెళ్ళి చేసుకుని రిజైన్ చేసి వెళ్ళిపోయింది. ఆ సీట్‌లోకి మిమ్మల్ని తీసుకున్నారు. మీతో పాటు అనుపమ, గిరీష్ ఈ సెక్షన్‌లో ఉన్నారు. యూ వర్క్ అండర్ మీ ... క్రియేటివ్ డిపార్ట్‌మెంట్ మేనేజింగ్ డైరెక్టర్ విశాల్ జైన్ తెలుసుగా ..." మీనన్ అడిగాడు.

"ఎస్ సర్. ఇంటర్వ్యూ చేసినప్పుడు ఆయన ఉన్నారు. ఆ రోజు మీరూ ఉన్నారు. కానీ నాకు తెలియదు మీరెవరో ..."

తల ఊపాడు మీనన్. "ఎస్ ! డిపార్ట్‌మెంట్ హెడ్‌గా ఇంటర్వ్యూలో, సెలెక్షన్‌లో నా పాత్ర ఉంటుంది. ఓకే దెన్ ... ఇదిగో, నిన్ననే వచ్చిన ఈ రెండు ఆర్డర్లు తీసికెళ్లి స్టడీ చేసి ఎలా ప్రెజెంట్ చేసేది రాసి పంపండి. కమాన్. మీ ప్రతిభకి పదునుపెట్టండి" అంటూ రెండు ఆర్డర్ కాగితాలున్న ఫైల్స్ ముందుకు జరిపాడు. మహిమ అందుకుని లేచి నిలబడింది. "ఆ, బై ది బై మేనేజింగ్ డైరెక్టర్ విశాల్ గారిని కలిసి, జాయిన్ అయిన విషయం చెప్పి వెళ్లండి. నౌ యూ కెన్ గో" అన్నాడు.

మహిమ గదిలోంచి బయటికి వచ్చి, రిసెప్షనిస్ట్‌ని "మేనేజింగ్ డైరెక్టర్‌ని కలవాలి, వెళ్ళొచ్చా ?" అని అడిగింది.

ఆమె చిరునవ్వుతో "లెట్ మీ సీ !" అంటూ ఫోను తీసి మాట్లాడి, "మీరు వెళ్ళచ్చు. బాస్ రమ్మన్నారు" అంది.

మహిమ ఆమె చూపిన గుమ్మం వైపు వెళ్ళి, డోర్ నాక్ చేసింది.

"ఎస్ కమిన్" అన్నాడు విశాల్.

మహిమ లోపలకు వెళ్ళి, 'గుడ్‌మార్నింగ్ సర్ ! ఇవాళ డ్యూటీలో జాయిన్ అయ్యాను. మీనన్ గారిని కలిసి ..."

"ఐ హోప్ అతను అంతా మీకు వివరించి ఉంటాడు. హోప్ యూ ఎంజాయ్ వర్కింగ్ విత్ అజ్. ఆల్ ద బెస్ట్ మహిమ ! మీకు ఏ విధమైన సలహా, సహాయం కావల్సినా నిస్సంకోచంగా అడగండి ప్లీజ్ ..." అని విష్ చేశాడు నవ్వుతూ.

విశాల్ మర్యాద, మన్నన, సంస్కారవంతమైన అతని ప్రవర్తన మహిమకి ఎంతో నచ్చింది. పాతిక ముప్ఫై మధ్య వయసు, ఆకర్షణీయమైన మొహం,

విదేశాలలో చదువుకుని వచ్చిన పాలిష్ అతనిలో కన్పించి, మంచి బాస్ దొరికాడు. బట్టతల, బానపొట్టవాడు కాదు'' అనుకుంది మహిమ బయటికి వస్తూ.

తన క్యాబిన్ దగ్గరికి చేరి చుట్టూ చూసింది. ఎవరి పని వారు చేస్తూ అందరూ కంప్యూటర్లలో మునిగిపోయారు. టేబుల్ మీద కంప్యూటర్, టేబుల్‌కి రెండు అరలు, రివాల్వింగ్ ఛైర్, ఫైల్స్ ట్రేలు ... కుర్చీ జరుపుకుని కూర్చోబోతుండగా, "హాయ్ ! వెల్‌కమ్ !'' అంటూ అనుపమ, గిరీష్ తమ సీట్లలోంచి లేచి వచ్చారు. అనుపమ షేక్‌హ్యాండ్ ఇచ్చి తనను తాను పరిచయం చేసుకుని, గిరీష్‌ని పరిచయం చేసి, "మన ముగ్గురిదీ ఒక జాబ్. సో ఉయ్ ఆర్ ఫ్రెండ్స్'' అంది చనువుగా.

"అఫ్‌కోర్స్ ...'' అంటూ గిరీష్ చాచిన చెయ్యి అందుకుంది మహిమ. "మీ ఇద్దరూ నాకు కాస్త సహాయం చెయ్యాలి. నాకు అలవాటయ్యేవరకు ఏం కావాలన్నా మీ ఇద్దర్నీ అడుగుతా, తెలియనివి చెప్పండి'' అంది.

"విత్‌ప్లెజర్'' అన్నాడు గిరీష్. ముప్ఫై ఏళ్ళ లోపు ఉండి చామనచాయగా, స్మార్ట్‌గానే ఉన్నాడు గిరీష్. అనుపమ కాస్త చామనచాయగా ఉన్నా కళైన మొహం. సల్వార్ కుర్తా, బాబ్‌డ్ హెయిర్, మాటకారిలా ఉంది. చనువుగా చకచక మాట్లాడేసి మహిమ కొత్త పోగొట్టింది. "బాస్‌ని మీట్ అయ్యావా ! మీనన్ బాస్ సరే ... మేనేజింగ్ డైరెక్టర్‌ని కలిశావా ?''

"ఇప్పుడే కలిసి వస్తున్నాను. ఇంటర్వ్యూ అప్పుడు కూడా చూశారు ...''

"ఓకే దెన్ ! సెటిల్‌డౌన్ ! వర్కేమన్నా ఇచ్చారా ! పని బాగానే ఉంటుంది. ఇది పెద్ద అడ్వర్టైజింగ్ ఏజెన్సీ. ప్రకటనలకి ఆర్డర్లు బాగానే వస్తాయి. ఏ ప్రకటనైనా మన డిపార్ట్‌మెంటే తయారుచెయ్యాలి. నేను రాసిన స్క్రిప్టుకి బొమ్మలు వేయడం, విజువల్స్ అయితే స్క్రిప్ట్ పని. గిరీష్ కూడా అంతే ...''

"నేను క్రియేటివ్ కాప్షన్స్ ఎలా ప్రెజెంట్ చెయ్యాలో ఆలోచించి ప్రోడక్ట్ ఇంట్రొడ్యూస్ చేయడానికి భాష, భావం ... అంతా సృష్టించాలి. నాకిష్టమైన సబ్జెక్ట్‌కి తగిన పని అని ఈ ఫీల్డ్‌లోకి వచ్చాను ...'' మహిమ నవ్వుతూ అంది.

"ఒకే గుడ్‌లక్ ! అదిగో మీనన్ క్యాబిన్‌లోంచి చూస్తున్నాడు" అంటూ తన సీట్‌లోకి వెళ్ళింది అనుపమ. "ఏదన్నా హెల్ప్ కావాలన్నా, ఇన్ఫర్మేషన్ కావాలన్నా అడగండి" గిరీష్ చెపుతూ తన సీట్‌లోకి వెళ్ళిపోయాడు.

మహిమ సీట్‌లో కూర్చుంది. మీనన్ ఇచ్చిన ఫైలును టేబుల్ మీద పెట్టి, కంప్యూటర్ ఓపెన్ చేసి పనిలో పడింది. ఇచ్చిన రెండు కొత్త ప్రకటనలను శ్రద్ధగా చదివి, మెదడుకు పనిపెట్టి, ఒక్కొక్క దానికి రెండు మూడు వెర్షన్స్ తయారు చేసి, రాసినదాన్ని చదువుతూ, ఇంకా బాగా మంచి పదాలు వెతుకుతూ, కొత్త ఐడియాల కోసం కంప్యూటర్ గాలిస్తూ, గూగుల్‌లో వెతుకుతూ, ఏకాగ్రతతో పనిచేస్తూ కూర్చుంది. ఒంటిగంట అయ్యాక గల గల అందరూ సీట్లల్లోంచి లేచిన చప్పుడుకి తలెత్తి చూసింది మహిమ. లంచ్‌కి కాబోలు, కొంతమంది హ్యాండ్‌బ్యాగ్స్‌లోంచి టిఫిన్ డబ్బాలు పట్టుకుని డైనింగ్ స్పేస్ వైపు వెళుతూ కనిపించారు. అనుపమ సీట్‌లోంచి లేచి వచ్చింది. "లంచ్ బాక్స్ తెచ్చుకున్నావా? లేకపోతే కింద క్యాంటీన్ ఉంది" అంది.

"లేదు ... తెచ్చుకున్నాను".

"అయితే రా ..." అంటూ పక్కనున్న డైనింగ్ హాలు వైపు దారితీసింది.

"గిరీష్ ..." అంది అటు చూస్తూ.

"మగాళ్లంతా ఓ గ్రూపుగా పోతారులే ..."

పెద్ద డైనింగ్ టేబుల్ చుట్టూ కుర్చీలు, వాటర్ ఫిల్టర్. "ఆ వెనుక డోరు లోంచి వెడితే వాష్‌రూములున్నాయి" కుర్చీ జరిపి కూర్చుంటూ చెప్పింది అనుపమ.

"ఓ ! అంతా చాలా ప్లాన్డ్‌గా, నీట్‌గా మెయిన్‌టైన్ చేస్తున్నారు" మహిమ అంది.

"మరి. దానికి తగ్గట్టే డబ్బూ వస్తుందిగా. ప్రకటనలకు ఒక్కొక్కదానికి ఎంత వసూలు చేస్తారో తెలుసా ? ఈ హంగామా, హంగులూ అన్నీ కార్పోరేట్ లెవల్లో ఉండాలి మరి".

"నిజంగానా ! అంత పే చేస్తారా ?"

"ప్రకటన బట్టి ! పేపర్లో ప్రకటనలను బట్టి, విజువల్స్ ఎంతో రిచ్‌గా ఉండాలంటే కోట్లు, చిన్న ప్రోడక్ట్‌కి లక్షల్లో. ఒక్కొక్కదానికి ఒక్కో రేటు. నాలుగు వందల మంది జీతాలు, ఆఫీస్ మెయిన్‌టెనెన్స్, ఎక్విప్‌మెంటు, కాంట్రాక్ట్ లేబర్స్, డైరెక్టర్స్, స్క్రిప్ట్ రైటర్స్, యాక్టర్స్ ... అబ్బో ! అంతా కోట్లలో వ్యవహారం.

"అవును. అడ్వర్టైజింగ్ వరల్డ్ ... ఇదో లోకం ! వినడమే గాని చూడలేదు. ముద్రాలో కోర్స్ చేస్తున్నప్పుడే చాలా చెప్పారు ..."

"నీ పని అవుతోందా ! ఏమయినా హెల్ప్ కావాలా ? ఏదన్నా తట్టిందా ఐడియా ..."

"ఆ ... సాయంత్రానికి రెండు ప్రోడక్టులూ పూర్తి చేసి ఇస్తాను. హోప్‌ఫుల్లీ!" తినడం పూర్తిచేసి, వాష్‌రూములోకి వెళ్లి ఫ్రెషప్ అయి, మళ్లీ ఎవరి సీట్లలోకి వారు వెళ్లారు అరగంటలో.

ఐదు గంటలకల్లా రెండు ప్రకటనలకి ఓ రూపు వచ్చి, ఫైనల్ కాపీ కంప్యూటర్‌కి ఎక్కించి, మీనన్‌కు పంపించి, ఒక కాపీ తన మెయిల్‌లో సేవ్‌చేసి, పనిపూర్తిచేసి, మీనన్ క్యాబిన్ వైపు నడిచింది.

అప్పటికే మీనన్ మహిమ పంపిన ఫైనల్ వెర్షన్ చూస్తూ మహిమ లోపలికి రాగానే, "కమాన్" కంప్యూటర్ చూస్తూనే అన్నాడు. అతని మొహంలో ప్రసన్నత కనపడింది. 'తనిచ్చిన కాప్షన్స్ నచ్చినట్టే ఉన్నాయి' అనుకుంది. 'గుడ్ ! రెండు కాప్షన్స్ బాగానే ఉన్నాయి. వెల్‌డన్ ! ఫైనల్‌గా సెలెక్ట్ చేసేముందు విశాల్ గారికి కూడా పంపి, ఓకే చేయించుకోవాలి. రేపటివరకు టైముంది. ఈలోగా ఇంకా బెటర్ ఐడియా తడితే మార్చవచ్చు. ప్రయత్నించండి. యూ డిడ్ గుడ్ జాబ్ ఆన్ ది ఫస్ట్ డే కంగ్రాట్స్ !" ప్రోత్సాహకరంగా మాట్లాడాడు.

మహిమ పెద్ద బరువు దిగినట్టు తేలికగా "థాంక్స్ సార్ ! రేపు ఆఫీసుకు వచ్చేలోగా ఆలోచిస్తూనే ఉంటాను ఫర్ బెటర్ ఐడియా" అంది.

"ఓకే ... మీరింక వెళ్ళవచ్చు" పావు తక్కువ ఆరవడం చూసి అన్నాడు.

మహిమ రూమ్‌లోంచి బయటకు రాగానే అనుపమ కంప్యూటర్ ఆఫ్ చేసి, హ్యాండ్‌బ్యాగు పట్టుకుని లేచి, ఆరాటంగా, "ఏమన్నాడు ? నచ్చాయటనా? లేక మళ్లీ మార్పులంటూ నసిగాడా ... ?" తన అనుభవంతో అడిగింది.

"లేదు లేదు. బాగున్నాయని మెచ్చుకున్నాడు. ఇంకా ఏమన్నా బెటర్ థాట్ ఉంటే ఆలోచించు, లేదంటే ఇది కన్‌ఫర్మ్ చేసేస్తా అన్నాడు".

"గుడ్ ! ఫరవాలేదు, మొదటి రోజే కాంప్లిమెంట్ ఇచ్చేశాడంటే ... ! ఈ మీనన్ గాడు ఒక పట్టాన ఏదీ నచ్చడు. అంచేత నేనేం చేస్తానో తెలుసా ? మూడు వెర్షన్స్ తయారుచేసి ముందు మూడోది ప్రెజెంట్ చేస్తా. అది నచ్చలేదంటే రెండోది పెడతా. ఆఖర్న మొదటి వెర్షన్ ఇస్తాను. మొదటే మంచిది ప్రెజెంట్ చేస్తే 'ఇంకా బాగా రావాలి' అంటూనే ఉంటాడు. రెండుసార్లు రిజెక్ట్ చేశాక, మూడోది చచ్చినట్లు ఓకే చేస్తాడు" నవ్వుతూ అంది లిఫ్ట్ వైపు నడుస్తూ.

"ఈ కిటుకులన్నీ నాకు నేర్పు ... ఫాలో అవుతా" మహిమ నవ్వింది.

"ఇంటికేనా ... ?" ఆరాతీసింది.

"లేదు. సీమ వస్తుంది. ఇద్దరం కలిసి వెడతాం".

"ఓకే దెన్ బై" చెప్పి అనుపమ వెళ్లిపోయింది. రిసెప్షన్ దగ్గర మ్యాగజైన్స్ తిరగేస్తుండగా సీమ వచ్చింది. "వచ్చేశావా పద వెడదాం" అంది లిఫ్ట్ వైపు నడుస్తూ. "ఎలా ఉంది మొదటిరోజు అనుభవం" ?

"నాకేం పెద్ద టెన్షన్, భయం వేయలేదు. ముద్రాలో ట్రైనింగప్పుడు ఇలా ప్రకటనలిచ్చి వర్క్ చేయించేవారు. ఆ అనుభవం ఉంది. ఎటొచ్చి ప్రతి ప్రకటనకి బుర్రకి పదును పెట్టాలి. ఒకరోజు వెంటనే మంచి కాప్షన్ తడుతుంది. మరో రోజు చచ్చినా రాదు. సడన్‌గా ఫ్లాష్‌లా ఐడియా వెలుగుతుంది. ఇదంతా అలవాటే. అయినా నా ప్రెజెంటేషన్ మీనన్‌కి నచ్చినట్టే ఉంది. మొహం వికసించింది".

"ఓ గుడ్ ! మొదటిరోజునే ఇంప్రెస్ చేశావన్నమాట" ఇద్దరూ లిఫ్ట్ దిగి స్కూటీ వైపు వెళ్ళారు.

✻ ✻ ✻

ఇంటికెడుతూనే చున్నీ, బ్యాగు టేబుల్ మీద పడేసి పక్కమీద వాలిపోయి, "రేణూ ... రెండు టీలు పట్రా" కేకపెట్టింది సీమ. మహిమ కూడా విశ్రాంతిగా కుర్చీలో కూర్చుంది, కాళ్ళు జాపుకుని. ఆకలేస్తోంది. ఏదన్నా తింటే బాగుండు ననిపించింది మహిమకి. అన్నట్టు అమ్మ ఇచ్చిన రవ్వలడ్డు, మురుకుల ప్యాకెట్టు ఉన్నాయిగా అనుకుంటూ, అవి తీద్దామనుకునే లోపలే రేణుక ఒక ట్రేలో రెండు కప్పులు టీ, ఒక ప్లేటులో అరడజను బిస్కట్లు, మరో గాజు బౌల్‌లో కొంచెం మిక్చర్ పట్టుకొచ్చి టేబుల్ మీద పెట్టింది. రెండో చేత్తో ఉతికి ఆరేసి మడత పెట్టిన బట్టలు ఇద్దరివీ తెచ్చి మంచం మీద పెట్టింది. "బట్టలు మీవి మీరు చూసుకుని తీసుకోండి" అంది రేణుక బయటకు వెడుతూ.

రెండు బిస్కట్లు గబగబ తిని, ఇంత మిక్చర్ నోట్లో పోసుకుని టీ కప్పు అందుకుంది సీమ. "తిను, తిను, ఆకలేయడం లేదా ?" అంది మహిమతో.

"అమ్మ రవ్వలడ్డు, మురుకులు ఇచ్చింది. తీసి పట్రానా ..." అంది లేవబోతూ.

"ఇవాళ వద్దులే. ఆదివారం సావకాశంగా తిందాం. ఏదున్నా అందరం పంచుకు తినాలని మా రూలు. మనిద్దరమే తినకూడదు. ఆదివారం ఎల్లుండేగా, అందరం టీతో తిందాం. డబ్బా ముందుపెట్టావంటే మరునిమిషం మిగలవు. ఆరురావురని తినేస్తారు. స్నాక్సు అప్పుడప్పుడు అందరం తలోటి కొంటాం. కొందరికి ఎవరన్నా వస్తే అమ్మలు పంపుతుంటారు" అంది.

"గుడ్ ! బాగున్నాయి ఇక్కడ ఏర్పాట్లు. రేణుక బలే ట్రైనయింది. ఏదీ చెప్పనక్కరలేకుండా అన్నీ చేసుకుపోతోంది".

"ఆ ... రెండేళ్లయింది మేము ఇల్లు తీసుకుని. అప్పటినుంచి మాతోటే ఉంది. తర్వాత తీరిగ్గా మాట్లాడుకుందాం కానీ, కాసేపు రెస్ట్ తీసుకో. నేను ఓ కునుకు తీస్తా. లేదంటే ఎనిమిది గంటల నించి కళ్లు వాలిపోతుంటాయి" అంది మంచం మీద అటు తిరిగి.

మహిమ తలుపు దగ్గరకు వేసి, పక్క మీద వాలింది.

✻ ✻ ✻

ఏడున్నరయ్యే సరికి అందరూ ఫ్రెష్ అయి నైట్‌గౌన్లలోకి మారి హాల్లో చేరారు. టీ.వి. దాని పాటికి అది మోగుతుంటే, అమ్మాయిలందరూ ఆరోజు ఆఫీసు విషయాలన్నీ గల గల ముచ్చట్లాడేసుకున్నారు. బాస్‌లని తిట్టుకున్నారు. కొలీగ్‌లతో పేచీలు చెప్పుకున్నారు. "హాయ్ మహిమ ! పొద్దుట హడావిడిలో ఒకరిని గురించి ఒకరు సరిగా తేల్చుకోలేదు. అందరూ పరిచయాలు చెప్పండి మహిమకి" అంది సీమ. "మహిమ ... ముందు నీ సంగతి, అంటే, అమ్మా, నాన్న, అక్క, తమ్ముడు అన్నదే కాదు, దాచకుండా బాయ్‌ఫ్రెండ్స్, ఎఫైర్స్ లాంటివి, సక్సెస్‌లు, ఫెయిల్యూర్స్ అన్నీ దాచకుండా చెప్పాలి ..."

మహిమ నవ్వింది. "అంత కథలేం లేవు నాకు. చాలా గుడ్‌గర్ల్‌ని నేను. చదువు చదువు. మిడిల్ క్లాస్ అమ్మాయిలకు చదువొకటే ప్లస్‌పాయింట్ అని నాన్న అంటారు. బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. అమ్మ లెక్చరర్. తమ్ముడు ఇంజనీరింగ్ చదువుతున్నాడు. మిడిల్ క్లాసు అమ్మాయిని ... చదువయింది. ఉద్యోగం ఎంజాయ్ చేసి, స్వంత సంపాదన చూసుకుని గర్వపడి, ఫ్రీగా కొన్నాళ్లు తిరిగి, అప్పుడు పెళ్ళి అని ఇంట్లో చెప్పేశా. అంటే ఇంకో రెండేళ్ళు ఫ్రీబర్డ్‌ని, బాయ్‌ఫ్రెండ్స్ అంటూ ఎవరూ లేరు ... క్లాస్‌మేట్స్ తప్ప ..."

"పిటీ ... ఇంత అందంగా ఉన్నావు, అబ్బాయిలు ఊరుకున్నారా ? అంత తేలిగ్గా వదిలేశారా నిన్ను ?" అంది స్రవంతి ఆశ్చర్యపోతున్నట్టు.

"మనం లక్ష్మణరేఖ గీస్తే, రావణుడే గీత దాటడానికి భయపడ్డాడు. బయటికి వచ్చేదాకా సీతని ఏం చేయగలిగాడు ... ?" మహిమ తెలివిగా జవాబిచ్చింది. అంతా చప్పట్లు కొట్టారు. "వెల్‌సెడ్ ... నిజమే. మనం బరి దాటి బయటికి వచ్చేట్లు ఎమోషన్స్ గుప్పిస్తారు అబ్బాయిలు. దాటగానే వల సిద్ధంగా ఉంటుంది" సీమ అంది.

"సరే, మహిమ తల్లి బంగారుతల్లి. మనందరం ఈ గుడ్ కంపెనీలో గుడ్ గర్ల్స్‌లా మారిపోదాం" ఆరతి ఏక్ట్ చేస్తున్నట్టు కళ్ళు తిప్పుతూ అంది.

"ఆపు తల్లీ, నీ నటన భాష్యాలు. ఈవిడగారు తనో పెద్ద స్టార్‌లా ఫోజులు పెడుతూ, మనతో మాట్లాడినా సెట్టుమీదలా యాక్ట్ చేస్తుంది'' స్రవంతి నవ్వింది.

"నా చేత చెప్పించారు. మీ అందరి పరిచయం చెప్పనేలేదు'' మహిమ కుతూహలంగా అడిగింది.

"నేను పంజాబీ అమ్మాయిని. అక్క, నేను, అన్న ... ముగ్గురం. నాకు ముందు నుంచీ చదువు మీద ఇంటరెస్టు లేదు. చదువు అబ్బలేదు. బొమ్మలు, కార్టూన్లు గీసేదాన్ని. నా ఇంటరెస్ట్ చూసి నాన్నకీ అర్థమై, ఈ లైన్లో ప్రోత్సహించారు. ఆర్నెల్లు క్లాసెస్ అటెండ్ అయి, కార్టూన్లు, పోట్రెయిట్స్, జోక్స్ ... వాటికి సింపుల్‌గా తక్కువ గీతలతో ఎక్కువ భావం చూపించే ప్రొఫెషనల్‌గా హాబీని మలుచుకున్నాను. ఆర్టిస్టుల కోసం వీళ్ళ ప్రకటన చూసి అప్లయ్ చేశాను. ఉద్యోగం వచ్చింది. ఇంత దూరం పంపడానికి అమ్మ, నాన్న సందేహించినా, హైదరాబాద్ వచ్చి ఆఫీసు, అదీ చూశాక, ఒప్పుకున్నారు. నాకో బాయ్‌ఫ్రెండ్. ఏ అపార్థాలు వద్దు. నా కొలీగ్ సూరజ్ ... అతను కూడా పంజాబీ, ఆర్టిస్ట్ అవటంతో, ఇద్దరం ఫ్రెండ్స్ అయ్యాం. ఇప్పటికి కథ అంతవరకే వచ్చింది'' అంది సీమ.

"నా పేరు మంగళ. తమిళ సెక్షన్‌లో కాపీరైటర్‌ని. మిడిల్ క్లాసు అమ్మాయిని. సేలం నించి వచ్చా. చాలా మామూలు సంసారం. మామూలు కోరికలు నావి. కాస్త నాలుగు రాళ్ళు సంపాదించుకుని, అమ్మా నాన్న చూసిన అబ్బాయిని బుద్ధిగా పెళ్ళి చేసుకుంటాను'' అంది మంగళ నవ్వుతూ.

ఆరతి గొంతు సవరించుకుని "యువర్ అటెన్షన్ ప్లీజ్ ... నాకు ముందు నుంచీ మోడలింగ్, యాక్టింగ్ అంటే ఇష్టం. టీనేజ్ నుంచీ నా ఫ్రెండ్స్ అందరూ 'అందం, మంచి ఫిగరు ఉంది. సినిమా స్టార్‌లా ఉన్నావు' అనేవారు. నా బుర్రలో అదే నాటుకుంది. నేను సినీతార అవడం అంత సులువు కాదు గదా

... అందుకే నెమ్మదిగా మోడలింగ్‌లో ప్రవేశిస్తే, టీ.వి., సినిమా వాళ్ల దృష్టిలో పడచ్చు. అని ఈ ఉద్యోగంలోకి వచ్చాను. చాలామంది మోడలింగ్ నుంచి సినీఫీల్డ్‌కి వెళ్లారు. చూస్తుండండి ... ఏదో ఒక రోజు ...''

“సర్లే తల్లీ. చూస్తూనే ఉంటాం రోజూ. ఎన్నిసార్లు చెప్పి ఊరిస్తావు ? ఇంకేమైనా ఉంటే చెప్పు ...''

ఆరతి మూతి ముడుచుకుంది.

“మీ అందరికీ కుళ్లు సినీతార అయిపోతానని ...'' మూతి సున్నాలా పెట్టి అలిగినట్టు నటించింది. “మాకేం కుళ్లు, మా ఫ్రెండ్ సినీతార అయిందంటే మాకు ఆనందమే. ఎటొచ్చీ ప్రీతిలా ...'' ఆగిపోయింది సీమ.

“ఏయ్ ఏమిటి నా గురించి మాట్లాడుకుంటున్నారా నేను లేకుండా. బ్యాడ్ మేనర్స్'' ప్రీతి వచ్చి జాయిన్ అయింది.

“నీ గురించి మేం మాట్లాడేముంది. నీవే చెప్పు. మహిమ కొత్తగా వచ్చింది. నీ సూక్తులు వినిపించు'' అంది స్రవంతి.

“చెప్పేశాగా నిన్ననే. అమ్మాయ్ మొదటిపాఠం ఏంటంటే, మగాణ్ణి నమ్మకు. తారని చేస్తా, అందలం ఎక్కిస్తా లాంటి పొగడ్తలకి పొగడచెట్టు ఎక్కద్దు. అది పెళుసు. కొమ్మ విరిగి కింద పడతావు. మునగ చెట్టెక్కాలన్నా నీవే స్వంతంగా ఎక్కు. సంపాదిస్తుండగా నాలుగు డబ్బులు దాచుకో. ఈ స్టార్‌డమ్ అన్నది నిచ్చెన. ఎప్పుడు జారుతుందో తెలియకుండానే కిందపడుతుంది. అర్థం అవుతోందా ? ప్రేమలో పడితే, నీ తాహతెరిగి పడు. పెళ్ళయిన ఏ వెధవనీ నమ్మకు. వాడి జాలి, సానుభూతి, లోకం భయం, పిల్లల మీద ప్రేమ ... షన్నీ ఇంట్లోనే ఉంచుకుని, సరదాకి, వెరైటీకి వాడుకుంటాడంతే! పెళ్ళి గొప్పతనం అదే. లోకం అంతా పెళ్ళాన్నే సపోర్ట్ చేస్తుంది. వాడు బాగానే ఉంటాడు. చెడేది ఎప్పుడూ కళ్ళు మూసుకుపోయి వారి చేతుల్లో వాలిన రెండో ఆడదే ! తెల్సిందా ...? ఇవి గీతోపదేశాలు కావు. 'ప్రీతోపదేశాలు'' ! నవ్వుతూ

జాలిగా, కేర్‌ఫ్రీగా అంటూ వెంట తెచ్చుకున్న సీసాలోంచి ఓ పెగ్గు గ్లాసులోకి వంపుకుంది. "ఛీర్స్ గర్ల్స్ ! మహిమ ... కంపెనీ ఇవ్వకూడదూ నాకు" డ్రింక్ ఆఫర్ చేసింది.

"నో ప్లీజ్ ! నాకు అలవాటు లేదు" సున్నితంగా అంది మహిమ.

ఎనిమిదన్నర అవుతుండగా రేణు డిన్నర్ తెచ్చి టేబుల్ మీద పెట్టింది. కబుర్లు కట్టిపెట్టి ఆవురావురుమని అందరూ ప్లేట్ల మీద పడ్డారు.

భోజనం అయ్యాక గుడ్‌నైట్‌లు చెప్పుకుని ఎవరి గదుల్లోకి వారు వెళ్లారందరూ.

"కాసేపు చదువుకుంటాను. మమూలుగా నువ్వు ఎన్ని గంటలకు పడు కుంటావు ?" అడిగింది సీమ.

"సాధారణంగా పది".

"ఓకే, పదికి లైట్స్ ఆఫ్ ... ప్రామిస్" అంది సీమ.

ఫోన్ తీసి తల్లిని పలకరించి విశేషాలన్నీ చెప్పింది మహిమ. ఆవిడ తల్లిగా జాగ్రత్తలు చెప్పింది. ఫోన్‌లో మెసేజ్‌లు, పోస్ట్‌లు చూసుకుని, సగం చదువుతూ పెట్టిన ఇంగ్లీష్ నవల తీసుకుని పక్కమీద వాలింది. మొదటిరోజు సక్సెస్ అనుకుంది.

రెండోరోజు ఆఫీసుకి వెళ్లడంతోనే రొటీనులో పడింది మహిమ. కూర్చున్న అరగంటకి, మీనన్ పిలిస్తే వెళ్లింది. "నీ ఫైనల్ కాప్షన్స్‌ని నిన్న బాస్ దగ్గరకి పంపించాను ... నిన్ను ఒకసారి కలవమన్నారు. వెళ్ళి కనిపించిరా ..." మీనన్ కాగితాల మధ్య నుంచి తలెత్తి అన్నాడు.

"ఓకే సర్" అంటూ విశాల్ దగ్గరికి వెళ్ళింది మహిమ.

తలుపు తట్టగానే "ఎస్ ... కమిన్" అన్నాడు విశాల్. మహిమని చూడగానే అతని కళ్లల్లో మెరుపు మహిమ దృష్టిని దాటిపోలేదు.

"మిస్ మహిమా ! మీ రెండు కాప్షన్స్ రియల్లీ సూపర్బ్. అడ్వర్టయిజింగ్ రంగంలో బాగా రాణిస్తారు మీరు. కీపిటప్ ! మా కంపెనీకి ఎస్సెట్‌గా భావిస్తున్నాను మీరు మా కంపెనీలో జాయిన్ అవడం ..." భేషజం లేకుండా మనస్ఫూర్తిగా మొదటిరోజే మెచ్చుకున్న బాస్‌ని మనసులోనే మెచ్చుకుంటూ, సంతోషంగా, "థ్యాంక్యూ సర్ మీ కాంప్లిమెంట్ నేనింకా బాగా పనిచేయడానికి దోహద పడుతుందని నమ్ముతున్నాను. ఇక్కడ ఉద్యోగం నాకెంతో ప్రోత్సాహాన్ని, ఆత్మ విశ్వాసాన్ని అందిస్తుందని ఆశిస్తున్నాను".

మర్యాదగా, పొందికగా చక్కని ఉచ్చారణలో ఇంగ్లీషు మాట్లాడుతున్న మహిమని ఈ ఉద్యోగంలోకి తీసుకోడం తమ కంపెనీకి లాభం అనిపించిందతనికి.

"బై ది బై ... ఈ రైతు కాప్షన్ అన్ని భాషల్లోకి వెడుతుంది. ఐ హోప్ ఇట్ విల్ బి ఎ సక్సెస్ ! బాగుంది ... "నీళ్లు కురవాల్సింది రైతు కంటకాదు. రైతు పంట పొలంలో మా బోరు పంపు వాడితే రైతు ఇంట సిరులు కురుస్తాయి".

ఆర్టిస్ట్ దానికి తగిన బొమ్మవేశాక మరింత బలం వస్తుంది కాప్షన్‌కి. రెండోది షుగర్ మందు. "షుగర్‌ని మీ ఇంట్లో డబ్బాలో దాచుకోండి ...

ఒంట్లో దాచుకుంటే ఒళ్లు గుల్లవుతుంది.

మీ సమస్యకి జవాబు ఇదిగో 'నో షుగర్' ఆయుర్వేద మాత్రలు !"

రెండూ చాలా అర్థవంతంగా, చాలా సులువుగా జనంలోకి వెడతాయి. కంగ్రాట్స్ మహిమ !" అని మరోసారి చెప్పాడు.

"థాంక్స్ సర్ !"

"ఇది ఒక విజువల్స్ ఆర్డర్. చాలా పెద్ద ప్రోడక్ట్, కాస్ట్‌లీది వచ్చింది. రిచ్‌గా ఉండాలి. కొత్తగా ఓపెన్ అవబోయే చీరలషాప్. చాలా ఖర్చుపెట్టి మంచి మోడల్స్‌తో ప్రెజెంట్ చెయ్యాలి. దీనికి కాప్షన్ అట్రాక్టివ్‌గా ఉండాలి. విజువల్స్ గనుక స్క్రిప్టు పెద్దగా ఉండదు. కొత్త కాన్సెప్ట్‌తో ప్రెజెంట్ చెయ్యాలి.

రెండు రోజులు టైమ్ తీసుకున్నా పరవాలేదు, ఆలోచించండి. రెండు మూడు వెర్షన్స్ రాసి పంపండి. షాపువాళ్లు ఇచ్చిన వివరాలు ఇవిగో. వాళ్లకేం కావాలో చెప్పారు. మీకు ఉపయోగపడతాయి. కస్టమర్ శాటిస్‌ఫాక్షన్ ఇంపార్టెంట్. ఓ నిమిషం, రెండు నిమిషాల వీడియోకి కోట్లు ఖర్చుపెడుతున్నారు అన్నది మనం మరవకూడదు. మీకేదన్నా హెల్ప్ కావాలన్నా, గిరీష్, అనుపమ ముగ్గురూ కలిసి చెయ్యొచ్చు ...'' వివరించాడు.

"ఐ విల్ ట్రై మై బెస్ట్ సర్ ...'' కాగితాలు తీసుకుని బయటికి నడిచింది. అప్పుడే ఆమె బుర్రలో ఆలోచనలు గిరగిర తిరగడం మొదలుపెట్టాయి. ఓ పక్కన ఆరాటం, చేసి మెప్పించాలి అన్న ఆత్రుత, చెయ్యగలనా అనే కాస్తంత భయం అన్నీ చోటుచేసుకున్నాయి. సీట్‌లోకి రాగానే అనుపమ, గిరీష్‌లతో చెప్పింది. "కంగ్రాట్స్ ... ప్రయత్నించు ... ఒక ఆలోచన వచ్చాక డిస్కస్ చేద్దాం ముగ్గురం ..'' అని అభయం ఇచ్చారు ఇద్దరూ.

※ ※ ※

పెద్ద ఖరీదయిన పెళ్ళి సెట్టు, పట్టుచీరలు, నగలు, అందమైన ఆడవాళ్లు ... అట్టహాసంగా పెళ్ళి జరుగుతోంది. 'వరమాల' సీను. వధువు, వరుడు 'జయమాల' మార్చుకునే సీను. పురోహితుడు మంత్రాలు చదువుతూ, 'ఇప్పుడు వధువు వరువు వరమాల మార్చుకోండి' అంటాడు. వరుని చేతికి వరమాల ఇస్తారు. వరుడు మాలవేయకుండా అమ్మాయిని పైనించి కిందవరకు అబ్బురపడుతున్నట్లు చూస్తుండిపోతాడు. 'మాల మెడలో వెయ్యి బాబూ ...'' అన్నా వినిపించుకోడు. వధువు తరఫువారు ఆరాటంగా చూస్తారు. ఎవరి మాటా విననట్టు తన్మయత్వంతో ఉండిపోతాడు వరుడు.

"భయ్యా ...'' చెల్లెలు అన్నగారిని పిలుస్తుంది. చేతిమీద తడుతుంది. ఉలిక్కిపడి చూస్తాడు వరుడు. 'అన్నయ్య మాలవెయ్యి' మళ్లీ అంటుంది. పెళ్ళికూతురు కాస్త సిగ్గు, బిడియంతో ఆరాటంగా చూస్తుంది. 'ఏమిటలా

చూస్తున్నావు బాబూ ... దండలు మార్చుకోవాలి త్వరగా' పురోహితుడు మళ్లీ అంటాడు. పెళ్ళికూతురు తల్లి మొహంలో గాభరా. 'ఏమయిందన్నయ్యా ...?' అంటోంది చెల్లెలు. తేరుకున్నట్టు 'ఏం లేదు పెళ్ళికూతురు బాగుందా, ఆమె చీర బాగుందా ? చీర వల్ల ఆమెకి అందం వచ్చిందా, ఆమె వల్ల చీరకి అందమా ... ? తేల్చుకోలేక ...' కొంటెగా అంటాడు. అందరి మొహాలలో రిలీఫ్. పెళ్ళికూతురు సిగ్గుపడుతుంది.

'వదినగారూ, చీర బాగుంది. ఎక్కడ కొన్నారు ?' వియ్యపురాలు ఆరా తీస్తుంది. 'ఈ చీరే కాదు, మీ అందరి చీరలు చాలా బాగున్నాయి ...' అడుగుతుంది. ఇవన్నీ మేము, కొత్తగా ప్రారంభించిన 'శుభమస్తు' షోరూమ్‌లో కొన్నామంటుంది. 'మరి మాకూ అక్కడే కొన్నారా' అని వియ్యపురాలు అడిగితే, మనందరికీ అక్కడే' అంటుంది పెళ్ళికూతురి తల్లి గర్వంగా. అప్పుడు కెమెరా షాపులోని రిచ్‌నెస్, పట్టుచీరల దొంతరలు, వేలాడదీసిన ఖరీదైన అందమైన చీరలు ... అన్నింటినీ చూపుతుంది. షాపు గొప్పతనాన్ని అన్ని కోణాల నుంచి చూపిస్తుంది. షాపు ఎంట్రన్స్ బోర్డు, పెద్ద పెద్ద చీరల డిస్‌ప్లేలు, షాపు మొత్తం కవర్‌చేసి 'మీ శుభముహూర్తాలకి మా 'శుభమస్తు'కు విచ్చేయండి' అంటూ ప్రకటన ముగుస్తుంది.

'కంప్యూటర్‌లో టైపు చేసిన స్క్రిప్టు చూపిస్తూ, "ఎలా ఉంది వెర్షన్ ... బాగుందా?" గిరీష్, అనుపమలకి చూపించి ఉద్వేగంగా అడిగింది.

"గుడ్ ! బాగుంది. విజువల్స్ రిచ్‌గా తీస్తారు కనుక చాలా అట్రాక్టివ్‌గా తయారవుతుంది" అన్నాడు గిరీష్.

'ఇంకోటి ఏదన్నా తయారుచేశావా ... రెండూ కంపేర్ చేసి చూద్దాం ..."

"చేశాగాని అది నాకంతగా నచ్చలేదు. పెళ్ళి జరుగుతుంటుంది. పెళ్ళి వారికి అందరికీ బట్టలు పెడుతుంటే చీరలు చూసి పెదవి విరిచి మొహాలు చూసుకుంటారు. 'మేం 'శుభమస్తు'లో చీరలు కొనమంటే ఎక్కడ కొన్నారు' ?

కోపంగా అడుగుతుంది వియ్యపురాలు. 'అప్పటికింకా శుభమస్తు షాపు ప్రారంభించ లేదండి. అప్పటికే కొనేశాం' అంటుంది పెళ్ళికూతురి తల్లి. వియ్యపురాలు చీర ఇచ్చేస్తూ 'చీరలు మార్చి అక్కడ కొనండి' అంటుంది. ఇది నెగెటివ్ అప్రోచ్‌తో ఆరంభమవడం, పెళ్ళివేళ గొడవ పడడం అన్నది శుభసూచకంగా ఉండదు అది నాకే నచ్చలేదు''.

"కరెక్టే ! పాజిటివ్ అప్రోచ్ చూపించాలి యాడ్స్‌లో. ఇంకా రేపు కూడా ఉందిగా. ఆలోచిద్దాం. లేకపోతే అదే సబ్‌మిట్ చేయొచ్చు'' అనుపమ అంది.

గూగుల్‌లో వెతుకుతూ, చీరల ప్రకటనలు పాతవి చూస్తూ, కొత్త ఐడియాల కోసం, రకరకాల కొటేషన్స్ తయారుచేస్తూ పని మీదే మరో ధ్యాసలేకుండా రోజంతా పనిచేసింది మహిమ.

"సీమా ... స్కూటర్ కొనుక్కోడానికి ఆఫీసులో లోన్ ఇస్తారా, నాలా కొత్తగా వచ్చినవారికి ...''

"ఆ, ఇస్తారు. అప్పు తీరేవరకు నీ సర్టిఫికెట్స్ ఒరిజినల్స్ వాళ్ల దగ్గర పెట్టు కుంటారు. ఉద్యోగం మానేసినా, డబ్బు పూర్తిగా చెల్లించనిదే సర్టిఫికెట్స్ దొరకవు. మనం ఇక్కడ ఒకటి రెండేళ్లు పనిచేయడం మంచిది. కంపెనీ పెద్దది. పని నేర్చుకునే అవకాశాలు బాగా ఉన్నాయి. ఎవరో కొద్దో గొప్పో జీతం ఎక్కువ ఇస్తామని ఆశ పెట్టినా వెళ్లకూడదు. ఇక్కడ పని నచ్చక, సరైన గుర్తింపు రాక, జీతం పెంచకపోతే ... అప్పుడు కంపెనీ వదలటానికి ఆలోచించాలి. అప్పుడు కూడా ఇలాంటి పెద్ద కంపెనీలను వదిలి వెళ్లాలనుకోవడం తెలివితక్కువతనమే. పనిలో గుర్తింపు వస్తే చాలా ఆఫర్స్ రావచ్చు. ఇతర కంపెనీలలో ఒకరి సమాచారం ఒకరు తెలుసుకుంటారు. పేరొచ్చిన వాళ్లని మంచి ఆఫర్స్‌తో లాగాలని ప్రయత్నిస్తారు. ఆ ట్రాప్‌లో మనం ఈజీగా పడకూడదు. పేరెంట్ కంపెనీని అంత తొందరగా వదలకూడదు. వచ్చేవరకు ఇంట్రెస్ట్ చూపి, చేరాక మనల్ని అస్సలు పట్టించుకోరు. నయన అనే అమ్మాయి

ఆఫర్ మంచిది వచ్చిందని ఇక్కడినుంచి వెళ్లిపోయింది. ఆరు నెలల తర్వాత గోలపెడుతూ ఫోన్ చేసింది. కంపెనీ బాగోలేదు, ట్రీట్‌మెంట్ బాగోలేదని ...''

"నాకయితే ఈ కంపెనీని వదిలే ఆలోచనే లేదు. నువ్వు చెప్పినట్లు రెండు మూడేళ్ళు పోయాక, మరీ మంచి కంపెనీ, ఇంతకంటే భవిష్యత్తు బాగుంటుందంటే ఆలోచించవచ్చు. మనకు అనుభవం ఉంటే ఎక్కడైనా ఆపర్స్ వస్తాయి.

"అయితే ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కి వెళ్లి లోన్ అప్లికేషన్స్ ఇవ్వు. వివరాలన్నీ స్రవంతిని అడిగితే చెపుతుంది''.

ఇంటికొచ్చి హాల్లోకి అడుగుపెట్టేసరికి, ప్రీతి ఆరాటంగా ఎదురువచ్చి మహిమ చెయ్యిపట్టుకుంది. 'ఓ రెండొందలుంటే ఇవ్వు, మళ్లీ ఇచ్చేస్తా'నని చనువుగా అడుగుతున్న ప్రీతిని కాస్త ఆశ్చర్యంగా చూసి, ప్రశ్నార్థకంగా సీమవైపు చూసింది మహిమ.

సీమ 'వద్దన్నట్టు' సైగ చేసింది. "ఏయ్ సీమా ! నేను మహిమని అడుగుతున్నాను'' కోపంగా అంది ప్రీతి.

"ప్రీతీ ప్లీజ్ ! డోన్ట్ మేకిట్ ఏన్ ఇష్యూ ... నువ్వు ఎవరినీ డబ్బులు అడగనని మాటిచ్చాకే, ఇక్కడ ఉండడానికి ఒప్పుకున్నాం. మర్చిపోకు. మహిమ కొత్తగా వచ్చింది. ఇబ్బంది పెట్టకు ప్లీజ్ ...''

"సారీ మహిమ. ఈ ఒక్కసారికే ... ఇంకెప్పుడూ అడగను. నాకు పేమెంట్ రాగానే ఇచ్చేస్తా''. మహిమ ఇబ్బంది పడుతూ, ఫర్వాలేదు అన్నట్టు చూసి బ్యాగ్ లోంచి రెండు వందలు తీసిచ్చింది.

"ఓ డియర్ ! స్వీటీ ... !'' అంటూ బుగ్గలు పుణికి చకచక బయటికి వెళ్లిపోయింది ప్రీతి.

"ఇప్పుడు పోయి సీసా కొనితెచ్చుకుంటుంది. అందుకే వద్దన్నాను'' !

మహిమ తెల్లబోయింది. "అందుకా ! నేనింకా ఏదో అవసరం వచ్చి అడిగిందనుకున్నాను'' గిల్టీగా అంది.

"ఇదిగో ఇలాగే డబ్బంతా తగలేసుకుంది. ఒళ్లు గుల్ల చేసుకుంటోంది. తాగకుండా ఉండలేదు. అంతలా అలవాటయింది. డబ్బు చేతిలో లేకపోతే ఎంతకైనా దిగజారి, అందరినీ అడుగుతుంది. మొదట్లో ఏదో పోనిలే బ్యాడ్ డేస్ నడుస్తున్నాయి కదా అని అడిగినప్పుడల్లా ఉన్నదానిలో ఇచ్చేవాళ్లం. తీర్చడం అనేది ఎప్పుడూ లేదు. రోజురోజుకీ తాగుడు ఎక్కువయింది. మేం మాత్రం ఎన్నిసార్లు ఇస్తం. లేదంటే తిట్టేది, అరిచేది. అవసరానికి ఆదుకోని మీరేం స్నేహితులు అంటూ ఏడిచేది. ఈ గోల రోజురోజుకీ ఎక్కువయింది. పొమ్మంటే పోదు. ఎక్కడికి పోతాను అంటుంది దిగులుగా. ఇదంతా న్యూసెన్స్ అయి పోయింది. తన ఉచ్ఛస్థితి కళ్లారా చూసినవాళ్లం. ఇప్పుడీ స్థితిలో తనని రోడ్డున లాగిపడేయలేం కదా ..."

రూమ్‌లోకి వెళ్ళాక, మహిమ సీమ పక్కనే కూర్చొని, అడిగింది. "ఇప్పుడు తనకేం సంపాదన లేదా" ?

"నా మొహం సంపాదన. ఎవరో ఒకరో ఇద్దరో ఎప్పుడో చిన్న చిన్న యాడ్స్‌కి పిలుస్తుంటారు. ఓ ఐదువందలు చేతిలో పెట్టి పంపిస్తారు" ?

"మరి భోజనం ... ఇంటద్దె ..." ? సందేహం వెలిబుచ్చింది మహిమ.

"చెప్పాగా ... చేతిలో డబ్బుంటే ఎప్పుడో ఓసారి కాస్తో కూస్తో ఇస్తుంది. రూము ఖాళీ ఉంటే రూములో పడుకుంటుంది. లేకపోతే ఈ హాల్లో పరుపేసుకు పడుకుంటుంది. వెలిగిన రోజుల్లో ... మా అందరికీ ఎన్నెన్ని ప్రెజంట్లు, బర్త్‌డే గిఫ్ట్‌లు, హోటళ్ళలో పార్టీలు, మంచి మంచి డ్రెస్సులు ... ఏవేవో కొనిచ్చేది. అందుకే నిర్దయగా పొమ్మనలేకపోతున్నాం. "మాతోపాటే తింటుంది. ఖర్చు అందరం షేర్ చేసుకుంటాం. ఏం చెయ్యమంటావు? తోటి అమ్మాయి ... చూస్తే బాధగా ఉంటుంది".

"వాళ్ల ఊరు వెళ్లిపోవచ్చు గదా ..."

"ఊర్లో ఎవరున్నారు. వాళ్ల అమ్మ అన్నయ్య దగ్గర ఉంటుంది. వదినగారు ప్రీతి సంగతి తెలిశాక లోపలికి రానీదు ... తల్లి నిస్సహాయంగా ఉండిపోయింది".

"అంతలా ఎలా ..." రేణుక టీ పట్టుకురావడం చూసి ఆగిపోయింది మహిమ. టీ తాగి, కాస్త స్నాక్స్ తింటుండగా, "సీమా, పోనీ మన ఆఫీసులో ఏదన్నా చిన్న జాబ్ ..."

"ఏయ్ ... నీకేమైనా మతిపోయిందా ? ఆమెను అసలు ఆఫీసులో అడుగు పెట్టనీయరు. అసలు తను ఇక్కడున్నట్టు వాళ్లకి తెలిస్తే ఏం చేస్తారో ... ప్లీజ్ ఎవరి దగ్గరా ఈ ప్రసక్తి తేవద్దు ..."

"అసలేం జరిగింది ? సీమా ... రియల్లీ ... నాకు చాలా బాధగా ఉంది. చెప్పవా" ?

సీమ బద్ధకంగా ఆవులిస్తూ "ఇంకోసారి చెబుతాలే. కాసేపు పడుకోనివ్వు ..." అంది అటు తిరిగి. మహిమ నిరాశగా తనూ పక్కమీద వాలింది.

✳ ✳ ✳

మీనన్ మహిమ పోస్టు చూడడం పూర్తిచేసి ... "మొదటిదే బాగుంది. రెండోది నీవన్నట్టు నెగెటివ్ అప్రోచ్. వాళ్లు శుభంగా షోరూమ్ ప్రారంభిస్తున్నప్పుడు పాజిటివ్ అప్రోచ్ బాగుంటుంది. రిచ్‌గా యాడ్ తీస్తారు. అయినా చీరల గురించి ఇంతకంటే ఏం చెప్పగలం ? ఇంకేదన్నా తట్టిందా" ? ఆలోచిస్తూ అడిగాడు.

"లేదు సర్. ఎంత ఆలోచించినా, నాలుగైదు రాసినా, ఇదే బాగుంది అనిపించింది".

"ఓకే ! విశాల్ గారిని కూడా చూడనీ, ఆయన ఏం చెప్తాడో విన్నాక ఓకే చేద్దాం. ఇదిగో ఈ రెండు ఆర్డర్లు తీసుకెళ్లి వర్క్‌చేయి" మరో రెండు ఆర్డర్ల ఫైలు ఇచ్చాడు. మహిమ సీటులోకి వచ్చి కూర్చుంది. ఫైలు ఓపెన్ చేసి చూసింది. ఒకటి కొత్తగా మార్కెట్‌లోకి రాబోయే సబ్బు, రెండోది కొత్త వంట నూనె. రెండింటికి కాప్షన్ కావాలి, ప్రకటనకి. ఇవి కూడా విజువల్సే కాని ప్రకటనకి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ఏమిటో ఇన్ని రకాల సబ్బులు ... మార్కెట్‌లో

ఎన్ని నిలదొక్కుకుంటాయో తెలియదు. జనం అలవాటుపడిన వస్తువుని అస్తమానం చాలామంది మార్చరు. కొందరు అదేపనిగా కొత్త ప్రోడక్ట్ రాగానే మార్చేస్తుంటారు. చాలామంది టూత్‌పేస్ట్‌ల్లాంటివి మారిస్తే నోట్లో పుళ్లు పడతాయని భయపడడం తను వింది. ఆలోచిస్తూ కంప్యూటర్‌లో కొత్త ఐడియాల కోసం వెతుకుతుంటే విశాల్ దగ్గర్నుంచి రమ్మన్న ఫోను వచ్చింది.

"ప్లీజ్ బి సీటెడ్ ! పెళ్ళిసీను, పెళ్ళికొడుకు తన్మయత్వంతో చూడడం ఆ సమయంలో సహజంగా జరుగుతుందా ?'' కాస్త సందేహంగా అడిగాడు.

"అంటే ... మామూలుగా వరుడు చూసీచూడనట్టు అమ్మాయిని, చీరని చూసి చాలా బాగుందనుకుంటాడు. నిజజీవితంలో అరక్షణంలో అతని మెదడుకి ఆ సీను సంకేతం పంపించేస్తుంది. కానీ, తెరమీద ఆ సీను పడ్తుంది. ఇలా ఒక్కసారి ఫోకస్ చేసి, కెమెరా పక్కకి వెళ్ళిపోతే మెసేజ్ అందదు చూసేవారికి...''

విశాల్ విశాలనేత్రాలతో చకితుడైనట్టు చూస్తుండిపోయాడు. ఈ అమ్మాయి ఎంత లోతుగా ఒక సీను అబ్జర్వ్ చేసి, ప్రెజెంట్ చేసిందో అర్థమై మహిమవి మామూలు ఆలోచనలు కావు, తీసిపారేసే ఆలోచనలు అసలే కావనుకున్నాడు. అరక్షణంలో మహిమ పట్ల అతని అంచనాలు పెరిగిపోయాయి. అతనికి తెలియ కుండానే ఆరాధనభావం, గౌరవం, ఆసక్తి లాంటి భావాలన్నీ అతన్ని చుట్టు ముట్టాయి.

"సార్, ఈ యాడ్ ఎక్కువగా కెమెరా పనితనం మీద ఆధారపడుతుంది. షాపులోని ప్రతి కోణాన్ని రిచ్‌గా చూపించాలి. చీరల అందాలకి, అమ్మాయిల అలంకారాలకి ప్రేక్షకులు ఎక్కువగా ఆకర్షితులవుతారు తప్ప, ఈ సంభాషణల పట్ల అంత పట్టించుకోరని నా విశ్వాసం. విజువల్స్ ఉన్నప్పుడు కెమెరా మాట్లాడాలి కానీ, రైటర్ స్క్రిప్టు కాదు. అయినా ఈ సీను సగటు ప్రేక్షకుడికి సులువుగా అర్థం కావడానికి ఆ డైలాగులు చాలని నా భావన. మాటలకు విలువ తక్కువిచ్చి కెమెరాకి ఎక్కువ పని చెపితే సీను పండుతుంది. కెమెరా మూమెంట్స్, షాట్స్

అవన్నీ డైరెక్టర్, కెమెరామేన్‌ల ప్రతిభ, పనితనం మీద ఆధారపడి ఉంటాయి'' అనర్గళంగా చెప్పుకుపోతోంది మహిమ.

విశాల్ తేరుకుని, "ఎస్ ! మహిమా ... రియల్లీ యూ ఇంప్రెస్‌డ్ మీ. నాకర్థమైంది మీ భావం. మీరు చెప్పింది కరెక్ట్ ! ఈ యాడ్‌కి కెమెరా షాట్స్ హైలైట్ కావాలి''.

"సర్, అవసరమైతే షూటింగ్ జరిగే చోటుకి వెళ్లి కెమెరా ప్లేస్‌మెంట్స్‌కి సహాయం చేయగలను. నేను నా ఊహల్లో ఎలా అనుకున్నానో డైరెక్టర్, కెమెరామేన్‌లకి, కావాలంటే సలహా చెప్పగలను''.

"ఓ ! మీకు ఈ ఫీల్డ్ కూడా తెలుసా ...'' ఆశ్చర్యంగా అడిగాడు.

"ఆ ... ముద్రాలో ఉన్నప్పుడు, పనేమీ లేకపోతే, నేను స్క్రిప్టు ఇచ్చిన షూటింగ్ చూస్తుండేదాన్ని. ఈ కెమెరా యాంగిల్ ఇలా ఉంటే బాగుండేది ... ఆ షాట్ అలా తీస్తే బాగుండేది ... అనిపించేది. కానీ ట్రైనింగ్ పీరియడ్‌లో నా అభిప్రాయాలు డైరెక్టర్‌కి చెప్పడం మర్యాద కాదు. అపార్థం చేసుకుంటారు గదా. కాని అలాంటి షూటింగులన్నీ కుతూహలంగా చూడడం వల్ల నాకు కొంత అనుభవం వచ్చింది'' మహిమ నమ్రతగా అంది.

"ఓ ! అయితే కొన్నాళ్లకి డైరెక్ట్ చేసేస్తానని ఆ ఫీల్డ్‌లోకి వెళ్లిపోతారేమో ...'' నవ్వుతూ అన్నాడు విశాల్. "ఓకే ! ఇది ఓకే చేద్దాం. షూటింగ్ ఆరంభమయ్యాక మీకు కావాలంటే డైరెక్టర్‌తో చెప్పి పర్మిషన్ ఇప్పిస్తాను''.

"థాంక్స్ సర్ ! ఇట్ విల్ బి ప్లెజర్ ఫర్ మి ...''

"సర్, ఫైనల్ చేశాక, షూటింగ్‌కు ముందే డైరెక్టర్‌తో ఒకసారి మాట్లాడితే మంచిది. వాళ్లు షాట్ డివిజన్ ప్లాన్ చేశాక మార్చమనడం బాగుండదు. ఏదన్నా చెప్పాలంటే ముందే చెప్పాలి ...''

"ఓకే ! డైరెక్టర్ నిర్ణయం జరిగాక, ఓసారి మీ ఇద్దరూ కలిసి స్క్రీన్‌ప్లే చూసుకోండి. హ్యాపీ ...'' అన్నాడు విశాల్ నవ్వుతూ.

మహిమ నిజంగా చాలా ఆనందంగా "థాంక్యూ సర్ ! ఐయామ్ గ్రేట్‌ఫుల్ టు యూ" అంటూ బయటికి వెళ్ళి సీటువైపు నడుస్తుంటే గాలిలో తేలిపోతున్నట్లనిపించింది.

"ఏమిటి అంత హ్యాపీగా ఉన్నావు. సెలెక్ట్ చేశారా విశాల్ సార్ ..." అనుపమ నవ్వుతూ అంది. "అనుపమ, గిరీష్ ... కంగ్రాట్ మీ" అంది. అనుపమ చేయి పట్టుకుని జరిగిందంతా చెప్పగానే ... "ఏయ్ రెండు రోజులకే బాస్ మనసు దోచేశావు. మేమిక్కడ ఏణ్ణర్థం నించి పనిచేస్తున్నాం" అలిగినట్టు అంది.

"టాలెంటమ్మా ! టాలెంట్ ఉంటే ఎవరూ పైకి లాగక్కరలేదు. మహిమ దూసుకు వెళ్ళిపోతుందంటే ... అది ఆమెలో ఉన్న క్రియేటివిటి ప్లస్ అంకితభావం. కంప్యూటర్ ముందు కూర్చుంటే ఆమె కళ్లు ఇటు అటు చూడవు. మనం అంత సిన్సియర్‌గా చేస్తున్నామా ... ఉద్యోగాన్ని ఉద్యోగంలా చూస్తున్నాం" గిరీష్ నిజాయితీగా అన్నాడు.

"అవునులే ... అందరం ఒకలా ఎలా ఆలోచించగలం. అందరి గీతలు ఒకలా ఉండవు. అందరి రాతలు ఒకలా ఉండవు" అంటూ నుదుటి గీతలని చూపిస్తున్నట్టు యాక్ట్ చేసింది అనుపమ. అంతా నవ్వారు.

"ఏయ్, మరీ అంత పొగడ్తలొద్దు. కాని ఒకటి చెప్పు. ఇప్పుడు ఈ స్క్రిప్టుకి ఎంత అమౌంట్ అవుతుందన్నది. ఎంత బిల్లింగ్ చెయ్యాలి, డైరెక్టర్, ప్రొడ్యూసర్, నటీనటులను ఎవరు సెలక్ట్ చేస్తారు ..."

"అబ్బో అన్నింటికి తలో డిపార్ట్‌మెంటు. కస్టమర్ ఆర్డర్ వచ్చాక ముందు అది ప్రకటనా, విజువల్సా, షార్ట్ ఫిలిమా అని ఏ ఆర్డరులో చూసినా, ముందు క్రియేటివ్ డిపార్ట్‌మెంటే ప్రకటన తయారుచేస్తుంది. తరువాత యాడ్ డివిజన్‌కి, విజువల్స్ అయితే విజువల్ డివిజన్‌కి పంపిస్తారు. ఉత్త ప్రకటన అంటే వార్తా పత్రికల కోసమైతే, ఆర్టిస్టుల చేత బొమ్మ వేయించి, ప్రకటన రాయిస్తారు. కొన్ని ప్రకటనలకి ఆర్టిస్ట్‌లు ఫోటోలతో ... అంటే సినీతారలు, క్రికెట్ తారలు,

మోడల్స్ లాంటి వారితో కాప్షన్ చెప్పిస్తూ ఫోటోలతో ప్రకటనలుంటాయి. డబ్బిచ్చేవాడికి కావల్సిన విధంగా, వారి పేమెంట్ని బట్టి, బడ్జెట్ని బట్టి ప్రకటన కేటగిరీలుంటాయి. విజువల్స్కి రేటెక్కువ ఉంటుంది. స్క్రిప్టు ప్రకారం ఆర్టిస్టులెంతమంది ? లొకేషన్ అవుట్డోరా, ఇన్డోరా ? ఎన్ని సీన్లు ? సింగిల్ షాట్, మ్యూజిక్ బ్యాక్గ్రౌండ్ చాలా ? పాట ఉండాలా ? ఇవన్నీ చూసి ఆర్టిస్టులని, డైరెక్టర్ని బుక్ చేసుకోవడం, షూటింగ్కి కావల్సిన కెమెరాలు, లైట్లు, వాళ్లందరికి పేమెంట్స్ ... ఈ వ్యవహారాలన్ని చూసుకోవడానికి ఒక్కొక్క యాడ్ ఒక్కో ప్రొడ్యూసర్కి అప్పచెబుతారు. ప్రొడ్యూసర్ మొత్తం ఖర్చును ఎస్టిమేట్ చేసి, ఫైనాన్స్ డిపార్ట్మెంట్కి పంపిస్తారు. అంటే ఒక యాడ్ రావాలంటి ముందు క్రియేటివ్ డిపార్ట్మెంట్కి పంపిస్తారు.వారు పరీక్ష చేసి, బిల్లు తయారుచేసి అది కస్టమర్కి పంపి, బేరసారాలు జరిగాక పని మొదలుపెట్టాలి. పేమెంట్ కూడా ఒక్కొక్క కంపెనీ ఒక్కో విధంగా తీసుకుంటుంది. సాధారణంగా అందరూ ఆరంభానికి ముందు సగం, తరువాత ప్రోగ్రెస్ని బట్టి పాతిక పర్సెంట్, పూర్తి అయి ఓకే చేశాక మిగతా ఫుల్ అమౌంట్ పే చేస్తారు. వాళ్లిచ్చిన టైం లిమిట్లో పని పూర్తి చేసి ఇచ్చాక కొన్ని ప్రోడక్ట్స్ అడ్వర్టైజింగ్ బాధ్యతను యాడ్ ఏజెన్సీలకే, అంటే పత్రికలకి పంపడం, టీ.వి.లకి, సినిమా థియేటర్లకి, కాంట్రాక్టులో ఎలా ఉంటే అలా డిస్ప్లే చేసే బాధ్యత కూడా వీరికే అప్పగిస్తారు. సాధారణంగా యాడ్ ఏజెన్సీలే ఈ ప్రకటనల సంగతి చూసు కుంటాయి''.

"సపోజ్ ... మనం తయారుచేసిన యాడ్ కస్టమర్కి నచ్చకపోతే" ? మహిమ సందేహం.

'ఆ మర్చిపోయాను ... ప్రకటన స్క్రిప్టు తయారయ్యాక, అంగీకారం కోసం కస్టమర్కి పంపుతారు. వారు సరేనంటే ప్రొడక్షన్కి వెడుతుంది. మార్పులు సూచిస్తే మళ్లీ క్రియేటివ్ డిపార్ట్మెంట్ మార్చాల్సి ఉంటుంది. ఒకసారి అగ్రిమెంటు పూర్తయ్యాక ఇంక మార్చడం ఉండదు. యాడ్ పని పూర్తయ్యాక మరోసారి కస్టమర్కి పంపి అతను పూర్తిగా సంతృప్తి చెందాకే మొత్తం

చెల్లించాల్సిన డబ్బు చెల్లిస్తారు. పేమెంట్ మొత్తం అయ్యేవరకు ప్రకటనలకి పంపరు".

"ఒక ప్రకటన బయటికి రావడానికి ఇంత తతంగం, తెరవెనక, తెరముందు ఇంతమంది పనిచెయ్యాలన్నమాట ..."

"ఇది కేవలం ఆఫీస్ స్టాఫ్. ప్రొడక్షన్ వారంతా కాంట్రాక్ట్ వాళ్లే. నటీనటులు, కెమెరా స్టాఫ్, మ్యూజిక్, స్టేజీ ప్రాపర్టీస్ ... అన్నీ ఎప్పటికప్పుడు ఎవరు దొరికితే వారిని బుక్ చేస్తారు. వీళ్లు కాక ఇంటీరియర్ డెకొరేటర్స్, ఎలక్ట్రీషియన్స్, కార్పెంటర్స్ ... చిన్న చిన్న యాడ్‌లకి, అంటే వంటింట్లో, బాత్‌రూముల్లో, ఓ డెంటిస్ట్ క్లినిక్, బెడ్‌రూముల్లో షూట్ చేయడానికి అప్పటికప్పుడు సెట్స్ వేస్తుంటారు. మనం చిన్న చిన్న యాడ్‌లలో చూసే డెంటిస్ట్ క్లినిక్కు, బాత్‌రూమ్ క్లీనింగ్ మెటీరియల్ యాడ్స్, వంటింటి పొడులు, పచ్చళ్ళ ప్రకటనలు అన్నింటికి సెట్స్ వేసి షూట్ చేస్తారు. ఎందుకంటే అవుట్‌డోర్, ఇళ్లల్లో షూటింగులకి ప్రయాసతో పాటు ఖర్చు ఎక్కువవుతుందని. ఫిఫ్త్‌ఫ్లోర్‌లో చూశావుగా ... అంతా షూటింగులకి, సెట్స్‌కి వాడతారు. ఎవరెవరు ఎక్కడ పనిచేస్తున్నారో కూడా అందరికీ తెలియదు. ఎవరి డిపార్ట్‌మెంట్ వారిదే. మొత్తం అంతా మేనేజ్ చేసేది ఛైర్మన్ అవినాష్‌జైన్. ఆయన కొడుకులు వినోద్, విశాల్ డైరెక్టర్లు, అసిస్టెంట్స్, సెక్రటరీలు ... ఓ రెండేళ్ల నుంచీ చూస్తున్నా, నాకు కూడా పూర్తిగా తెలియదు అన్నింటి గురించి".

"వినోద్ అన్న ఆయన కనపడలేదే ? విశాల్ గారిని చూశాను ..."

అనుపమ అదోలా నవ్వి ... "మనకు ఆయన కనపడడు, మనం ఆయనకి కనపడం. మనం ఆయనకి కనపడకపోవడం మంచిది ..." అదోలా నవ్వి అ,ది. "అతనిది విజువల్స్ సెక్షన్. ప్రొడక్షన్, డైరెక్టర్‌లు, నటీనటులు, ప్రొడ్యూసర్లు ... ఫైనల్ ప్రోడక్ట్ తయారై వెళ్ళాల్సింది అక్కడినుంచే. సాధారణంగా మన క్రియేటివ్ సెక్షన్ నుంచి స్క్రిప్టు పంపించాక మన పని అయిపోతుంది.

అప్పుడప్పుడు కస్టమర్‌కి నచ్చనివి మార్చి రాయాల్సి ఉంటుంది. వినోద్ గారితో మనకు డైరెక్ట్ కాంటాక్ట్ ఉండదు''.

'ఓ ఐసీ ! తెలుసుకోవాల్సినవి చాలా విషయాలు ఉన్నాయిక్కడ. ఇంట్రెస్టింగ్ ఫీల్డ్'' అంది మహిమ. ఆ తరువాత ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు.

⁂ ⁂ ⁂

ఆరతి ఆరోజు చాలా సంబరంగా, హుషారుగా బ్యాగు ఊపుకుంటూ వచ్చింది. అందరు డైనింగ్ టేబిల్ దగ్గర భోజనం కోసం కూర్చున్నప్పుడు ... "హాయ్ గర్ల్స్ ! అయామ్ వెరీ హ్యాపీ హ్యాపీ'' అంది బ్యాగును టేబిల్ మీద పడేసి ఊరిస్తున్నట్టు.

"ఏం తల్లీ ! ఏదన్నా యాడ్‌లో యాక్ట్ చేసే ఛాన్సు ఇంకోటి వచ్చిందా'' ? సీమ అంది.

మహిమ కుతూహలంగా చూసింది.

"ఓ యస్ ! గెస్ ... ఏం పాత్ర ...'' ఊరించింది.

"ఏముంది ఏ సబ్బో చేత్తో పట్టుకుని పోజిస్తూ ... 'మాసబ్బునే వాడండి' అని చెప్పడం'' మంగళ నవ్వుతూ అంది ఆటపట్టిస్తూ.

"ఏయ్ పో ... చీప్ ఆలోచనలు మీవి. ఈసారి మిలమిల మెరిసిపోయే పెళ్ళికూతురు వేషం. ఖరీదయిన పట్టుచీర, ఒంటినిండా ధగధగలాడే నగలు, అద్భుతమైన మేకప్‌తో రిచ్‌గా గొప్పింటి పెళ్ళికూతుర్ని చూస్తారు. పెళ్ళికూతురిగా నేను సెలక్ట్ అయ్యాను. పెద్ద చీరల షోరూమ్ షూటింగ్'' అంటూ నడుం మీద చెయ్యిపెట్టి పోజిస్తూ అంది.

"ఎంతసేపు ? పది సెకన్ల సీనా ... ? చీరల ప్రకటన అయి ఉంటుంది'' స్రవంతి కవ్వించింది.

"ఏయ్ ... రెండు నిమిషాల సీను. పెళ్ళి స్టేజి ... పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు వరమాల మార్చుకునే సీను ..." గొప్పగా అంది ఆరతి.

'ఏమిటి పెళ్ళి సీనా ... ? అబ్బాయి అమ్మాయి వంక, చీరవంక అలా మైమరచి చూస్తాడు ... అంతేనా, అదేనా సీను ? ఉద్విగ్నంగా అంది మహిమ.

"ఏయ్ ... నీకెలా తెలుసు ..." తెల్లబోతూ అడిగింది ఆరతి.

"నేనే స్క్రిప్టు తయారుచేశాను. అప్పుడే దాని మీద వర్క్ మొదలుపెట్టేశారా?" ఆరాటంగా అంది మహిమ.

"నువ్వు రాశావా ? రియల్లీ ... ! ఏయ్ థాంక్స్ మహిమా ! నాకోసమే రాసినట్టున్నావు. ఇవాళ ఆ యాడ్‌కి ఏక్ట్ చెయ్యడానికి అగ్రిమెంటు రాయించు కున్నారు. థాంక్యూ ..." మహిమ చేతులు పట్టుకు ఊపింది.

"భలేదానివే. రాయడం నా డ్యూటీ. అది నీకు దొరకడం నీ లక్. థాంక్స్ నాకెందుకు. నీ బాస్‌కి చెప్పు. డైరెక్టర్ ఎవరు ? షూటింగ్ ఎప్పుడు" ?

"అవన్నీ నాకేం తెలుస్తాయి. నా పాత్ర వరకు నాకు చెప్పారు. మిగతా దంతా పని ఆరంభించినప్పుడు తెలుస్తుంది. ఏయ్ లెటజ్ సెలబ్రేట్ ... ఐస్‌క్రీమ్ ఆర్డర్ చేస్తాను" అంది ఆరతి సంబరంగా.

"ఓకే గ్రేట్ ! రేణూ డిన్నర్ పట్రా ఆకలేస్తోంది" అమ్మాయిలంతా అరిచారు.

"ఇదివరకు ఎన్ని యాడ్స్‌లో నటించావు". మహిమ ఆరా తీసింది చపాతీ తింటూ.

"ఎక్కడ ... నేను ఫీల్డ్‌లోకి వచ్చి ఏడాదిన్నర అయింది. చిన్న చిన్న ఫోటో యాడ్స్ రెండు మూడు, ఒకటి రెండు చిన్న యాడ్స్ తప్ప, ఇంత రిచ్ ప్రకటన, అదీ రెండు నిమిషాల ప్రకటనలలో ఇదే మొదటిసారి. ఒకసారి ఒక ఫ్యాషన్ షోలో పాల్గొన్నాను. రన్నరప్‌గా బహుమతి వచ్చింది. ఈ ఛాన్స్‌తో నా అదృష్టం తిరిగి సినిమా ఛాన్స్‌లు వస్తే ... అది నా కల మహిమ" ఎమోషనల్‌గా అంది ఆరతి.

"తప్పకుండా నెరవేరుతుంది. అందం, టాలెంట్ ఉంది. జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటే సక్సెస్ తప్పకుండా వస్తుంది" నమ్మబలికింది.

డిన్నర్ తరువాత ఐస్‌క్రీమ్ ట్రీట్ అందరూ ఎంజాయ్ చేస్తుండగా ప్రీతి వచ్చింది. "హాయ్ ఎవ్రీబడీ ... ఏమిటి ఐస్‌క్రీమ్ పార్టీ. వావ్ ... నాది వేరే పెట్టండి. తరువాత తింటా ... ఇంతకీ ఈ సెలబ్రేషన్ దేనికి" ? అంది కుర్చీలో వాలిపోయి.

"ఆరతికి మంచి యాడ్ ఫిలింలో నటించే ఆఫర్ వచ్చింది" సీమ అంది.

"ఓ, ఐసీ, కంగ్రాట్స్ ఆరతి ... ఏ ప్రోడక్ట్ ..." అంది.

"ఏదో చీరల షోరూమ్, గ్రాండ్ ఓపెనింగ్, పెళ్ళి షాట్ ... పెళ్ళికూతురి వేషం" అంది ఆరతి.

"కంగ్రాట్స్ వన్స్ ఎగైన్. ఇదిగో ఇలా షూటింగ్‌లప్పుడు జాగ్రత్తగా ఉండు. ఆ వినోద్‌గాడి కంటబడకు వీలయినంత వరకు. చూశాడంటే, కాస్త ఎర్రగా బుర్రగా ఉంటే పట్టేస్తాడు. వాడి పొగడ్తలకి పడిపోకు. బీ కేర్‌ఫుల్" అని చెబుతూ, "ఓకే ! మీరంతా తినేశారా ! లంచ్ కూడా తినలేదు, ఐదొందలు చేతిలో పెట్టాడు. మన డేస్ బాగులేనప్పుడు ... అదే దక్కుడు అని సంతోషించాలి" తనలో తనే అనుకుంటున్నట్లు మాట్లాడుతూ అన్నం తినసాగింది.

ప్రీతి మాటలు, ధోరణి మహిమకి ముందునుంచీ వింతగానే ఉన్నాయి. సీమ కూడా సరిగా చెప్పలేదు. ఇంకోసారి అడగాలి ... అనుకుంది. గుడ్‌నైట్ చెప్పుకుని ఎవరి గదుల్లోకి వాల్లు వెళ్లారు.

"సీమ ... ఈ ప్రీతి సంగతి చాలా ఆశ్చర్యంగా ఉంది నాకు. సగం చెప్పి వదిలేశావు ఆరోజు ..." అంది మహిమ కుతూహలంగా.

"ఓకే. రేపు ఆదివారం. సెలవు కాబట్టి తొందరగా లేవక్కరలేదు గదా. చెప్పడానికి చాలా ఉంది కథ. కాని ప్రీతి కథ విని ప్రతి ఆడపిల్లా జాగ్రత్తగా

ఉండాలని మేమందరం కొత్తగా వచ్చిన అమ్మాయిలకి చెప్తుటాం. తనూ పాపం తన చేతులు కాలినట్టు ఇంకో అమ్మాయి కాల్చుకోకూడదని ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తూ జాగ్రత్తలు చెప్తుంటుంది. అవునూ ... నువ్వు హిందీలో “పేషన్” అనే సినిమా చూశావా ? మన ప్రీతి కథ అలాంటిదే ఇంచుమించు”.
“చూడలేదే ... నాకిన్నాళ్ళు చదువు, ట్రైనింగ్‌తో బిజీలైఫ్ అయిపోయి సినిమాలు చూసే తీరికే లేకపోయింది”.

తరువాత సీమ చెప్పిన మాటలు, ప్రీతి వాళ్లతో చెప్పిన కథ, ప్రీతి జీవితం ఎలా నాశనం అంటుందో వింటుందో...మహిమకి సినిమా చూస్తున్నట్టే అనిపించింది.

✳ ✳ ✳

“హాయ్ ప్రీతీ, మై డార్లింగ్ ... హ్యాపీ ... నా ప్రామిస్ నిలబెట్టుకున్నాను కదా ... నౌ యు బిలీవ్ మీ” గోముగా అడిగాడు ప్రీతి వెంట్రుకలు సరిచేస్తూ. మాటలు రానట్టు. చేతులు మెడచుట్టూ వేసి అతని గుండెల్లో మొహం దాచుకుంది ప్రీతి.

“థాంక్‌యూ డార్లింగ్ ! నా కలను ఇన్నాళ్లకి నిజం చేశావు. యు మేడ్ మి ఎ స్టార్ ! అయామ్ సో హ్యాపి ! ఇవాళ అందనంత ఎత్తుకి ఎదిగిపోయానన్న ఫీలింగు ... రెండేళ్ల నా కష్టం, ఎదురుచూపులు ఫలించాయి. నీ సపోర్ట్ లేకుండా నేను ఈ స్థాయికి ఎదగడమన్నది కలగానే మిగిలేది ...” కళ్లు చెమ్మగిల్లుతుండగా అంది.

“డోన్ట్ బి సిల్లీ ! నీలో అందం, ఆకర్షణ, నటన అన్నవి లేకపోతే నేనెంత ప్రయత్నించినా సక్సెస్ అవలేవు. ఇప్పుడు చూడు ఇక నీ వెంట అందరూ ఎలా పడతారో. ఫ్యాషన్ వరల్డ్ ఏదీ శాశ్వతం కాదు ప్రీతి. ఈ క్షణం నిచ్చెన పైమెట్టుమీద ఉంటావు. ఆ స్థానం నిలుపుకోడానికి అనేక దారులలో వెళ్లాలి.

అందరినీ ఆకర్షిస్తూ, మాటల్లో తెలివి, ఆత్మవిశ్వాసం, మంచితనం, వినయం అన్నీ కనబరుస్తూ, అందం మెరుగుపరుచుకోడానికి ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ ... యోగాలు, ఎక్సర్‌సైజులు, ఫేషియల్స్, బ్యూటీ ట్రీట్‌మెంట్లు అన్నీ జీవితంలో భాగం అవ్వాలి. పేరొచ్చింది కదాని ప్రతి చెత్తా ఒప్పుకోకు. డిగ్నిఫైడ్‌గా కనపడాలి''.

“ఓకే డార్లింగ్ ! నా వెనక నీవుండగా నాకేం భయం'' కౌగిలి మరింత బిగించింది.

“ఏమో ! రేపు పెద్ద స్టార్‌వి అయిపోతే, నా అవసరం తీరిపోవచ్చు. అప్పుడు నేను నీ వెంట పడాలేమో. నీ దర్శనం కోసం పడిగాపులు పడాలేమో ...''

“ఏయ్ ... అలా మాట్లాడకు, నాకు కోపం వస్తుంది'' బుంగమూతి పెట్టింది.

“చిన్న పాపాయిలా ఏమిటా అలక'' ఆ బుంగమూతికి ముద్దు పెట్టాడు.

“ప్రీతి, నిజంగా, నీవు నా జీవితంలోకి రాకపోతే ఎంత నిస్సారంగా జీవితం గడిచేదో. జీవితంలో ఛార్మ్ లేదు అన్న నైరాశ్యాన్ని పటాపంచలు చేశావు. నా జీవితంలోకి వెలుగులా, వరదలా వచ్చేసి చుట్టుముట్టేశావు. నీ ప్రేమలో పడి ఎటో కొట్టుకుపోయాను. చుట్టూ ప్రపంచం ఉన్నదన్నదే మర్చిపోయాను. ప్రేమ అంటే ఇలాంటి అనుభూతి అని ఎరగని నాకు కొత్త లోకాన్ని చూపావు'' ఆర్తిగా, ఆరాధనగా ఆమెని చుట్టేసి అన్నాడు.

“ఓ అనామికగా, కలలు మాత్రమే కనగలిగే మామూలు అమ్మాయిలో ఏం చూశావో, ఏం మంత్రం వేశావో, నేనెందుకు నచ్చానో, ఏదీ ఆలోచించే శక్తి కోల్పోయినట్లు చేసి వశపరచుకున్నావు. నీవు మంత్రగాడివి. ఒకటే భయం నాకు. ఇది కల అని, కరిగిపోతుందన్న భయం మాత్రం వదలడం లేదు. నిన్ను శాశ్వతంగా నా దగ్గర ఉంచేసుకోవాలంటే ... ఎలా డియర్ ? చెప్పు నేనేం చెయ్యాలో ...'' ఆర్తిగా అంది ప్రీతి.

“అది సాధ్యం కాదని మనిద్దరికి తెలుసు. మరుక్షణం మనది కాదు.

ఉన్న క్షణంలో ఆనందం అనుభవించకుండా జరగనిదాని గురించి ఆలోచించి ఉన్నది చేజార్చుకోవద్దు. ప్రీతి, నన్ను ఈ అనుభూతినించి దూరం చెయ్యకు. ఇక్కడున్నంతసేపు మనిద్దరం తప్ప ఏ ఆలోచన చొరబడనీయకు" తమకంగా అల్లుకుపోయాడు.

ప్రీతి నిట్టూర్చింది. ఆ విషయం తనకీ తెలుసు. కానీ, తను కోరుకున్న ఈ క్షణాలు తనెప్పటికీ ఉంచుకోవాలంటే ఏంచెయ్యాలో మాత్రం తెలియడం లేదు ఆమెకి.

✳ ✳ ✳

ప్రీతి తండ్రి బ్యాంక్ ఉద్యోగి. తల్లి స్కూలు టీచరు. ఇద్దరిది కులాంతర వివాహం అవడంతో ఇటువారు, అటువారు దూరం అయ్యారు. ప్రీతి పుట్టాక ఇంక పిల్లలు వద్దనుకున్నారు. ప్రీతిని ఉన్నంతలో బాగానే పెంచి చదివించసాగారు. వయసొచ్చేసరికి ప్రీతి, తల్లి అందం పుణికిపుచ్చుకుని మిసమిసలాడే టీనేజ్ గర్ల్, కాలేజ్ గర్ల్‌గా మగపిల్లలందరినీ తన చుట్టూ తిప్పుకుంటూ, వాళ్ల పొగడ్తలకి మురిసిపోతూ, తన అందం చూసి వెంటపడుతున్న అందరిని ఆకర్షిస్తూ, తనో రాకుమారిగానో, ఓ సినీతారగానో ఊహించుకుంటూ, చుట్టూ ఉన్న అమ్మాయిలని చిన్నచూపు చూస్తూ, తనుండాల్సింది ఇలాంటి చోటున కాదని, ఎలాగైనా సినిమాలలో పెద్ద నటి అవ్వాలని, కావాలని, ప్రకటనల రంగంలో చిన్న ఉద్యోగం సంపాదించుకుని, చిన్న చిన్న యాడ్స్‌లో నటిస్తూ ఏనాటి కన్నా తనకి గుర్తింపు వచ్చి, పెద్ద స్టార్ అవ్వాలని కలలు కనే సమయంలో ... వినోద్ కంటపడింది.

ఓ రోజు చిన్న ప్రకటన జరుగుతోంది. చిన్న టూత్‌పేస్ట్ ప్రకటన. హౌస్‌వైఫ్‌గా నటించే సీను. షూటింగ్ జరుగుతుండగా వినోద్ ఇంటికి వెళ్ళబోతుంటే లిఫ్ట్ దగ్గర షూటింగ్ పూర్తిచేసి బయటికి వచ్చి లిఫ్ట్ వైపు వెడుతున్న

ప్రీతి కనబడింది. చూపు తిప్పుకోకుండా అటే చూస్తుండిపోయాడు. లిఫ్ట్ తలుపులు మూసుకున్న తరువాత స్టూడియో వైపు వెళ్లాడు. పేకప్ చేస్తున్న స్టాఫ్ అంతా వినయంగా నమస్కారాలు చేశారు. డైరెక్టర్ ప్రమోద్ ఎదురొచ్చి విష్ చేశాడు.

"ఏం షూటింగ్ జరిగిందిక్కడ" ?

"చిన్న టూత్‌పేస్ట్ యాడ్ సార్" అన్నాడు ప్రమోద్.

"ఎవరో కొత్త అమ్మాయిలా కనిపించింది. దీన్లో యాక్ట్ చేసిందా ? పేరు ఏమిటి ?" యధాలాపంగా అడిగినట్టు అడిగాడు.

"ప్రీతి అని కొత్తగా వచ్చింది. మనం ఇచ్చిన ప్రకటనకి అప్లికేషన్ పెట్టింది. ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయింది. ఓ రెండు స్టిల్ యాడ్స్‌లో నటించింది".

"ఫొటోజెనిక్ ఫేస్‌లా ఉంది. యాక్షన్ ఎలా ఉంది" ? ఆరా తీశాడు.

"స్టార్ పొటెన్సీ ఉంది సార్. ఫ్రీగా చెప్పింది. ఈజీగా చేసింది. మనం కాంట్రాక్ట్ బేసిస్ మీద బుక్ చేసుకోవచ్చు" ప్రమోద్ అన్నాడు.

"ఓకే లెటజ్ సీ ... ఇంకొక రెండు చెయ్యనీ, ఆలోచిద్దాం" అని బయటికి వెళ్లాడు. అతని కుడిభుజం ... డ్రైవర్ కం అడ్వయిజర్, ఇన్‌ఫార్మర్ లాంటి పాత్రలు పోషించే అన్వర్‌తో లిఫ్ట్‌లో ... "ఆరా తీయి ఆ అమ్మాయి సంగతులన్నీ" అన్నాడు అర్థవంతంగా చూస్తూ.

'జీ సాబ్' ఒక్కమాట నమ్రతగా అన్నాడు. మర్నాడు సాయంత్రానికల్లా ప్రీతి పుట్టుపూర్వోత్తరాలన్నీ రాబట్టేశాడు అన్వర్.

ప్రీతి మధ్యతరగతి అమ్మాయి. చదువు కంటే కూడా, తన అందాన్ని నమ్ముకుని పెద్ద సినీతార, కనీసం టీ.వి. తారయినా అయిపోవాలని ఆరాటపడే అమ్మాయి. దానికోసం రకరకాల ఫోటోలు తీయించుకుని అడ్వర్టయిజింగ్ కంపెనీలకి, సినీ, టీ.వి. ప్రొడ్యూసర్లకి పంపిస్తూ, చెయ్యని ప్రయత్నాలు లేవు. ఎలాగో బి.ఎ. అయితే గట్టెక్కింది. మన కంపెనీకి పంపిన అప్లికేషన్‌కి

ఇంటర్వ్యూకి పిలిస్తే వచ్చి సెలెక్ట్ అయి, చిన్న యాడ్స్ చేసింది. మామూలు మధ్యతరగతి అమ్మాయిల మనస్తత్వం యాడ్ వరల్డ్ గాలానికి చిక్కుకుంటుందన్నది అతనికి బాగా తెలుసు.

మర్నాడు ఆఫీసుకి రాగానే ప్రొడక్షన్ మేనేజర్‌ని పిలిచి చాలా మామూలుగా, షూటింగ్‌కి తయారుగా ఉన్న ప్రోడక్ట్ గురించి ఆరాతీశాడు. ఒక ఫేషియల్ క్రీమ్ యాడ్ షూట్ చెయ్యాల్సి ఉంది అన్నాడతను.

“నిన్న ఎవరో ప్రీతి అన్న అమ్మాయి లిఫ్ట్ దగ్గర కనిపించింది. చాలా ఫొటోజెనిక్‌గా ఉందనిపించింది. ప్రమోద్‌ని వివరాలు అడిగాను. చెప్పాడు. ఫేషియల్ క్రీముకి హీరోయిన్‌ని సెలెక్ట్ చేశారా ?’ ఆరా తీశాడు.

“ఇంకా లేదు సార్. చూస్తున్నాం. ఇద్దరు ముగ్గురు కొత్త ఫేస్‌లున్నారు”.

“అయితే, ఈ అమ్మాయిని ట్రై చేయండి. ఆ అమ్మాయిలో స్పార్క్ ఉంది. స్టార్ పొటెన్సీ కనిపించింది” అన్నాడు చాలా మామూలుగా.

“ఓకే సార్ ! యాజ్ యూ విష్” అని వెళ్లిపోయాడు మేనేజర్.

ఇదేమీ తెలియని ప్రీతి వెంటవెంటనే మరో ఆఫర్ వచ్చినందుకు పొంగి పోయింది. అదంతా తన అందం, నటన వల్లే అనుకుని ఊహాలోకంలో తేలి పోయింది.

ఫేషియల్ క్రీమ్ షూట్ అయ్యాక ఫైనల్ ప్రోడక్ట్ విజువల్స్ చూస్తే వినోద్‌కి తన అంచనా తప్పుకాదని, ప్రీతిని ట్రైన్ చేసే సక్సెస్‌ఫుల్ స్టార్ అవుతుందన్న నమ్మకం కలిగింది. వెంటనే పనికి ఉపక్రమించాడు. ప్రీతిని తన ఆఫీసు రూముకి పిలిపించాడు. ప్రీతి ఈ ఎదురుచూడని ఆహ్వానానికి తబ్బిబ్బు అవుతూ, కాస్త భయం, ఆరాటంతో తడబడుతూ ... లోపలికి వెళ్ళింది. కంపెనీ డైరెక్టర్ నుంచి పిలుపు రావడం అంటే మాటలు కాదు అని అందరూ అంటూండగా వింది. ఇప్పుడు తనకి ఇలా పిలుపు రావడం ...” కమిన్ మిస్ ప్రీతి ! అలా కూర్చోండి. బి కంఫర్టబుల్. నిన్న మీరు నటించిన ఫేషియల్

క్రీమ్ యాడ్ చూశాను. అయామ్ ఇంప్రెస్డ్ విత్ ఇట్'' మొదటి బాణం వదిలాడు వినోద్ జైన్. ఆశ్చర్యంతో, ఆనందంతో తబ్బిబ్బు అవుతూ "థాంక్ యూ సర్ ! ఇట్స్ ఏ గ్రేట్ కాంప్లిమెంట్ ఫర్ మి !'' అంతకంటే ఏం మాట్లాడాలో అర్థం కాలేదు ప్రీతికి.

"మిమ్మల్ని ఆ యాడ్‌లో చూస్తే మంచి ఫొటోజెనిక్ ఫేస్ అని, యాక్టింగ్ టాలెంట్ ఉందన్నది అర్థం అయింది. అంచేత మిమ్మల్ని మా కంపెనీ ఆర్టిస్ట్‌గా కాంట్రాక్ట్ తీసుకుందామని నిర్ణయించాను. ఐ హోప్, మీకు అభ్యంతరం లేకపోతే ... అగ్రిమెంట్ రాసుకుందాం'' రెండో బాణం వదిలాడు.

ప్రీతి నమ్మలేనట్టు చూసింది. కాంట్రాక్టు అంటే ఆమెకి తెలుసు. మొదటి సారి యాడ్‌లో నటించినప్పుడు కొన్ని వివరాలు సేకరించింది. ఈ కంపెనీతో కాంట్రాక్ట్ అంటే ఇంకో కంపెనీ అవకాశాలు వచ్చినా నటించకూడదు. ఇక్కడ వీరు చేసే ప్రకటనలకి అవకాశాన్ని బట్టి, అవసరాన్ని బట్టి ఇచ్చిన పాత్రల్లో నటించాలి. కాంట్రాక్టు అంటే నెలజీతం ప్రకారం పనిచెయ్యాలి అని తెలుసుకుంది. ఇంత పెద్ద పేరున్న కంపెనీలో అవకాశం దొరకడం అదృష్టం. ఇక్కడ పనిచేస్తే పేరుకి పేరూ, నెలకి జీతమూ ... కొన్నాళ్ళు చేశాక కావలిస్తే, పెద్ద అవకాశాలు వస్తే, కాంట్రాక్ట్ అయ్యాక వదిలేసుకోవచ్చు. ప్రీతి ఆలోచనలు ఎక్కడికో వెళ్ళిపోయాయి. ఇప్పుడు గుర్తింపేలేని తనకు ఇది పెద్ద అదృష్టం.

మొహం సంతోషంగా వెలిగిపోతుండగా, "థాంక్స్ సార్ మెనీ థాంక్స్ సార్. మీ కంపెనీలో పనిచేయడం నా అదృష్టం ...'' గబగబ అంది. వినోద్‌కి అర్థమైంది ఆమె ఆరాటం. తను కూడా మరీ తొందరపడకూడదు. అంతా ప్రొసీజర్ ప్రకారమే జరుగుతోందని అందరూ అనుకోవాలి.

"దెన్ ఓకే ! మేమిచ్చిన ఫారాలు చదువుకుని సంతకం పెట్టండి. లీగల్ వివరాలు మా ప్రొడక్షన్ మేనేజర్ వివరిస్తారు ...'' అంటూ ప్రొడక్షన్ మేనేజర్ సుధాకర్ వంక చూశాడు.

"ఓకే సార్" అని "ప్లీజ్ రండి ... నా ఆఫీసులో సంతకాలు పెడుదురుగాని" అని సుధాకర్ దారితీశాడు.

వినోద్ వెనక్కి వాలాడు కుర్చీలో విలాసంగా. వినోద్‌కి పేరుకి తగ్గట్టు వినోదం కావాలి. విలాసం కావాలి. కొత్త అందాలు కావాలి. జీవితం అంటే విలాసంగా, ఆనందంగా అనుభవించాలనే తత్వం. చాలా తొందరగా అందానికి ఆకర్షితుడవడమే కాదు, ఆ అందం సొంతం అయ్యేవరకు అలజడి, పొందాలనుకున్న దానికోసం ఎవరేమనుకున్నా లెక్కచెయ్యని మనస్తత్వం. చేతినిండా డబ్బు, ఇంటినిండా డబ్బు, ఆఫీసునిండా అమ్మాయిలు ... ఇంకేం కావాలి. వేటికీ వెతుక్కోనక్కరలేదు. వలకి ఎరగా కళ్ళకి కనిపిస్తూ ఊరించే భవిష్యత్తు చూపించే ఫ్యాషన్ వరల్డ్, కష్టపడకుండా అమ్మాయిలను వలలో పడేసుకునే అందం, డబ్బు, యవ్వనం, మాట చాతుర్యం, అన్నీ ఉన్న వినోద్‌కి కొత్త అందాలు, అమ్మాయిలు వినోదం !

ఇన్నీ ఉన్న వినోద్‌కి ఇంట్లో మిగతావన్నీ మెండుగా ఉన్నా అందమైన ఆ అనుభవం మాత్రం అనుభవంలోకి రాలేదు. భార్య అందంగా ఉంటే ప్రేయసిని చూడగలిగేవాడేమో ! వ్యాపారం దివాలా తీసి తిరిగి నిలదొక్కుకోడానికి తండ్రి అవస్థలు పడుతున్న తరుణంలో ... కళ్ళెదుట కనిపించిన దారి భారీ పెళ్ళి కూతురితో పాటు వచ్చే భారీకట్నం, కోట్లిస్తామన్నా కూతురి చేయి అందుకోడానికి ముందుకు రాని వాళ్ల సంఖ్య పెరిగిపోతున్నకొద్దీ, కోట్ల ఆస్తి ఉన్న తండ్రి రేటు పెంచుతూ పెంచుతూ పోయాడు. చూస్తూ చూస్తూ మరీ లేనింట్లో పిల్లని పడేయలేక, దారీ తెన్నూ తోచక సతమతమవుతున్న కన్న తండ్రికి, వ్యాపారం దెబ్బతిని తేరుకోవ డానికి మార్గాలు అన్వేషిస్తున్న జైన్ కుటుంబం కనిపించింది. మధ్యవర్తి ద్వారా కోట్ల ఆస్తి ఎరగా చూపాడు. అంతస్తులు, ఆస్తిపాస్తులు అన్నీ సరితూగేవైనా చూస్తూ చూస్తూ అందంగా, స్మార్ట్‌గా చదువుకున్న వినోద్‌కి జోడు కుదరని ఆ అమ్మాయిని కట్టబెట్టలేక మథనపడుతుంటే ... 'డాడీ, మనం ఈ గండంలోంచి గట్టెక్కే మార్గం ఇదొక్కటే. అందంగా లేకపోయినా ఫరవాలేదు,

డబ్బు లేకపోతే ఎలా బతుకుతాం ? అందులో ముందునుంచీ దర్జాగా బతికినవాళ్లం. దరిద్రాన్ని ఎలా కావలించుకుంటాం' ? బతకనేర్చిన వినోద్ తండ్రికి ధైర్యం చెప్పి సలహా ఇచ్చాడు. అప్పటికింకా విశాల్ చదువు పూర్తవలేదు. కూతురి పెళ్ళి చేయాలి. ఇల్లు తాకట్టులో ఉంది. ఈ సమస్యలన్నీ కళ్ళముందు కదలాడుతుంటే ... మరో మార్గం లేక తలొగ్గాడు అవినాష్ జైన్.

కొత్త కోడలితో వచ్చిన కోట్ల ఆస్తితో అప్పులు తీర్చి, వ్యాపారంలో నిలదొక్కుకుని ఊపిరి పీల్చుకున్నారు అందరూ. అందం లేకపోయినా ఒంటి నిండా అహంకారం ఉంది సుస్మితా అగర్వాల్‌కి. కోట్ల ఆస్తికి వారసురాలు. మొగుడయితేనేం, అత్తవారయితేనేం తల ఒగ్గాల్సిన ఖర్మ తనకేం ఉంది. తన వల్ల కంపెనీకి పునర్జీవితం వచ్చింది. తన డబ్బుతో తినేవారు తనకు ఎదురు చెప్పే సాహసం చెయ్యకూడదు అన్న మనస్తత్వం. అత్తవారింట అడుగుపెడుతూనే కంపెనీలో పెద్ద షేర్ సొంతం చేసుకుంది. ఇల్లంతా తనిష్టం వచ్చినట్టు మార్పులు చేర్పులు చేసేసింది. అత్త, మామ, మొగుడు ప్రేక్షకపాత్ర పోషించారు. ధనరాశితో వచ్చిన భార్యని ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో ఏడాది గడిచిపోయింది. నోరెత్తకుండా కాపురం చేసి వంశోద్ధారకుణ్ణి కన్నాడు. ఇంట్లో కోడలి పెత్తనానికి అలవాటుపడి మామగారు ఆఫీసుకి, అత్తగారు పూజగదికి అంకితమయ్యారు. కూతురి పెళ్ళి చేసి పంపి నిశ్చింతగా నిట్టూర్చారు. తండ్రి మీద గౌరవంతో ఛైర్మన్ పోస్టులో కూర్చోపెట్టాడు వినోద్. ఎం.బి.ఎ. పూర్తిచేసి వచ్చిన తమ్ముడికి తనతోపాటు మేనేజింగ్ డైరెక్టర్ పదవి ఇచ్చి, ఆ ఇంటి కొడుకుగా కర్తవ్యం నెరవేర్చాడు. ఆరేళ్ల కొడుకు ముద్దుమురిపాలు చూసి మురిసిపోతూ, కొడుకు మంకుపట్టుకి తల ఒగ్గి ప్రేమంతా కుమ్మరిస్తూ, కొడుకు పెంపకంలో తలమునక లవుతూ కాస్తంత అహం, అహంకారం తగ్గింది ఇల్లాలి పాత్ర నుంచి తల్లి పాత్రలోకి మారేసరికి సుస్మిత మనసు కాస్తంత సున్నితం అయి, ఇంట్లో అత్తమామల్ని, తనకు ఎదురుచెప్పని భర్తని గౌరవంగానే చూడడం ఆరంభించింది. దానికి తోడు

కంపెనీ ఎనిమిదేళ్లలో బాగా పుంజుకుని లాభాలబాట పట్టడంతో, అందులో మామగారు, మరిది పాత్ర చాలా ఉండడం, తను మరీ అతిశయం చూపిస్తే సహించని స్థాయికి వారి సంపాదన పెరగడంతో సుస్మిత ఇంట్లో పవరు, ఒంట్లో పవరు తగ్గించుకుంది.

వినోద్ పెళ్ళయితే చేసుకున్నాడుకాని, నిజం చెప్పాలంటే ఒక్కరోజు కూడా సుఖంగా లేడు. అడుగడుగునా అహంకారం చూపే భార్య అందమైనా చూసి సర్దుకుపోదామన్నా, అదీ ఊరించే ఊహల్లో తప్ప నిజజీవితంలో దొరక్క, నిర్లిప్తత నిండిన కాపురంలో రోజులు నెట్టుకొచ్చాడు కొన్నాళ్లు. ఒకటే ఓదార్పు ... కొడుకు పుట్టడం. తల్లిదండ్రులకి మనవణ్ణి ఇచ్చానన్న తృప్తి. భార్య దృష్టి తనమీద నుంచి కొడుకుపైకి మళ్లడంతో ఊపిరి పీల్చుకుని కేవలం నాలుగేళ్ళు కంపెనీని నిలబెట్టే ప్రయత్నంలో రాత్రింబగళ్లు మునిగిపోయి తనలోని నిరాశ, నిస్పృహని మరిచి పోయాడు.

కంపెనీ వ్యవహారాలు కుదుటపడి, తండ్రి, తమ్ముడు తోడయి బరువు బాధ్యతలు కాస్త తగ్గి ... చుట్టూచూడడం ఆరంభించాడు. ప్రకటనల ప్రపంచంలో, ఫ్యాషన్ వరల్డ్‌లో అందమైన అమ్మాయిలను చూసినప్పుడల్లా చలించేవాడు. భార్య గుర్తువచ్చి తనకు దొరకని అందమైన అనుభూతికోసం మనసు ఉవ్విళ్లూరేది. కానీ, ఆ అందాలు ఎలా అందుకోవాలో తెలిసేది కాదు. పిరికితనం ఒక కారణమైతే, ఎవరికైనా తెలుస్తుందేమో, పరువు ప్రతిష్ఠ అన్నీ గుర్తువచ్చేవి. ఎంతోమంది అమ్మాయిలు కెమెరా ముందు నటించడానికి, చిన్న ప్రకటనలోనైనా కనపడాలని ఉవ్విళ్ళూరుతూ, ఆఫీసు చుట్టూ తిరిగేవారు ఫోటోలు చేతపట్టుకుని. వినోద్‌ది విజువల్స్ సెక్షన్ కనుక యాడ్ షూటింగులు, నటీనటులు, డైరెక్టర్లు, పూర్తయిన యాడ్‌లు చూసి ఓకే చెయ్యడం అంతా అతని పర్యవేక్షణలో ఉండడంతో, రోజూ ఎంతోమంది అమ్మాయిలు అతని దృష్టిలో పడి అతన్ని నిద్రకి దూరం చేసేవారు. ఆ అందం అందుకోవాలన్న తపన, ఆరాటం రోజురోజుకి పెరిగింది.

ఆ సమయంలో అన్వర్ అతనికి పర్సనల్ డ్రైవర్ కమ్ అటెండెంట్‌గా వినోద్‌కి ఎప్పుడేం కావాలో చూసుకుంటూ అతనిని అంటిపెట్టుకునే మనిషి అయ్యాడు. అన్వర్ బతకనేర్చినవాడు. అయ్యగారి సంగతి, ఇంటి సంగతి క్షుణ్ణంగా అర్థం చేసుకోవడానికి అట్టే సమయం తీసుకోలేదు. అమ్మాయిలని చూడగానే అయ్యగారి ఆకలిచూపులు అర్థం చేసుకున్నాడు. అయ్యగారి మనసు దగ్గరవడానికి, అతని ప్రాపకం సంపాదించడానికి దగ్గర దారి దొరికిపోయింది. వినోద్ మంచితనం, ఇంట్లో అతని భార్య ధోరణి చూశాక అన్వర్‌కి అయ్యగారి మీద ఎనలేని జాలి, అభిమానం పొంగింది. వినోద్ పిరికితనం అర్థం అయింది. కాస్తంత చొరవ తీసుకోలేని అతనికి సహాయపడాలనుకున్నాడు. కానీ, ఎలా అన్నది అతనికి అర్థం కాలేదు ముందు.

ఒకరోజు శిల్ప అనే అమ్మాయి స్క్రీన్ టెస్ట్‌కి వచ్చి సెలెక్ట్ కాలేదు. నిరాశ, నిస్పృహ, ఏడుపు ఒక్కటే తరువాయి అన్నట్టు మొహం నల్లబడి కంటతడితో నిస్సహాయంగా చూస్తూ లిఫ్ట్‌లో ఎక్కిన శిల్పని చూశాడు. అతనికి ఆ అమ్మాయిని చూస్తే సంగతి తెలిసిపోయింది. అప్పటికి ఏణ్ణర్థం అయిందేమో కంపెనీలో చేరి. ఇలా ఎంతో ఆశతో వచ్చి రిజెక్ట్ అయిన అమ్మాయిలు నిరాశ తట్టుకోలేక కళ్లనీళ్లతో వెళ్లడం చూశాడు అన్వర్. అందులో కాస్త లేనింటి అమ్మాయిలు, అందాన్ని నమ్ముకుని వచ్చినవాళ్లు ఆశాభంగం అస్సలు తట్టుకోలేరు. ఈ అమ్మాయి బాగానే ఉంది. పెద్ద కళ్ళు, మంచి ఫిగరు. రంగు చామనచాయ అయినా స్మార్ట్‌గానే ఉంది. మరి ఏమయిందో అనిపించింది అన్వర్‌కి. "ఏమిటి సెలెక్ట్ కాలేదా" ? చనువుగా అడిగాడు. ఆ అమ్మాయి అన్వర్ వంక ఓ చూపు చూసి లేదన్నట్టు తల ఊపింది.

"అరే, అదేమిటి ఇంత చక్కగా ఉన్నావు. ఎవరా రిజక్ట్ చేసింది సుధాకర్ సారా ... ఆయనో తిక్కలోడు ..." అంటూ ఏదో ఆలోచన తట్టినట్లు ... "మా సార్ చూసుంటే రిజెక్ట్ చేసేవారు కాదు" అన్నాడు. ఆ అమ్మాయి కళ్ళలో ఆశ.

"మీ సారా ? ఎవరు ... ?" అంది కాస్త ఆశ్చర్యపడ్తూ.

"మా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ వినోద్ సార్ ఆయనే కదా, ఈ సెక్షన్‌కు బాస్".

శిల్ప కళ్ళల్లో మెరుపు ... "ఆయన చూస్తారా మాలాంటి వాళ్లని".

"ఇదిగో నీ పేరేమిటి ... శిల్ప. సరే, నీ ఫొటోలు, నీ బయోడేటా అవి ఉన్నాయి గదా, అవి నాకియ్యి. నీ ఫోన్ నెంబరుందా, నేనివాళ మా అయ్యగారికి చూపిస్తా. రేపు ఇదే టైముకి రా ... సరేనంటే మిగతావి చూద్దాం. లేదంటే నీ ఫైలు తీసుకెళ్లచ్చు" ఆ మాత్రం దానికే శిల్ప సంబరపడిపోతూ "నిజంగా నువ్వు చెపుతావా? నీ మాట వింటారా" ?

"వినోద్ సార్ పర్సనల్ అసిస్టెంట్ కమ్ డ్రైవరు అన్నీ నేనే. చెప్పిచూస్తా. నీ అదృష్టం పరీక్షించుకో ..." అని ఆశ చూపాడు.

"థాంక్స్ అన్నా ! నాకీ ఉద్యోగం ఎంతో అవసరం. నాన్న లేరు. అమ్మ ఒక్కర్తే. చిన్న జాబ్ చేస్తుంది. నాకీసాయం చేస్తే నీ మేలు మర్చిపోను" దండం పెడుతూ అంది.

"చూస్తానన్నాగా ... హోప్ ఉంటే ఫోన్ చేస్తా. లేదంటే వచ్చి నీ ఫైలు తీసుకెళ్లు" అని ఆమె అందించిన ఫైలు తీసుకున్నాడు. అన్వర్ దగ్గరనుంచి ఫోన్ రాగానే ఆఘమేఘాల మీద వచ్చినట్టు వాలిపోయింది శిల్ప. "ఏమన్నారు ? నన్ను సెలెక్ట్ చేసుకుంటారా ? నాకు ఛాన్సు ఇస్తారా ?" అంది ఆరాటపడిపోతూ. "అన్నా, ఎలాగైనా పని జరిగేట్టు చూడు".

"చూడు శిల్పా ... నా ప్రయత్నం నేను చేశాను. ఇంక చెయ్యాల్సింది నువ్వే. సార్‌ని ఎలా మెప్పిస్తావో నీ చేతుల్లో ఉంటుంది".

"అంటే నేనేం చెయ్యాలో చెప్పు ... అలా చేస్తాను".

"సార్‌ని మెప్పించు. నీకు మంచి భవిష్యత్తు కావాలంటే, గుర్తింపు ఉండాలంటే సార్ చేతుల్లో ఉంటుంది. ఆయన ఇష్టమే ఫైనల్".

సగమే అర్థమైన శిల్ప తల ఆడించింది.

సార్‌ని మెప్పించడమంటే ఏమిటో తెలియకుండానే, ఆమె ప్రమేయం లేకుండానే, కాదు లేదు అని చెప్పే వీలు లేకుండానే అన్ని ఏర్పాట్లు చేసేశాడు అన్వర్. ఓ పక్క బెరుకు, భయం, లేదంటే ఉద్యోగం రాదు. వద్దంటే పొమ్మంటారేమో ... ఆమె ఏదీ నిర్ణయించుకోలేని స్థితిలో ఉండగానే సార్‌ని మెప్పించేసింది. అటు వినోద్‌కి ఆశ, కోరిక, ఉద్రేకం, అన్నీ ఉన్నా మొదటి మెట్టు ఎక్కడమే కష్టమయింది. ఓసారి ధైర్యం చేసి కాలుపెట్టాక, ఎలా ఎక్కాలో, ఎక్కి తనకు కావాల్సింది ఎలా పొందాలో, ఏం చేస్తే అమ్మాయిలు లొంగుతారో ... అన్ని కిటుకులు, పాఠాలు అతి త్వరలోనే వంటబట్టించుకుని, ఆ రంగంలో ప్రావీణ్యం సంపాదించడానికి అన్వర్ ఇచ్చిన ప్రోత్సాహం, చేసిన సాయంతో అతని కుడిభుజం స్థాయికి ఎదిగిపోయాడు అన్వర్. ఇల్లు, సంసారం, సమాజంలో పరువు, ప్రతిష్ఠ ఏదీ భంగపడకుండా తనకు కావల్సింది ఎలా అందిపుచ్చుకోవాలో, తన తృష్ణని ఎలా తీర్చుకోవాలో నేర్చేసుకున్నాక బెరుకు, భయం పోయాయి. అంతే ... అతిసహజం అన్నట్టుగా, ఇంట్లో వంట బాగులేకపోతే, చక్కగా రుచిగా వండలేని అసమర్థ భార్యతో గొడవ పడేకంటే, కావల్సింది అప్పుడప్పుడు హోటలుకెళ్లి ఇష్టంగా తినిరావడంలో తప్పేమిటి అన్నంత సహజమైంది ఆ అలవాటు. దానికి తోడు అమ్మాయిలందరూ అందుబాటులో ఉండే ఆఫీసు అవడం మరింత వెసులుబాటు ఇచ్చింది. బాగుందనుకున్న అమ్మాయిని ఎరవేసి పట్టడం అన్వర్ వంతు. ఏర్పాట్లు అన్వర్‌వి. అనుభవం వినోద్‌ది. ఇష్టపడని వాళ్లని బలవంతం ఏముంది అప్లికేషన్ రిజెక్ట్. భవిష్యత్తుని అందంగా ఊహించుకునే అమ్మాయిలు, ఇష్టపడో, దారిలేకో, ఏం పోయింది, ఎవరికి తెలుస్తుంది అని ధైర్యసాహసాలు ఉన్నవారినే ఎంచేవాడు అన్వర్. ఏడాది తిరిగేసరికి వినోద్ ఆ రంగంలో ఆరితేరాడు. ఆఫీసులో కాస్త గుసగుసలు మొదలయ్యాయి. బాస్ గారి లీలలు కొందరు అమ్మాయిలలో ఆశ నింపితే, మరి కొందరు బెరుకుగా తప్పుకుంటూ వెళ్లేవారు. ఆ గుసగుసలు అవినాష్ జైన్ దగ్గరికి చేరాయి. మొదట ఆయనలో కొడుకు చేస్తున్న పని రేపు ఏం

కొంపముంచుతుందో, ఏ అమ్మాయన్నా ఈ గుట్టు రట్టు చేస్తే కంపెనీ పరువు, ఇంటి ప్రతిష్ఠ దెబ్బతింటుందన్న భయం కలిగించాయి. కొడుకుతో మాట్లాడి గట్టిగా వార్నింగ్ ఇవ్వాలని నిర్ణయానికి వచ్చినా, ఓ పక్క వినోద్‌ని చూస్తే ఆయనకి బాధగానే ఉండేది. పాపం జీవితంలో వాడు ఏం సుఖపడ్డాడు ? ఈ కుటుంబం కోసం, కంపెనీ కోసం వాడి భవిష్యత్తు తాకట్టు పెట్టాడు. డబ్బుకోసం తన ఆనందాన్ని బలిపెట్టాడు. ఒక్కరోజైనా భార్యతో ఏం సుఖపడ్డాడు ? భార్య భర్తగా ఏం గౌరవం ఇచ్చి వాణ్ణి సుఖపెట్టింది, అన్న బాధ ఉంది ఆయనలో. భార్యతో ఎన్నోసార్లు తన మనసులో బాధ చెప్పేవాడు. 'అవునండి, వెర్రినాన్న ... పాపం అందరికోసం వాడు బలయ్యాడు. అందం లేకపోయినా, అణుకువ అన్నా ఉంటే సుఖపడేవాడు'. తల్లిదండ్రులిద్దరూ కొడుకుని చూసి బాధపడడం మినహా ఏం చెయ్యలేకపోయారు. ఇప్పుడు వాడికి కావల్సిన ఆనందాన్ని, కోల్పోయిన సుఖాన్ని అనుభవించనీ అనుకుంది ఆయన తండ్రి మనసు. కొడుకు బదులు అన్వర్‌ని పిలిచి హెచ్చరించాడు. 'ఈ విషయం బయటపడితే నిన్ను పాతరేస్తా. జాగ్రత్తగా హ్యాండిల్ చెయ్యి' అన్నాడు. అన్వర్ అర్థమైనట్టు వినయంగా తల ఆడించాడు.

వినోద్ జీవితంలో ప్రీతి తారసపడేవరకు, అతని రిలేషన్‌షిప్‌లన్నీ ఒక రాత్రి, ఒక వారం, మహా అయితే ఒక నెల తప్ప అతన్ని కట్టిపడేసే, సమ్మోహపరిచే బంధం తటస్థపడలేదు.

మిగతా ఆడపిల్లలకి, ప్రీతికి చాలా తేడా కనిపించింది వినోద్‌కి. అంద చందాలను మించి ఆమెలోని ఆకర్షణ, ఆమెలోని జాణతనం, సోఫిస్టికేషన్, మాటల్లో హాస్యచతురత, తెలివిగా కౌంటర్ ఇవ్వడం, అతన్ని ఊపిరి సలపని అనురాగంలో ముంచెత్తి ... తను వెతికింది ఇలాంటి తోడుకోసం, ఇలాంటి పొందుకోసం అనుకొని అల్లాడాడు. భావుకత, సౌందర్యం, నిజమైన ప్రేమను ఆమె దగ్గర పొందాడు.

తల్లిలా ఆదరించి ఆకలి కనిపెట్టి, ఇల్లాలిగా అనురాగం, దాసిలా సేవ,

మంత్రిగా సలహా, ఒక స్త్రీలో పురుషుడు కోరుకునేవన్నీ ప్రీతిలో కనిపించాయి. ఇద్దరి భావాలు, వేవ్‌లెన్త్ కలిసి ఎన్నెన్నో విషయాలు మాట్లాడుకుని, చర్చించగల తెలివి ఆమెలో చూసి, ఆమెలో అన్ని గుణాలకి సరెండర్ అయిపోయి, 'తను కోరుకున్న స్త్రీ దొరికింది' అని తృప్తిగా ఇంకో అమ్మాయి వైపు కన్నెత్తి చూడని అనుబంధం ఇద్దరి మధ్య ఏర్పడింది. తోటి అమ్మాయిలతో కలిసి ఉండే ప్రీతిని ఎప్పుడుబడితే అప్పుడు కలిసే వీలులేక, తమ ఇద్దరికి ప్రైవసీ కోసం, తమ రాకపోకలు ఎవరికంటా పడకుండా ఉండడం ప్రీతిని తన తాహతుకు సరిపోయే అపార్ట్‌మెంట్ అద్దెకి తీసుకుని షిఫ్ట్ చేశాడు. ఇద్దరూ ప్రణయ సామ్రాజ్యాన్ని ఏలుతూ, పరిసరాలనే మరిచిపోయారు. ప్రీతిని యాడ్ వరల్డ్‌లో స్టార్‌ని చేయడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేసి, పేరు, డబ్బు సంపాదించుకుని తనకో గుర్తింపు తెచ్చుకునేట్టు చూశాడు. ప్రీతితో తన సంబంధంఎంత గుట్టుగా ఉంచినా, ఇలాంటివి ఎక్కువ రోజులు దాచలేరు అన్నది నిజమైంది. ప్రీతి వేషభాషలు, రిచ్‌నెస్, వేరే అపార్ట్ మెంట్ తీసుకోవడం, ఇవన్నీ మిగతా అమ్మాయిల దృష్టి నుంచి తప్పించలేక పోయాడు. వినోద్, ప్రీతి బాడీ లాంగ్వేజ్, ఒకరిని చూసి ఒకరి మొహంలో, కళ్ళలో కనపడే ప్రేమోన్మాదం అందరికీ అర్థమవసాగింది. కొడుకులో మార్పు అర్థమై అన్వర్‌ని పిలిచి విషయం ఆరా తీశాడు అవినాష్. తర్వాత కొడుకుని పిలిచి శ్రేయోభిలాషిగా, తండ్రిగా ఇలాంటి రిలేషన్‌షిప్‌లు ఎలాంటి అనర్థాలకి దారితీస్తాయో చెప్పి హెచ్చరించాడు. "నీవిన్నాళ్ళు ఏం చేసినా, తెల్సినా నిన్ను ఏమనలేదు. జీవితంలో అనుభవానికి రానిది కొన్నాళ్ళు అనుభవించనీ అనుకున్నాను. అప్పుడప్పుడు అటాచ్‌మెంట్‌లు లేని అనుభవాలు ఫరవాలేదు. కానీ రేపు నీ భార్యకి తెలిస్తే చాలా చిక్కులు వస్తాయి. తెలిసి ఏ భార్యా సహించదు. ఆఫీసులో నీ గౌరవం, మర్యాద, కుటుంబ పరువు అన్నీ ఆలోచించు" నచ్చచెబుతూ అన్నాడు. అన్నీ మౌనంగా విన్నాడు వినోద్, తలవంచుకుని. తరువాత తలెత్తి తండ్రికి రెండు చేతులతో దండం పెట్టాడు. "డాడీ, ప్లీజ్! ఇన్నాళ్లకి నాకు దొరికిన ఈ ఆనందం, తృప్తిని

వదలలేను. కొన్నాళ్లయినా నన్ను సంతోషంగా బతకనీయండి. నా జాగ్రత్తలో నేనుంటాను'' అన్నాడు. కొడుకు వంక చూసి, ఆయన ఇంకేం అనలేక మౌనం వహించాడు.

ఒక ఆరునెలలు ప్రీతి సాంగత్యంలో సర్వం మరిచి ఓలలాడాడు. ప్రీతికి ఎన్నో ప్రకటనల ఆఫర్లు, యాడ్‌ఫిలిమ్స్, చిన్న చిన్న షార్ట్‌ఫిలిం ప్రకటనలతో తీరిక లేకుండా పోయింది. చేతినిండా డబ్బు, ఇంటినిండా సామాను, రకరకాల డ్రెస్సులు, ఫ్యాషన్‌షోలు... తన సమర్థత మీద తనకి విపరీతమైన నమ్మకం, మితిమీరిన ఆత్మవిశ్వాసంతో ప్రీతిలో అహంకారం పాలు ఎక్కువయింది. వినోద్ తనవాడు, తనని వదిలిపోయే ప్రసక్తిలేదన్న నమ్మకంతో వినోద్‌ని సొంతం చేసుకో వాలన్న ఆలోచన మొదలైంది. ఈ యాడ్ వరల్డ్, ఫ్యాషన్ వరల్డ్‌లో ఈనాటి ఆకర్షణ, అందం, ఎన్నాళ్లో అందరినీ ఆకర్షించలేదు. కొత్త మొహాల కోసం వెతుకులాట, పాతవారిని చిత్తుకాగితంలా బుట్టలో పడేస్తారన్న నిజాలు చుట్టూ చూసి తెలుసుకుంది. తన భవిష్యత్తు సురక్షితంగా ఉండాలంటే వినోద్ అండ వదులుకోకూడదు. అతను తనకు సొంతం అవడానికి ఏం చెయ్యాలో దారులు వెతికింది. తనకోసం అద్దెకి తీసుకున్న అపార్ట్‌మెంట్ కొనిపించింది. డబ్బు ఖర్చు పెట్టి ఆ మాత్రం చేయడం వినోద్‌కి సమస్య కాదు. కానీ ఈమధ్య తరచు ప్రీతి తనను ఇబ్బంది పెట్టే కోరికలు కోరుతోంది. అతి ప్రేమతో అల్లుకుపోతూ "వినోద్, నువ్వు శాశ్వతంగా నావాడివి కావాలి. నాకెందుకో నువ్వు నన్ను వదిలి పోతావన్న భయం వేస్తోంది డియర్. ఇలా ఎన్నాళ్లు ఈ బంధం నిలుపుకోగలం. ఈ దొంగచాటు బతుకు ఎన్నాళ్లు ? వినోద్ నన్ను పెళ్ళిచేసుకో. అప్పుడే నాకు నిశ్చింత. ఈ బెంగతో రాత్రిళ్ళు నిద్ర కూడా పట్టడం లేదు. నీవెప్పుడు వస్తావోనని ఎదురు చూపులు, రాని రోజున ఆ నిరాశ తట్టుకోలేక ఏడుపు వస్తుంది. ఆ వియోగం తట్టుకోలేకపోతున్నాను ...'' గుండెలమీద తలపెట్టి కన్నీరు పెట్టుకుంది.

"ప్రీతి డార్లింగ్ ! ఏ రోజన్నా ఏదో టైమ్‌లో రాకుండా ఉంటున్నానా ?

నీకెందుకు అలాంటి అనుమానాలు. డియర్ నీకంటే నాకే నీ అవసరం ఎక్కువ. నిన్ను వదిలి ఉంటున్న క్షణాలన్నీ యుగంలా అనిపిస్తాయి. ఆఫీసులో ఉన్నంతసేపే నేను ప్రశాంతంగా ఉంటాను. ఇంటికెళ్లిన ప్రతిక్షణం నీవు లేని లోటుతో సతమత మవుతున్నా. ఏం చెయ్యగలను ... కొన్ని మన చేతుల్లో ఉండవు. ఉన్నదాంతో సర్దుబాటు చేసుకో. ఉన్నంతలోనే ఆనందాన్ని అనుభవించడం ...'' సర్ది చెప్పేవాడు.

"అవును, ఆనందాన్ని అనుభవించడానికి నేను కావాలి కాని సమాజంలో, నీ ఇంట్లో స్థానం ఇవ్వవు. పబ్లిక్‌గా నేను నీదాన్నని గర్వంగా చెప్పుకోలేను. దొంగచాటు బతుకు ఎన్నాళ్ళు వినోద్. నాకు ప్రియుడే భర్త అనుకుంటూ ఎన్నాళ్లు? ఇల్లు, పిల్లలు, సంసారం కావాలనిపించదా'' ? అలిగేది. బతిమాలుతూ, విచలితురాలై కంటనీరు పెట్టుకునేది. మొదట్లో వినోద్ ప్రీతి బాధగా అంటుంటే నిస్సహాయంగా, "నేనేం చెయ్యను డార్లింగ్ ... నీలు తెల్సు నేను పెళ్ళయినవాడిని. తండ్రిని. తల్లిదండ్రుల మధ్య బతుకుతున్నవాడిని. సంఘంలో పరువు ప్రతిష్ఠ, మిగతావి అన్నీ ఉంటే ఉండనీ లేకపోతే పోనీ అనుకోగలిగినా, భార్య ఊరు కుంటుందా ... భర్త మళ్ళీ పెళ్ళి చేసుకోడానికి ...'' అని చాలా దిగులుగా అనేవాడు.

"ఏం ఆ పెళ్ళాం లేకపోతే బతకలేవా ? డివోర్స్ ఇవ్వు. ఎలాగూ ఆమెతో ఏ సంతోషం లేదని నువ్వే చెప్పావు. అలాంటి భార్యని పట్టుకుని వేలాడాలా ? ఆమెకి కావల్సిన ఇల్లు, డబ్బు ఇచ్చేయి. విడాకులు తీసుకో ...''

"హు, నీకు తెలీదు. నేనిచ్చే ఇల్లు, డబ్బు తనకెందుకు. తనకే ఉంది నన్ను కొనగలిగే డబ్బు. నిజం చెప్పాలంటే డబ్బుతోనే నన్ను కొనుక్కుంది. ఈ కంపెనీ అంతా తన భిక్ష. అలాంటి భార్యని కాదని నేనెలా అనగలను ...'' చాలాసార్లు ఈ విషయం ప్రీతికి నచ్చచెప్పేవాడు. తన అసహాయత వెల్లడించేవాడు. కాని ఉన్నంతసేపు ప్రీతి, కట్టుకున్న భార్యకంటే ఎక్కువగా డిమాండ్లు, అలకలు, కోపాలు, విసుగులు ప్రదర్శిస్తూ అతన్ని విసిగించడం

ఆరంభించింది. ఇంట్లో భార్యతో సుఖం, హాయి దొరక్క వచ్చే వినోద్‌కి, రోజులు గడుస్తున్నకొద్దీ ఆ కొత్తమోజు, ఆ ప్రేమ, ఆ స్వర్గసుఖాలు అన్నీ పాతబడి ప్రీతి దగ్గరికి వచ్చిన క్షణాలు ఆనందం కంటే ఇబ్బంది కలిగించడం ఆరంభించాయి. ఇటు ప్రీతి సాంగత్యం వదులుకోలేక, అటు ఆమె డిమాండ్లని తట్టుకోలేక నలిగిపోయాడు. దాంతో రాకపోకలు తగ్గించడం మొదలుపెట్టాడు. అది ప్రీతిని మరింత ఆగ్రహానికి గురిచేసింది. వచ్చినరోజున మనసారా ఆహ్వానించకుండా నీకు ఆడదాని సుఖం కావల్సిన రోజు వస్తావా, వెళ్ళు. ఇంట్లో భార్య ఉందిగా మరి నేనెందుకు, అంటూ ఎడమొహం పెడమొహం పెట్టి దెప్పేది. ఒకరోజు బతిమిలాడుతూ, మరోసారి ప్రాణం విసిగి, 'సరే, పోతాను. నీకు నా మీద ప్రేమ పోతే ఇంక రానేరాను' అని అతను ఎగిరేవాడు. అప్పుడు 'కాస్త తగ్గాలి. నిజంగా రాకపోతే, అతన్ని వదులుకుంటే నష్టం ఎవరికి ...' అనుకుంటూ మళ్లీ కళ్ళనీళ్లు పెట్టుకుంటూ కౌగిలిలోకి ఒదిగిపోయేది. వినోద్‌ని తనవాడిగా చేసుకునే ఆలోచనల్లో ఒక అద్భుతమైన ఆలోచన అనుకుని ఆచరణలో పెట్టింది. నెలరోజుల తర్వాత వినోద్ రాగానే సంతోషంతో ఎదురెళ్లి కౌగిలించుకుని, "వినోద్ ... నీకివాళ ఎంత శుభవార్త చెప్పబోతున్నానో ఊహించు. ఊహించలేవు. చెప్పాక నాకేం బహుమతిస్తావో ఊహించలేకపోతున్నాను'' అంటూ ఊరించి, బతిమాలించుకుని ... ఆఖరికి సిగ్గు, ఆనందం ఒలకబోస్తూ "వినోద్ మన మధ్య మనకో బిడ్డ ... నీ బిడ్డ ... నా కడుపున ... ఓహో నీ రూపం నాలో ... నాకు ఏం చెయ్యాలో తెలియనంత సంతోషం ...''

వినోద్ కౌగిలి సడలిపోయింది. చటుక్కున ప్రీతిని వదిలేశాడు. అతని మొహం పాలిపోయింది. ఆ తరువాత నల్లబడింది. మరుక్షణంలో ఎర్రబడింది. కలవరంగా, కంగారుగా "ఏమంటున్నావు నువ్వు'' ? తడబడుతూ అడిగాడు.

"వినోద్ ... మనిద్దరి ప్రేమసాక్షి ... మనబిడ్డ ...''

"ప్రీతి ...'' అరిచాడు. "మతిపోయిందా నీకు. మనకు పిల్లలేమిటి ? ఎలా కుదురుతుంది ? నలుగురికి ఏం చెబుతావు ? మనం భార్యాభర్తలం

కాదు. లోకాన్ని ఏ మొహంతో ఎదుర్కొంటాం ? అసలు నీకు ముందే చెప్పానా లేదా మనిద్దరం చాలా జాగ్రత్తపడాలి ఈవిషయంలో అని. నా భార్యకిది తెలిస్తే చంపి పాతర వేస్తుంది. ఇంట్లో వాళ్లకి ఏం చెప్పాలి. నీకంటే పెళ్ళికాలేదు. నిన్ను నిలదీసేవారు లేరు. నా పరిస్థితి నీకు తెలుసు. అయినా ఇలా ఎందుకు చేశావు? ఆవేశంగా, ప్రీతి భుజాలు పట్టుకు ఊపేస్తూ అరిచాడు.

ప్రీతి నిర్లక్ష్యంగా అతనివైపు ఓ చూపు విసిరి, ''ఇద్దరం కలిసి ఆనందించాం. దానికి నన్ను ఒక్కర్తినే ఎందుకంటావు. పెళ్ళి చేసుకోలేకపోయినా కలిసి కాపురం చేస్తూ పిల్లల్ని కంటే తప్పేమిటి ? నాకు నా బిడ్డ కావాలనుకుంటే తప్పేమిటి ? ఆడదాన్ని ... తల్లినవ్వాలని నాకు కోరికుండకూడదా ? ఎంతసేపటికీ నీ గురించే ఆలోచిస్తావు. నీకు పెళ్ళాం భయం, లోకభయం. కానీ ఆడదాని ఆనందం మాత్రం కావాలి. నాకలా కాదు. నాకు అన్నీ కావాలి. ఇల్లు, సంసారం, పిల్లలు అన్నీ కావాలి. పెళ్ళి కాకపోయినా, ఐడోంట్ కేర్ ...'' తనూ గట్టిగా అరిచింది. విస్తుపోయాడు వినోద్. ఏం మాట్లాడాలో తెలియక గాభరా పడిపోయాడు.

''ఏమిటాచూపు ... లోకంలో పిల్లల్ని కనబోతున్న మొదటి ఆడదాన్ని నేనే అన్నట్లు'' దబాయించింది.

వినోద్ విసురుగా లేచి, ఆవేశంగా, ''మాట్లాడకు. ముందు వెళ్లి డాక్టర్‌ని కలువు. ఏం చేస్తావో, ఎలా చేస్తావో ... ఈ బిడ్డ లోకంలోకి రాకూడదు అంతే'' కచ్చితంగా తెగేసి అన్నాడు.

ప్రీతి విస్తుపోయింది. వినోద్‌లో అంత కోపం ఎన్నడూ చూడని ఆమె కలవరపడుతూ, ''ఏమిటి వినోద్ ? ఏమంటున్నావు'' ?

''వెళ్ళి వెంటనే అబార్షన్ చేయించుకోమంటున్నా'' చాలా గట్టిగానే అన్నాడు. ప్రీతి మొహం ఎర్రబడి పోయింది. వినోద్ ఇంత రూడ్‌గా ప్రవర్తిస్తాడని, ఇలా తెగేసి మాట్లాడుతాడని ఊహించని ఆమె బిత్తరపోయింది. తన ప్లాను బెడిసి

కొట్టినందుకు, తన ఆశ వమ్ము కాబోతున్నందుకు, ఆ నిరాశ తట్టుకోలేక ఆఖరి అస్త్రంగా "వినోద్, ఈ బిడ్డ నాక్కావాలి. అందుకు నేనొప్పుకోను. అబార్షన్ చేయించుకోను'' నిష్కర్షగా అంది.

ప్రీతి అంత నిర్లక్ష్యంగా తనను, తన మాటలను లెక్కచెయ్యకపోవడంతో వినోద్‌లో ఆగ్రహం పెల్లుబికింది. విసురుగా లేచాడు. "సరే, బిడ్డని కంటావో మానతావో నీ ఇష్టం. ఈరోజు నుంచి నీకు నాకు సంబంధం లేదు. ఇంక నీ మొహం నేను చూడను. గుడ్‌బై !'' ఆఖరి అస్త్రం వదిలాడు.

ప్రీతి విసురుగా లేచి అతని చెయ్యి పట్టి లాగి, "ఏమిటి గుడ్ బై ? ఆ ... ఇన్నాళ్లు వాడుకుని నన్ను వదిలేసిపోతావా ? నా గర్భం నీ ఆనందానికి అడ్డని, ఈ బిడ్డ వల్ల నీ పరువు ప్రతిష్ఠలకి భంగమని వదిలించుకు పోదామను కుంటున్నావా''? అపరకాళి అవతారం ఎత్తి అంది.

"ప్రీతీ ... అర్థంచేసుకో, నా మాట వింటే మనం ఇలాగే ఉండొచ్చు. కాదంటే ... నేను నా పరువు ప్రతిష్ఠని తాకట్టుపెట్టలేను. ఈ విషయం నా భార్యకి తెలిస్తే ఊరుకోదు. నన్ను నిలదీసి అడిగే హక్కు ఆమెకు ఉంది''.

"నిన్నేమన్నా నీ భార్యగా ఇంటికి తీసికెళ్లమన్నానా లేక నీ పెళ్ళాం స్థానం ఇమ్మన్నానా ? లేకపోతే నీ భార్యని వదిలేయమన్నానా ? మనం ఏ గుళ్లోనో పెళ్ళి చేసుకుందాం. పుట్టబోయే బిడ్డకు తల్లిదండ్రులం అవుదాం. ఇదే కదా నేను అడుగుతోంది'' ప్రీతి కోపంగా అంది.

"ఇదిగో ప్రీతీ, మన విషయం ఎంతో జాగ్రత్తగా ఎవరికీ తెలియకుండా ఇన్నాళ్ళు ఎలాగో సాగించాను. ఇప్పటికే ఆఫీసులో చాలామంది గుసగుసలాడు తున్నారు. బాస్‌ని కనక పైకి తెలియనట్టే ఉంటున్నారు. ఈ విషయం ఇవాళ కాకపోతే రేపయినా నా భార్య దగ్గరికి చేరుతుంది. ఏదో విధంగా దబాయించో, అబద్ధాలు చెప్పో, ఎలా తప్పించుకోవాలో అర్థంకాక భయపడుతున్నాను. ఇలా నీ మెడలో తాళికట్టి పిల్లాడిని కంటే, ఆవిడ ఊరుకుంటుందా ? సమాజం,

చట్టం అంతా ఆవిడవైపే ఉంది అది మర్చిపోకు. అసలు నీకు నేను పెళ్ళిచేసుకుంటానని ఎప్పుడన్నా చెప్పానా ? ముందురోజే నా పరిస్థితి చెప్పాను. ప్రేమకు, అనురాగానికి నోచుకోని నేను అవి దొరికే స్త్రీ పొందు కోరుకున్నాను. నువ్వు నాకు నచ్చావు కనుక నీతో సహజీవనం చేశాను. అంతకుముందు అమ్మాయిలతో రోజులు, మహా అయితే ఒక నెల ... అంతకంటే ఎక్కువ ఎవరితోనూ ఇలాంటి పొత్తు పెట్టుకోలేదు. ఇవన్నీ నీకు ఏదీ దాచకుండా ముందే చెప్పాను. నువ్వు అన్నింటికీ ఇష్టపడే, నన్ను నిజంగానే ప్రేమించావని నమ్మాను. నిన్ను గత ఏడాదిగా ఎంత అపురూపంగా చూసుకున్నాను. నువ్వు ఏదడిగినా కాదనకుండా సమకూర్చాను అపార్ట్‌మెంట్, కారు, నీకు నటిగా, మోడల్‌గా గుర్తింపు తెచ్చే అవకాశాలు ... ఎన్ని ఇచ్చా. ఇవన్నీ నేను ఇష్టపడే చేశాను. మరి నువ్వు నన్ను నిజంగా ప్రేమించావో, నీ స్వార్థం కోసం ప్రేమ చూపావో, ఈ ఫ్యాషన్ వరల్డ్‌లో నీ స్థానం కోసం నన్ను వాడుకున్నావో నాకు తెలియదు. తల్లికావాలి అనే నీ కోరికని నేను తీర్చలేను. ఆ బిడ్డకి తండ్రిగా ఉండలేను. నా మాట అంగీకరిస్తే మన సంబంధం కొనసాగుతుంది. లేదంటే నన్ను మర్చిపో. ఇదే నా ఆఖరి మాట. ఆలోచించి, ఏ సంగతీ రేపు చెప్పు. నన్నేదో బ్లాక్‌మెయిల్ చేద్దామని మాత్రం అనుకోకు'' అన్న వార్నింగ్ కూడా ఇచ్చి చకచకా వెళ్లిపోయాడు వినోద్.

నిర్ఘాంతపోయి కూలబడిపోయింది ప్రీతి. మొహం ఎర్రబడి, కళ్లు నీళ్లతో నిండిపోయాయి. తన ఆశ, కోరిక తీరేది కాదని వినోద్ ఖచ్చితంగా చెప్పేశాడు. జీవితాంతం ఇలా అతని ఉంపుడుగత్తెగా ఉండిపోవాలా ? పెళ్ళి, సంసారం, పిల్లలు లేకుండా గడపాలా ? ఇవాళ ఉన్న ఈ ప్రేమ ఎన్నాళ్లుంటుంది ? ఈ ప్రేమని నమ్ముకుని ఎలా బతకాలి ? పెళ్ళి లేని ప్రేమకి మగాడు కట్టుబడడు. ఈ సంఘటన తర్వాత అతను ఇదివరకటి ప్రేమ చూపకపోవచ్చు కూడా ! ఇంక ఇది మూన్నాళ్ల ముచ్చటే అవగలదు. తను అతన్ని కాదని బిడ్డని కంటే, పెళ్ళి కాకుండా బిడ్డను కన్న తనను లోకం గౌరవిస్తుందా ? వినోద్‌తో సంబంధం

తెంచుకుంటే రేపు తనకి అవకాశాలు తగ్గవచ్చు. ఏ ధైర్యంతో తను ముందుకెళ్లగలదు ? రాత్రంతా ఆలోచించినా పరిష్కారం కనబడలేదు. మనసులో కోపం, కసి పెరిగిపోయి, ఇన్నాళ్లు తనను వాడుకుని వదిలేశాడన్న ఉక్రోషంతో రాత్రంతా నిద్రపట్టక దొర్లింది. మర్నాడు ఫోన్ చేస్తానని, కోపం తగ్గి వస్తాడని ఆశించింది. ఒక రోజంతా చూసి తనే ఫోన్ చేసింది.

"ఏం నిర్ణయం తీసుకున్నావు" ముభావంగా అడిగాడు.

"ఇంకా ఆలోచించలేదు" బింకంగా అంది. ఫోను టక్కున పెట్టేశాడు.

మూడు రోజులు అదే పరిస్థితి. ఫోన్ చేసినా కట్ చేసేవాడు. మెసేజ్ పెడితే 'నిర్ణయం మార్చుకుంటే తప్ప మాట్లాడకు' అని జవాబిచ్చాడు. అతని నిర్లక్ష్యం ఆమెలో మరింత కోపం, కసి, ఉక్రోషాన్ని పెంచాయి.

అసలు తన గురించి ఏమనుకుంటున్నాడు. ఇష్టం వచ్చినట్టు వాడుకుని వదిలేసిపోతే, ఊరుకుంటానని అనుకుంటున్నాడా ? ఏం చెయ్యలేనని ధైర్యమా? ఒకరకం తెగింపు వచ్చింది ప్రీతికి. అతనిమీద కోపంతో రగిలిపోతూ, విచక్షణా జ్ఞానం పోగొట్టుకుంది. ఆమె ఓ నిర్ణయానికి వచ్చి అతనికి బుద్ధి చెప్పాలని, దానికి ఏం చెయ్యాలో ఆలోచించే లోపల ... కాగల కార్యం గంధర్వులే తీర్చారు.

❊ ❊ ❊

దీనికిముందు, వారం రోజుల క్రిందట ... ధనిక వర్గం లేడీస్ కిట్టిపార్టీలో సుస్మిత ప్రాణస్నేహితురాలు కాంచన, స్నేహితురాలిని ఓ మూలకి లాక్కెళ్ళి ... "ఏమిటి, నువ్వు మీ ఆయన రాసలీలలు తెలిసే ఊరుకున్నావా, తెలియదా అసలు"? గుసగుసలాడింది. "నీకు ఎలా చెప్పాలో, ఎలా అడగాలో తెలియక వారం రోజులుగా మథనపడుతున్నాను. ఫోన్ చేద్దామనుకున్నాను కానీ, ఫోనులో సంభాషణ ఎవరన్నా వింటారేమోననిపించి, కలిసి మాట్లాడాలనుకున్నాను" అంటూ ఆరంభించింది.

"నువ్వేమంటున్నావు ? మా ఆయన రాసలీలలేమిటి ?" తెల్లబోతూ అడిగింది సుస్మిత.

"అంటే నీకసలు ఏడాదిగా జరుగుతున్న భాగోతం గురించి ఏమీ తెలియదా"?

సుస్మిత మరింత తెల్లబోతూ కలవరంగా చూసింది. తెలియదన్నట్టు తల అడ్డంగా ఊపింది, పాలిపోయిన మొహంతో.

"మీ ఆయన ప్రీతి అన్న అమ్మాయితో లివిన్ రిలేషన్‌షిప్ చేస్తున్నాడు. ఒక మంచి అపార్ట్‌మెంట్ కొనిచ్చాడట. కారు, డబ్బు, వేషాలు, యాడ్ వరల్డ్‌లో బోలెడు అవకాశాలు అన్నీ ఇచ్చి తనతో రెండో సెటప్ పెట్టాడు. నువ్వు ఇంత అమాయకంగా ఎలా ఉన్నావు సుస్మిత ? ఇంట్లో మగాడిలో మార్పు కూడా కనిపెట్టలేకపోయావా? ఇంత జరుగుతుంటే ఈ వార్త నీదాకా రాలేదా" ?

సుస్మిత వెర్రిమొహం పెట్టింది. తెల్లబడిన మొహం నల్లబడింది. "నిజంగానా ? నువ్వు చెప్పేది నిజమేనా" ? అంది పళ్ల బిగువున.

"బాగుంది, నీతో ఇలాంటి విషయాల్లో అబద్ధం ఎందుకు చెపుతాను" ?

"నీకెలా తెలిసింది ? ఎవరు చెప్పారు నీకు" ? ఆరా తీసింది.

"నాకు మొన్న తెలిసింది. మా ఆడపడుచు కూతురు ఆ అపార్ట్‌మెంట్స్‌లోనే ఉంటుంది. ప్రీతి చాలామందికి తెలుసు. ప్రకటనల్లో, పత్రికలలో, యాడ్స్‌లో, టీ.వి. యాడ్స్‌లో చూస్తారు కదా అందరూ. ఆ అమ్మాయిని అందరూ చూసేవారు. కొంతమంది ఆ అమ్మాయితో కాస్త పరిచయం పెంచుకున్నారు. ఏ లిఫ్ట్‌లోనో, వచ్చేటప్పుడో, పోయేటప్పుడో 'హాయ్' అన్న పలకరింపు. ఓ చిరునవ్వు తప్ప ఎక్కువగా ఎవరితోనూ మాట్లాడకపోయినా, అదే భాగ్యంగా అనుకునేవారు అక్కడ ఉండేవారు. ఆ అమ్మాయింటికి వినోద్ వచ్చి పోవడం చాలామందే చూసినా, పెద్ద కారులో వచ్చే వినోద్‌ని అడిగేవారెవరు. యాడ్ వరల్డ్, ఫ్యాషన్ వరల్డ్‌లో బాయ్‌ఫ్రెండ్సు, లవర్స్ కామన్. అది అందరికీ తెలిసిందే. అందుకే చూసీ చూనట్లుండేవారు".

"మరి ..." ఆరాటంగా అడిగింది.

"ఇన్నాళ్లు మా ఆడపడుచు కూతురు సుజాత కూడా అదే అనుకుందిట. పదిహేను రోజుల కిందట మా ఇంట్లో మేరేజ్ ఏనివర్సరి పార్టీ ఇచ్చినప్పుడు నువ్వు, వినోద్ వచ్చారు గదా. ఆ పార్టీకి సుజాత, వాళ్లాయన కూడా వచ్చారు. అక్కడ వినోద్‌ని చూసి ఆశ్చర్యంగా అతనెవరు ? అంటూ ఆరా తీసింది. ఊరికే అడిగిందేమో అనుకుని వినోద్ గురించి, మీ కంపెనీ గురించి, నువ్వు అతని భార్యవని అన్ని విషయాలు మర్నాడు మాట్లాడుకున్నాం. సుజాత అప్పుడు వినోద్ గురించి, ప్రీతి గురించి చెప్పింది విని ఆశ్చర్యపోయాను. నమ్మలేకపోయా. వెంటనే నీకు చెప్పకుండా సుజాతని అన్ని విషయాలు నాలుగైదు రోజులు కనిపెట్టి చెప్పమన్నాను. వాచ్‌మేన్ ద్వారా పక్కనుండే అపార్ట్‌మెంట్ వారి ద్వారా అతని రాకపోకలు, వివరాలు పూర్తిగా చెప్పమన్నాను. అతను సాధారణంగా సాయంత్రం వచ్చి రాత్రి పది గంటల వరకు ఉంటాడు. ఒక్కోసారి సూట్‌కేసుతో వచ్చి రెండు మూడు రోజులుండేవాడు. కనీసం రోజుకొక సారన్నా ఏదో ఒక టైములో వస్తాడు. ఇద్దరూ కలిసి బయటికి మాత్రం వెళ్లేవారు కాదు అని చెప్పింది సుజాత. నీకు చెప్పేముందు అన్నీ రూఢీగా తెలుసుకునే చెప్తున్నాను" అంది స్నేహితురాలు కాంచన.

ఇద్దరిదీ ఎక్కడో దూరపు చుట్టరికం. పైగా చిన్నప్పటి నుంచీ ఇద్దరూ కలిసి చదువుకున్న స్నేహం. దాంతో ఆమె చెప్పింది విని, సుస్మిత నిర్ఘాంత పోయింది. ఆగ్రహం పట్టలేక, ఆవేశంగా పార్టీ నుంచి బయటికి వచ్చింది. తరువాత కారులో కూర్చుని, ఆవేశం తగ్గించుకుని తెలివిగా ఆలోచించింది. తాను తొందరపడి, ఆవేశపడి భర్తను నిలదీస్తే ... ? అతనిప్పుడు తన బెదిరింపులకు లొంగడు. కంపెనీ లాభాల బాట పట్టింది. అవును, నేను ప్రేమిస్తున్నాను అని తెగేసి చెపితే ... తనేం చెయ్యాలి ? అసలే ఇద్దరి మధ్య సంబంధం అంతంత మాత్రం. ఇంట్లో తను పేరుకు మాత్రమే భార్య. తన

గురించి అస్సలు పట్టించు కోడు. ఎక్కడికెళ్ళినా, ఏం చేసినా, ఎంత ఖర్చుపెట్టినా ... ఏదీ కల్పించుకోడు. కొడుకుతో మాత్రం, వాడు స్కూలుకెళ్ళేముందు ఓ అరగంట కబుర్లు చెబుతాడు. చదువు, ఆటల గురించి, స్నేహితుల గురించి మాట్లాడతాడు. ఎప్పుడైనా సెలవురోజు అలా కారులో కాసేపు తిప్పి వాడికేం కావాలో కొనిపెడతాడు. భార్యాభర్తల మధ్య ఉండాల్సిన అనుబంధం, ఆప్యాయత, దగ్గరితనం ఏనాడో పోయాయి. ఒక ఇంట్లో ఉన్నారన్నదే తమ బాంధవ్యం. ఇలాంటి స్థితిలో రెచ్చగొడితే, ఇంట్లో దొరకని ఆనందాన్ని బయట అనుభవిస్తున్నప్పుడు ఏదో తెగింపే ఉంటుంది అతనిలో. ఇంటికి చేరగానే బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపులు మూసుకొని తండ్రికి ఫోన్ చేసి విషయం అంతా చెపుతూ, తనకి జరిగిన అవమానం తట్టుకోలేక ఏడుపు ఆరంభించింది. అటునించి ఆయన అంతా విన్నాడు. కూతురిలా ఆవేశ పడలేదు. అతను పక్కా బిజినెస్‌మాన్. బంగారం వ్యాపారంలో ఆరితేరి, ఏది ఎలా సాధించాలో పట్టువిడుపులు తెలిసిన మనిషి. ఆవేశపడి, కోప్పడి గుట్టు రట్టు చేసుకోకుండా, విషయాన్ని మట్టుపెట్టగలిగిన సమర్థత ఉంది కిషన్‌లాల్ అగర్వాల్‌కి. కూతుర్ని ఓదార్చాడు. “అంతా సరిచేస్తాను. నువ్వేం బాధపడకు. అతని దగ్గర ఏం తెలీనట్టే ఉండు'' అని ధైర్యం చెప్పి, ఆ అపార్ట్‌మెంటు పేరు, ప్రీతి వివరాలు తెలుసుకుని, కార్యాచరణలోకి దిగాడు. ఒక్క రెండు రోజుల్లోనే ప్రీతి ఎవరు, వినోద్ కంపెనీలో ఎప్పుడు చేరింది మొదలు ... వినోద్, ప్రీతీల మధ్య అనుబంధం ఎప్పుడు మొదలైంది, ఈ అపార్ట్‌మెంట్ ఎప్పుడు మారింది, వినోద్ రాకపోకల సమయాలు, వారిద్దరి మధ్య సంబంధ బాంధవ్యాలు, ప్రీతికి ఏఏ ఇతర కంపెనీలలో ఆఫర్లున్నాయి. ఆమె సంపాదన ఎంత, ఈ మధ్య వారిమధ్య మనస్పర్థలు మొదలవడం, ఆఖరికి ప్రీతి నర్సింగ్‌హోంకి వెళ్ళి ప్రెగ్నెన్సీ టెస్ట్ చేయించుకోవడం, వినోద్ గొడవపడడం వరకు ప్రతీ చిన్న విషయం అపాయింట్ చేసిన డిటెక్టివ్ ఏజెన్సీ రాబట్టి రిపోర్ట్ అందచేసింది. ఆమె కారు డ్రైవరు, ఇంట్లో ఉండి పనిచేసే అమ్మాయి, ఇరుగుపొరుగు వారు, వాచ్‌మేన్, ఆఖరికి

ప్రీతి వెళ్లిన నర్సింగ్‌హోం నుంచి కూడా వివరాలు రాబట్టారు. ఈ రిపోర్టు మొత్తం చదివిన కిషన్‌లాల్ ... తనూహించిన దానికంటే విషయం చాలా దూరమే వెళ్లిందని, ప్రీతి ప్రెగ్నెంట్ అన్నది విని ఆయన మరింత సీరియస్ అయ్యాడు.

వినోద్, ప్రీతిల సంబంధం గురించి విన్న సుస్మిత గత రెండు మూడు రోజులుగా భర్తను అన్ని కోణాల నుంచి గమనించి చూస్తూ, అతి కష్టం మీద కోపం, ఆవేశం నిగ్రహించుకుంటోంది. తండ్రిమీద ఆమెకెంతో నమ్మకం, భరోసా. ఆయనకి తన మీద ఉన్న ప్రేమ తెలుసు. తనకెవరన్నా కష్టం కలిగించే మాట అన్నా, ఆఖరికి తల్లి అన్నా కూడా ఆయన సహించేవాడు కాదు. అలాంటిది అల్లుడు కూతురు కింత ద్రోహం చేస్తే ఊరుకోడని, ఈ సమస్యని ఎలా పరిష్కరించాలో ఆయనకి తెలుసని, తండ్రి అన్నీ సేకరించి చెప్పేవరకు ఆయన ఏం చేస్తాడో చూశాక, అప్పుడు బయటపడాలని ఓపిక పట్టింది. గత ఏడాది నుంచి వినోద్ ప్రవర్తనలో చాలా మార్పు వచ్చింది. ఇంట్లో అసలు తనను పట్టించుకోడు. ఏమన్నా వినీ విననట్టు వెళ్లిపోవడం, ఇంట్లో ఉండే సమయం తగ్గిపోవడం, నెలకి రెండు మూడుసార్లు ముంబయి, ఢిల్లీ ఆఫీసు పనులంటూ రెండు మూడు రోజులు వెళ్లిపోవడం ... అన్నీ చూసిన ఆమెకి వినోద్ మీద అనుమానం రాలేదు. తమిద్దరి మధ్య ఎప్పుడూ పెద్ద సఖ్యత లేదు. సాన్నిహిత్యం లేదు. పని ఒత్తిడిలో అలా అంటీ ముట్టనట్టు హడావిడిగా వెళుతున్నాడు వస్తున్నాడనుకుంది తప్ప వినోద్ ఇలా ఇంకో ఆడదానితో సంబంధం పెట్టుకుంటాడన్న అనుమానం కూడా తలెత్తలేదు. అలాంటిది తన వెనక ఇంత పకడ్బందీగా, హాయిగా ఇంకో ఇంట్లో రెండో సెటప్ పెట్టాడంటే, ఇప్పటికీ ఆమెకి నమ్మశక్యం కావడం లేదు. వినోద్ చేతకానివాడని, తనంటే భయమని, తన డబ్బుతోనే ఈ బిజినెస్ నిలబడింది కాబట్టి తనకు వ్యతిరేకంగా ఏ పనీ చేసే సాహసం చెయ్యడని నమ్మకం. ఈరోజు ఆ నమ్మకం సడలిపోయింది. కట్టుకున్న భార్యకు ఇంత ద్రోహం చేయగలిగిన భర్తని ఏం చెయ్యాలి, ఎలా బుద్ధి చెప్పి మళ్లీ గుప్పిట్లో పెట్టుకోవాలని ఆమె లోలోపల ఉడికిపోతూ అతి కష్టం మీద నిగ్రహం చూపించింది.

ఇంటికి పిలిచి తండ్రి సేకరించిన వివరాలు చెప్పగానే నిర్ఘాంతపోయింది. అన్నింటికంటే ప్రీతి గర్భవతి అన్న నిజం ఆమె తట్టుకోలేకపోయింది. ఆగ్రహావేశాలతో లేచి నిలబడ్డ కూతుర్ని చేయిపట్టుకు లాగి కూర్చోపెట్టాడు తండ్రి. "ఇది ఆవేశంతో చెయ్యాల్సిన పని కాదు. నువ్వు కామ్‌గా ఉండు. నేను అన్నీ దారిలో పెడతా'' భరోసా ఇచ్చాడు కిషన్‌లాల్.

"ఊరుకోను డాడీ ! ఆ వినోద్‌ని ఇంట్లో నలుగురిముందు నిలబెట్టి కడిగేసి మళ్లీ తలెత్తకుండా చేస్తాను. అసలేమనుకుంటున్నాడు నా గురించి'' ఎగిరిపడింది.

కూతుర్ని సముదాయించి "ముందు అటు నుంచి నరుక్కురావాలి. అల్లుడిని కాదు కంట్రోల్‌లో పెట్టాల్సింది. ఆ అమ్మాయిని అల్లుడి జీవితంలోంచి తప్పించాలి. అదంతా నాకు వదిలేయ్. ఇంకో రెండు రోజులు టైమివ్వు నాకు'' అని నచ్చచెప్పి పంపాడు.

✳ ✳ ✳

ఇంట్లోకి చొరపడ్డ జెమజెట్టీల్లాంటి ముగ్గురు మనుష్యులని, ఆ తరువాత సినిమాలో మాదిరి హుందాగా లోపలికి అడుగుపెట్టిన కిషన్‌లాల్‌ని చూసి ... తలుపుతీసిన ప్రీతి బిత్తరపోయింది. "ఏయ్ ... ఎవరు మీరు ? ఏమిటి ఈ దౌర్జన్యం ?'' అరిచింది.

కిషన్‌లాల్ అక్కడున్న సోఫాలో కూర్చొని చుట్టూ పరిశీలిస్తూ, "ఊఁ బాగానే ఉంది ప్రేమకుటీరం. సెటప్ బాగానే ఉంది'' అన్నాడు వ్యంగ్యంగా.

"ఏయ్, ఎవరు నువ్వు ?'' అరిచింది ప్రీతి.

"చెపుతా, ఇలా వచ్చి కూర్చో. ఆ తలుపులు మూసిరా నలుగురూ వింటే బాగుండదు'' అన్నాడు.

ప్రీతి భయంగా చూసింది. వచ్చినవారిలో ఒకడు తలుపు మూసి గడియ

పెట్టి, గుమ్మం దగ్గరే నిలబడ్డాడు. తక్కిన ఇద్దరూ కిషన్‌లాల్ వెనక వచ్చి నిలబడ్డారు. ప్రీతి భయంతో "ఏమిటిదంతా ? ఎవరు మీరు" ? మళ్లీ అడిగింది.

"నేనెవరో నీకు అనవసరం. ఎందుకొచ్చానో చెపుతాను విను. నీకు మూడు రోజులు టైమిస్తున్నాను. నీ పెట్టెలు, బట్టలు మాత్రం పట్టుకుని ఇల్లు వదిలి వెళ్లు. ఈ ఇల్లు నాది అనకు. ఇది నీదికాదు. ఇందులోని ఏ ఒక్క సామానూ నీది కాదు. ఎక్కడికి వెడతావో నాకనవసరం. వెళ్లకపోతే సామాను మిగలదు. నువ్వూ మిగలవు. చెప్పినట్టు చేస్తే నువ్వు మాత్రం మిగులుతావు. బతికుంటే సామాను మళ్లీ వస్తుంది. ఇక్కడినుంచి వెళ్లాక నీ బతుకు నీది".

"ఏమిటి మీ దౌర్జన్యం ? మీరెవరు నన్ను వెళ్లమనడానికి ? ఇది నా ఇల్లు. ఏడాది నుంచి ఉంటున్నానిక్కడ. నేనెందుకు వెళ్లాలో చెప్పండి ముందు. రౌడీయిజం చేస్తే పోలీసుల్ని పిలుస్తా జాగ్రత్త" సెల్ తీయబోయింది. కిషన్‌లాల్ వెనుక నిలబడ్డ ఇద్దరిలో ఒకడు ముందుకురికి, టక్‌మని చేతిలోంచి ఫోన్ లాక్కున్నాడు.

"చూడు ... ఇలాంటివాటికి మేం బెదరం. నీకు బతుకు మీద ఆశ ఉంటే మేం చెప్పినట్టు విను. వినను అంటే రెండురోజులు టైమ్ కూడా లేదు".

ఈసారి నిజంగానే భయమేసింది ప్రీతికి.

"ఏం కావాలి మీకు ? ఎందుకిలా నా మీద దౌర్జన్యం ... ?"

"వినోద్ జీవితం నుంచి తప్పుకో. అతనితో ఏ విధమైన సంబంధ బాంధవ్యాలు ఉండరాదు. ఈ ఇల్లు వదిలి, వీలయితే ఊరు వదిలిపో. దానికి ఎంత డబ్బు ఇవ్వాలో మేం నిర్ణయించి ఇస్తాం. గప్‌చుప్‌గా పుచ్చుకుని వెళ్ళు. కాదని మొండికేస్తే జరిగే దానికి మేం బాధ్యులం కాము".

"మీరు వినోద్ మనుష్యులా ? వినోద్ పంపించాడా బెదిరించడానికి" ? నమ్మలేనట్లు అడిగింది. ఇంత నీచానికి దిగజారాడా వినోద్ ! వాడుకున్నన్ని రోజులు వాడుకుని, తల్లిని కాబోతున్నానని తెలిసి, తప్పించుకోవడానికి ఇంత నీచంగా ...

"ఏయ్ ఆపు. వాగుడనవసరం. మేమే వచ్చామో, వినోద్ పంపాడో నీ ప్రశ్నలకి జవాబులు చెప్పం ... చెప్పింది చేయి ..." కఠినంగా అన్నాడు కిషన్‌లాల్. అంటూనే తన మనుష్యులకి సైగ చేశాడు. ఇంట్లోకి వెళ్ళి అన్ని గదులూ వెతికి వినోద్, ప్రీతి ఉన్న ఫోటోలు తీసుకున్నారు. "రెండు రోజులు టైము, ఇల్లు విడిచి వెళ్లడానికి ..." అంటూ అందరూ బయటికి వెళ్ళిపోయారు.

నిశ్చేష్టురాలై అలా ఉండిపోయి, తర్వాత ఫోన్ తీసింది. అటునుంచి స్విచ్ఛాఫ్ అని వచ్చింది. అలా ఓ గంట ఆలోచిస్తూ కూర్చుండిపోయింది ప్రీతి.

⁕ ⁕ ⁕

ఆఫీసు నుంచి ఇంటికి వచ్చి డిన్నర్‌కి కూర్చునే ముందు ఇంట్లోని నలుగురూ కూర్చుని కబుర్లాడుకునే వేళ, తుఫానులా ఇంట్లోకి దూసుకు వచ్చింది ప్రీతి.

"వినోద్" లోపలికి వస్తూనే అరుస్తూ, వినోద్‌ని చూసి చకచక అతని దగ్గరికి వెళ్ళింది. "నువ్వు ఇంత నీచానికి ఒడిగడతావా ? ఛ ... నువ్వింత నీచుడవని తెలియక మోసపోయాను. వాడుకున్నన్ని రోజులు వాడుకుని నేను ప్రెగ్నెంట్ అని చెప్పగానే, నన్ను వదుల్చుకోడానికి ఇంటికి రౌడీలని పంపించి బెదిరిస్తావా ? నన్ను ఇంట్లోంచి దౌర్జన్యంగా వెళ్లగొట్టడానికి ప్రయత్నిస్తావా ? ఏడాదిపాటు నాతో ప్రేమాయణం జరిపి, నువ్వే నా ప్రాణం అని రోజూ నా ఇంటికి వచ్చి, ప్రేమ కురిపించి, నీ రాకపోకలకి వీలుగా ఇల్లు కొనిచ్చి, ఇప్పుడు నేను గర్భవతినని తెలిసి నీ పరువుకోసం అబార్షన్ చేయించుకోమంటే చేయించుకోనన్నానని, ఇంత నీచానికి దిగజారావా ? ఆ ప్రేమ కబుర్లు అంతా మోసమేనా ? నిన్ను నమ్మి నా సర్వస్వం అర్పించాను. ఆ మాత్రం దయకూడా లేకుండా కట్టుబట్టలతో నన్ను గెంటించా లనుకున్నావా ? ఇంత నిర్దయగా ఓ ఆడపిల్ల జీవితంతో ఆడలాడతావా ? నువ్వసలు మనిషివేనా ? నీలో ఇంత రాక్షసత్వమా ? భార్యతో సుఖం లేక నా దగ్గరికి వచ్చానని, ప్రేమకోసం

అల్లాడుతున్నానని నా వెంటపడ్డావు. నీ మాటలు నమ్మి, మంచివాడివని నిన్ను నమ్ముకుని ఏడాదిగా నీతో కలిసి బతికినందుకు ఇదా ఆఖరికి నువ్వు నాకిచ్చింది'' ? అతన్ని గుంజుతూ ఆవేశంగా అరిచింది.

పది నిమిషాలు ఆగకుండా ఆవేశంతో అరుస్తూ, అందరూ తేరుకునేలోగా తను అనవలసిన మాటలన్నీ ... కథంతా మొత్తం అందరికీ అర్థం అయ్యేట్టు చెప్పేసి వగరుస్తూ, రుద్రకాళి అవతారం ఎత్తిన ప్రీతిని నిశ్చేష్టులై చూస్తుండి పోయారు. అందరి కంటే ముందుగా తేరుకున్నది అవినాష్ జైన్. "ఏయ్, ఎవరు నువ్వు ? ఏమిటి నువ్వు మాట్లాడుతున్నది ? నీకెంత ధైర్యం ఇలా ఇంట్లో జొరపడి అల్లరి చేస్తున్నావు. రౌడీలని పంపడం ఏమిటి ? మేమెవర్నీ పంపలేదు. ఏమిటీ దౌర్జన్యం'' కోపంగా అరిచాడాయన.

"నేనెవర్నో మీ కొడుకు నడగండి సార్'' నల్లబడిన మొహంతో మాటలు రాక, ఏం చెయ్యాలో తెలియక నిశ్చేష్టుడిలా నిలబడిన వినోద్‌ని చూపిస్తూ అంది. "అడగండి ... నే చెప్పిన మాటల్లో ఒక్క అబద్ధం ఉందేమో, నా ఎదురుగా, ఇక్కడే అడగండి'' అరిచింది.

"ఇదిగో ముందు నువ్విక్కడనుంచి తక్షణం వెళ్ళు. నీకెంత ధైర్యం ఇలా ఇంట్లోకి వచ్చి పరువు తీయడానికి. మా దయాధర్మం మీద బతికే నువ్వు మమ్మల్ని ఎదిరించి నిలదీసి మాట్లాడుతున్నావు. అసలు నిన్నెవరు లోపలికి రానిచ్చారు. ఏయ్, వాచ్‌మేన్ ...''

"కొడుకు గూండాలతో బెదిరించాడు. తండ్రి పెద్దమనిషిగా ఆడపిల్లకి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాల్సిందిపోయి వాచ్‌మేన్‌తో గెంటిస్తాడు. అవును సార్ ! డబ్బున్నవాళ్ళు ఏమైనా చేస్తారు. నాకు న్యాయం జరిగేవరకు ఇక్కడినుంచి కదలను. పోలీసుల్ని పిలుస్తారా ... పిలవండి. అన్ని టీ.వి.ల వారినీ నేనూ పిలుస్తాను. మీ పరువుని బజారుకీడుస్తాను. ఆడపిల్ల కదా, ఏం చెయ్యలేదను కుంటున్నారేమో ...''

"చూడమ్మాయ్ ... నీ పేరు కూడా నాకు తెలియదు. నా కొడుకు తప్పు చేస్తే నువ్వు అడిగే పద్ధతి ఇదికాదు. పెద్దవాడిగా నేను న్యాయం చెయ్యాల్సి ఉంటే, ఇలా ఇంటిమీదకు వచ్చి దౌర్జన్యంగా ప్రవర్తించడం వల్ల, నీ మీద సానుభూతి కలగకపోగా న్యాయం చెయ్యాలన్న ఆలోచన కూడా పోతుంది. చూడు, నీ ఇష్టం లేకుండా నా కొడుకు నిన్ను బలవంతపెట్టాడా ? నీ అవసరం కోసం, నీ ప్రయోజనం కోసం, డబ్బుకోసం, నువ్వు వాడి జత కోరి ఇష్టపడ్డావు. నువ్వు ముందే ఏమన్నా షరతులు పెట్టావా ? నిన్ను పెళ్ళి చేసుకుంటానని చెప్పాడా ? మీ ఇద్దరూ ఏమనుకుని ఒకటయ్యారో మాకెవరికీ చెప్పి చేయలేదు. ఇవాళ ఇలా వచ్చి నిలేస్తే నేను నీకు సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం లేదు. మేం ఏ గూండాలనీ నీ ఇంటి మీదకి పంపలేదని మాత్రం చెప్పగలను. నేను నా కొడుకుతో మాట్లాడి అసలు సంగతేమిటో తెలుసుకుంటాను. నువ్వు చెప్పిందంతా నిజమైతే, నీ గురించి ఏం చెయ్యాలో, నీ పట్ల ఏ నిర్ణయం తీసుకోవాలో నిర్ణయించి చెపుతా. క్షణాల్లో నిర్ణయం తీసుకోవడానికి ఇదేమీ మామూలు విషయం కాదు. నిలబెట్టి అరిస్తే పని జరగదు. ముందు నువ్వు ఇక్కడినుంచి వెళ్ళు'' ఆయన చాలా నిబ్బరంగా, దృఢంగా అన్నాడు.

ఆ క్షణంలో ఆ అమ్మాయిని శాంతపరిచి పంపకపోతే జరిగే అనర్థం ఆయనకి తెలుసు. ఆవేశంలో ఆమె నిజంగానే ప్రెస్‌వాళ్లని పిలిచి రభస చెయ్యొచ్చు. అప్పుడు తమ పరువు బజారున పడుతుంది. ఆ క్షణంలో ఆమెని ఎలా టాకిల్ చెయ్యాలో అనుభవజ్ఞుడైన బిజినెస్‌మేన్‌గా, ఓ తండ్రిగా ప్రయత్నం చేశాడు.

"ఏం చేస్తారు మీరు ? నా కొడుకుని వదిలెయ్, ఆ డబ్బు తీసుకుని ఫో అంటారు, అంతేనా ?'' ప్రీతి ఎగిసిపడుతున్న గుండెలతో అంది.

"ఇప్పటికిప్పుడు ఇలా నిల్చుని చెప్పలేను. రేపటి వరకు ఓపిక పట్టు. నేనే వచ్చి మాట్లాడతాను'' శాంతంగానే అన్నాడు ఆయన. వినోద్ మొహంలో నెత్తురు చుక్కలేదు.

సుస్మిత ఎలా నిగ్రహించుకుందో ఆమెకే తెలియదు. భర్త మాడిపోయిన మొహం వంక చీదరింపుగా చూపు విసిరింది.

"సరే, పెద్దవారు చెప్పారని వెడుతున్నా. రేపు మీ కొడుకుతో వచ్చి మాట్లాడండి. ఇంత జరిగాక ఊరుకునే ప్రసక్తిలేదు'' బెదిరించి, వచ్చినంత వేగంగా వెళ్ళిపోయింది.

అక్కడంతా నిశ్శబ్దం. ఎవరు ఏం మాట్లాడాలో తెలియనట్టు మూగ బోయారు. ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ సుస్మిత ఒక్క ఉదుటున లేచి లోపలికి పరిగెత్తింది. అందరూ తేరుకుని ఆమె వెంట వెళ్ళేలోగానే, ఒకచేత్తో పదేళ్ల కొడుకుని, మరోచేత్తో ఇంట్లో ఉన్న పెట్రోల్ క్యాన్‌ని తీసుకొచ్చి అందరూ ఆమె ఏం చేస్తుందో అర్థం చేసుకునే లోగానే, తనమీద, కొడుకు మీద పెట్రోలు జల్లి, సినిమాల్లో మాదిరిగానే అగ్గిపెట్టె తీసుకుంది. ముందుగా విశాల్ తేరుకుని ముందు కురికి, వదినగారి చేతిలోని అగ్గిపెట్టె లాగేశాడు. ఆమె గింజుకుంటూ "విశాల్, వదులు నన్ను. ఇంత అవమానం జరిగాక, ఇంక నేను బతకను. నా మొగుడు నాకింత ద్రోహం చేశాక, ఏడాదిగా ఇంకొకరితో కులుకుతూ నన్నింత మోసం చేసి ఆమెతో బిడ్డని కంటానంటే, ఎంత ఘోర అవమానం ... నేను, నాతోపాటు నా కొడుకు చస్తాం. అప్పుడింక ఆయనగారిని దానితోనే కులకమనండి'' హిస్టీరిక్‌గా అరుస్తూ గింజుకుంది. అవినాష్ ముందుకు వెళ్లి మనవడిని తన దగ్గరికి లాక్కుని, కోడలి చేయి పట్టుకుని "అమ్మా, నువ్వు ఆవేశపడకు. తొందరపడి నీ జీవితాన్ని నాశనం చేసుకోకు. పిల్లాడి మొహం చూడు. పిచ్చివెధవ ఎలా భయపడుతున్నాడో ... చూడు, తప్పు జరిగింది. దాన్ని సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి గాని, తొందరపడి అఘాయిత్యం చేసుకోవడం, అందరినీ బాధపెట్టే నిర్ణయాలు తీసు కోవడం చేయొద్దు. ముందు లోపలికి వెళ్ళి బట్టలు మార్చుకో. మనం శాంతంగా మాట్లాడదాం. జరిగిన తప్పుని సరిదిద్దుదాం. భార్యగా నీ స్థానం ఎవరూ కాదనలేరు. సమాజం, చట్టం అన్నీ నీవైపే ఉంటాయి. ఎంతమంది ఆడవాళ్లు వచ్చినా, ఎవరూ

భార్యగా నీ స్థానాన్ని పొందలేరు. అది ఉత్త వ్యామోహం. వినోద్ చేసింది తప్పే, కాదనం. ఏదో వీక్ మూమెంట్లో మగవాడు తొందరపడతాడు. అది తాత్కాలికం. నీకు కలిగిన బాధ, జరిగిన అవమానం భరించలేనిదే. కానీ తెలివైన భార్య చెయ్యాల్సింది ఇది కాదు'' అంటూ భార్యని "లోపలికి తీసుకెళ్లి బట్టలు మార్చించు. నాన్నా అభీ, లోపలికెళ్లి బట్టలు మార్చుకో'' అంటూ వాళ్లని పంపించాడు. ప్రాణం లేనివాడిలా కుర్చీలో చేతులతో మొహం కప్పుకుని కూర్చున్న వినోద్ దగ్గరికి వెళ్లి ... భుజం మీద ఓదార్పుగా తట్టి, నిస్తేజంగా తలెత్తి చూసిన కొడుకుని "నే చూసుకుంటా, బాధపడకు. ధైర్యంగా ఉండు. చేసింది తప్పే ... కాని సరిదిద్దుకోవడంలో ఉండాలి తెలివి'' అన్నాడు.

☼ ☼ ☼

ఆయన చాకచక్యంగా సరిదిద్దాల్సిన అవసరం రాకుండానే, తెలివైన భార్య చెయ్యాల్సింది చేసింది సుస్మిత. వెంటనే గదిలోకి వెళ్లి జరిగింది తండ్రికి చెప్పింది. ఆయన మౌనంగా అంతా విని, "సరే, నువ్వు బాధపడకు. పిచ్చిపనులు చేయకు. దాని సంగతి నేను చూసుకుంటాను'' అన్నాడు చాలా శాంతంగా.

ప్రీతి యాక్షన్‌కి, రియాక్షన్ వెంటనే ఆరంభమయింది. ఉదయాన్నే ఏడు గంటలకి పోలీసులు ఇంట్లో చొరబడి, ఇల్లంతా వెతికి, మూల మూల నుంచి డ్రగ్స్ ప్యాకెట్లు పట్టుకు లాగారు. బీరువాలో, పుస్తకాల షెల్ఫుల్లో, వంటింట్లో, బాత్‌రూముల్లో, పరుపుకిందా ... లక్షల విలువ చేసే ప్యాకెట్లు బయటపడ్డాయి. డ్రగ్స్ మాఫియాతో చేతులు కలిపి డ్రగ్స్ సరఫరా చేస్తోందన్న సమాచారం అంది, పోలీసులు సెర్చ్ వారంట్‌తో సహా వచ్చి ఇల్లంతా సోదా చేశారు. ఆమెను అరెస్ట్ చేసి, నాన్ బెయిలబుల్ వారంట్ జారీచేసి కేసు ఫైల్ చేశారు. కేసు మేజిస్ట్రేట్‌కి వచ్చేలోగా సెల్‌లో పడేసి నిజం చెప్పమంటూ, పేర్లు చెప్పమంటూ చిత్రవధ చేశారు. ఇది ఎంత నేరమో తెలుసా, నిజం ఒప్పుకో అంటూ చితకబొడిచారు. ఆడ పోలీసులు కూడా ఎంత క్రూరంగా ప్రవర్తించగలరో రుచి చూపారు.

ఏ ప్రశ్నకీ జవాబు లేని ప్రీతి బిక్కచచ్చిపోయి, జరుగుతున్న పరిణామాలను ఎలా అడ్డుకోవాలో, ఎవరిని సాయమడగాలో కూడా తెలియనంత అయోమయ స్థితిలో పడిపోయింది. నాకేం తెలీదన్నమాట తప్ప ఏమీ చెప్పలేక ఏడుస్తూ, గాయాల బాధను తట్టుకోలేక విలపిస్తూ, సెల్‌లో తిండి, నిద్ర మాని ఏడవడం తప్ప ఏం చెయ్యలేని నిస్సహాయ స్థితిలో, మూడు రోజులు గడిపింది. వినోద్‌తో సహా ఏ ఒక్కరికి ఫోన్ చేసినా, ఎవ్వరూ బదులివ్వలేదు. తల్లికి చెప్పినా ఆవిడ నిస్సహాయు రాలు. అన్న ఈ సమయంలో ఆదుకోడానికి ముందుకు రాడని తెలుసు. ఇదంతా వినోద్ చేయిస్తున్నాడన్న కోపంతో, అవమానంతో దహించుకుపోతూ కుమిలిపోవడం తప్ప, ఏ దారీ తెన్నూ తోచని స్థితిలో దేవుడు పంపిన దూతలా నల్లకోటు వేసుకున్న లాయరు ఒకడు దర్శనం ఇచ్చాడు. ఈ కేసులోంచి బయటపడాలంటే ఒక్కటే మార్గం. ఈ కాగితాల మీద సంతకం పెట్టాలి. ఏమిటా కాగితాలు ? అని అడగకముందే స్టాంపు పేపరు తీసి అందించాడు. వినోద్‌పై ఇకపై ఏ సంబంధం ఉండరాదని, అతని దరిదాపులకి రానని, అతని మొహం చూడనని, ఆ కంపెనీతో ఏ సంబంధం పెట్టుకోనని, ఏ విధమైన క్లెయిమ్‌లు చేయనని, ఈ ఇల్లు వదిలి వెళ్లిపోతానని, ఒక్కమాట వినోద్ గురించి గాని, ఆ కుటుంబం గురించి గాని మాట్లాడనని, వెంటనే అబార్షన్ చేయించుకుంటానని అన్ని విధాల అంగీకరించి ఈ పత్రాల మీద సంతకాలు పెట్టాలి. అప్పుడే ఆమె విడుదల అయ్యేందుకు సహాయం అందుతుందని, లేకపోతే డ్రగ్స్ నేరం మీద జీవితాంతం జైల్లో మగ్గాల్సి ఉంటుందని లాయరు చెప్పాడు. దాంతో దిక్కుతోచని స్థితిలో తల ఆడించి, పెట్టమన్న చోట సంతకాలు పెట్టింది. చదువుకున్న ప్రీతికి డ్రగ్స్ నేరం ఎంత పెద్దదో తెలుసు. అందులోంచి బయటపడడానికి తన దగ్గర ఏ దారీ లేదని తెలుసు. మర్నాడు ఉదయం మేజిస్ట్రేట్ ముందుకు కేసు వెళ్లాక విడుదల ఏర్పాట్లు జరుగుతాయని చెప్పివెళ్ళాడు లాయరు. ఆ రాత్రి ప్రీతికి ఆసుపత్రి ఖర్చుకూడా అక్కరలేకుండా అబార్షన్ దానంతటదే జరిగింది. పోలీసులు పెట్టిన

హింస, మానసిక క్షోభను ... ఆ శరీరం తట్టుకోలేక, ఆమెకు భవిష్యత్తులో ఇంకో సమస్య ఎదురుకాకుండా దేవుడు దయతల్చినట్టు, అబార్షన్ ఆ జైలు గోడల మధ్య జరిగింది.

ఇదంతా వినోద్, అతని కుటుంబమే చేయించిందన్న ఆమె అపోహకి సమాధానం ఎవరూ చెప్పలేరు. పోలీసులనబడేవారు, తాము చిక్కుల్లో ఇరుక్కోకుండా నలుగురు గూండాలను పోలీసు వేషాలలో పంపి, ఆమె ఇంట్లో డ్రగ్ ప్యాకెట్లను వాళ్ళే పెట్టి, వాళ్ళే వెతికి పట్టుకొచ్చారని, అప్పుడు నిజం పోలీసులు అరెస్ట్ చేసి జైల్లో పెట్టారన్న నిజాలు ప్రీతికి ఎప్పటికీ తెలిసే అవకాశం లేనంత పకడ్బందీగా అంతా జరిగిపోయింది.

ప్రీతి చావుతప్పి కన్నులొట్టయినట్టు జీవచ్ఛవంలా రెండు సూట్‌కేసులు పట్టుకుని పాత స్నేహితుల దగ్గరకి చేరింది.

"ఘోరం, అమానుషం. మరీ ఇంత అన్యాయమా ? ఇంతటి ప్రతీకారమా? సినిమాలు, కథలలో లాగా, నిజ జీవితాల్లో కూడా రీలా జరుగుతాయా" ? ప్రీతి కథంతా విన్న మహిమ మ్రాన్పడిపోయింది. నోట మాట రానట్టు చాలాసేపు అలాగే కూర్చుంది. తరువాత తేరుకుని "పాపం ... ప్రీతి జీవితంలో ఇంత విషాదమా"?

"అందుకే ఆ అవమానం, దుఃఖం, వేదన భరించలేక తాగుడు అలవాటు చేసుకుని, మొదట్లో రోజుల తరబడి గదిలోంచి బయటికి రాకుండా తాగుతూ అలా దొర్లేది. ఎవరన్నా భోజనం పెడితే తినేది, లేకపోతే అడిగేది కాదు. పిచ్చి అవతారంలా తయారయింది. మేమందరం భయపడిపోయాం. ఆ స్థితిలో బయటికి పొమ్మనలేక, ప్రీతి ధోరణి భరించలేక, ఇది తెలిస్తే మా ఉద్యోగాలకి ఏ ముప్పో అని భయపడుతూ బతికామనుకో. లోకానికి మొహం చూపలేక చీకటిగదిలో మగ్గేది. హు ... స్వయంకృతాపరాధం కొంత, తెలివితక్కువతనం కొంత, అనాలోచిత చర్యలతో, అన్నిటితో సర్వనాశనం అయింది".

"వినోద్ ఇంత అన్యాయం చేశాడా ? అవినాష్, విశాల్ గారిని చూస్తే పెద్ద మనుష్యుల్లా కనపడ్డారు'' సందేహంగా అంది మహిమ.

"నో ! అందరం ముందు అదే అనుకున్నాం. భయపడిపోయాం. ఇద్దర మ్మాయిలు వినోద్‌తో సంబంధం పెట్టుకున్నవాళ్లు భయపడి ఉద్యోగం వదిలి వెళ్లిపోయారు. కానీ, తరువాత తెలిసిందేమిటంటే దీని వెనుక కథ అంతా నడిపింది సుస్మిత తండ్రి కిషన్‌లాల్ అగర్వాల్ అని. మన బాస్ విశాల్, అవినాష్ గార్లు కూడా తమ కంపెనీ పరువు ప్రతిష్ఠ దిగజారిపోతాయని భయపడ్డారు. అంచేత వాళ్లే చెప్పమని చెప్పారో లేక అన్వర్ తనే చెప్పాడో కాని అన్వర్ ద్వారా విషయం ఆఫీసులో అందరికీ తెలిసింది. బహుశా తమ పేరు చెడగొట్టుకోడానికి ఇష్టపడక అన్వర్‌ని ఉపయోగించి ఉండొచ్చు. లేకపోతే అతనికంత ధైర్యం ఎక్కడిది. మొత్తానికి తండ్రి చేయించిన పనితో సుస్మిత శాంతించింది''. సీమ అంది.

"నిజమే. విషయం తీసిపారేసేది కాదు. అది వారి ఇంటి పరువు, కంపెనీ పరువుకి సంబంధించినది. అలాగే చాలా అవమానకరం, ఇబ్బందయిన విషయం కూడా ! అయినా వినోద్ ఒక్కడిదే తప్పుకాదు. ఇందులో ప్రీతి తప్పు కూడా ఉంది కదా ...''

"ఎందుకు లేదు ? సగం తన తప్పే. వినోద్‌తో సంబంధం పెట్టుకునే ముందు పెళ్ళయినవాడు, పిల్లాడున్నాడని తెలుసుకదా. అన్నీ తెలిసి తన స్వలాభం కోసం, అతని ఆధారంగా పైకి ఎదగాలని, పేరు, డబ్బు సంపాదించుకోడానికి ఓ ఆలంబన కావాలని, అతని పంచన చేరింది. ఆ బంధం శాశ్వతం కావాలను కోవడం అత్యాశ. పెళ్ళిచేసుకోమని ఒత్తిడి చేసి, ప్రెగ్నెంట్ అయి అతన్ని బ్లాక్ మెయిల్ చేసి లొంగదీసుకోవాలన్న దురాశతో కక్షసాధింపు చేసి అతని మనసుకు దూరమైంది. వినోద్ నచ్చచెప్పినప్పుడైనా అంగీకరిస్తే ఆ బంధం కొన్నాళ్లయినా సాగేది. ఆ కృతజ్ఞతతో వినోద్ శాశ్వతంగా ఆమె బతుకుతెరువుకి లోటు లేకుండా ఏర్పాట్లు చేసేవాడేమో ? పోనీ, సుస్మిత

తండ్రి వచ్చి బెదిరించినప్పుడయినా భయపడి, ఇచ్చిన డబ్బు పుచ్చుకున్నా సరిపోయేది. ఇంటికెళ్లి వాళ్ల పరువు బజారున పడేసి, తను రోడ్డుమీద పడి, నానా గోల చేసింది. మొగుడి ఇలాంటి వ్యవహారాన్ని ఏ భార్య అయినా ఎందుకు సహిస్తుంది ? అందులోనూ డబ్బుతో వచ్చిన భార్య. ఒక్కగా నొక్క కూతురి భవిష్యత్తు ఆ తండ్రికి ముఖ్యం. అన్నివిధాల నష్టపోయింది ఆఖరికి ప్రీతేగదా ..." సీమ విరక్తిగా అంది.

"పాపం ... ఇలా ఎన్నాళ్లు గడుపుతుంది డబ్బు లేకుండా ..."

"ఏడాదిగా ఆమె తాగుడు, తిండికి ఆమె సంపాదించుకున్న కొన్ని లక్షల రూపాయలు ఖర్చయ్యాయి. ఇప్పుడు ఆమె దగ్గర చిల్లి గవ్వలేదు. చివరికి మాకు నెలకి ఇవ్వడానికి కూడా డబ్బు లేకపోయినా మేం భరించాం కొన్నాళ్లు. కానీ ఎవరైనా ఎన్నాళ్ళని పెట్టగలరు ? ఏమైనా ఎన్నాళ్ళని అలా పెట్టగలం ? అందుకే ముఖ్యంగా తనని తాగుడు మాన్పించి దారిలో పెట్టాలని అందరం కలిసి నిర్ణయించాం".

"ఏం చేశారు" ? కుతూహలంగా అడిగింది మహిమ.

"ఒకరోజు అందరం కూర్చుని గట్టిగా చివాట్లు పెట్టి, ఇలా పనీపాటా లేకుండా తాగి పడుకుంటే మాకేం అవసరం లేదు నీకు తిండిపెట్టడానికి" అని చాలా కఠినంగా హెచ్చరించాం. 'ఇంక ఏడుపు, విషాదపర్వం నుంచి లేచి పని మొదలుపెట్టు. లేకపోతే నీ దారి నువ్వు చూసుకో' అని చెప్పాం.

"నేనేం చేస్తాను, నాకెవరిస్తారు ఉద్యోగం ..." అంది దీనంగా.

'ముందా తాగుడు మాని, మామూలుగా తయారయి నాలుగు ఆఫీసులు తిరుగు ... ఏ పని దొరికితే అది చెయ్యి. ఎక్స్‌ట్రా వేషాలైనా వేసుకో. నీకు కావల్సింది డబ్బు. ప్రకటనల ఉద్యోగం కాకపోతే ఏదయినా కంపెనీలో చిన్న ఉద్యోగం అన్నా వెతుక్కో. ముందు మామూలుగా మునుపటిలా తయారవ్వు. నీకు అందం ఉంది. టాలెంట్ ఉంది. ఎవరో ఒకరు ముందుకు రావచ్చు. డబ్బుకి బేరాలాడకుండా ఎంతిస్తే అంత తీసుకో. నెలరోజులు చూస్తాం, లేకపోతే నీ పెట్టె బయటపారేస్తాం' అని బెదిరించాం.

'నాకెవరిస్తారు ఉద్యోగం ? ఇంత జరిగాక నాకు యాడ్ వరల్డ్‌లో ఛాన్సులెలా వస్తాయి' ? దిగులుగా అంది ప్రీతి. 'ఇంట్లో కూర్చుంటే అవకాశాలు వెతుక్కుంటూ రావు. నువ్వే అవకాశాలను వెతుక్కుంటూ వెళ్ళాలి' అని ప్రోత్సహించాం. బెదిరించాం. మొత్తానికి ఇంట్లోంచి పొమ్మంటామన్న భయంతో ఉదయమే లేచేది. వాక్, యోగా చేయడం మొదలెట్టింది. మొహం కాస్త తేటపడింది. నాలుగైదు తెలిసిన కంపెనీలు తిరిగివచ్చింది. ఏదైనా అవకాశముంటే పిలుస్తాం అన్నారుట. కాస్త దారిలో పడింది. వినోద్ మీద కక్షతో రగిలిపోతోంది. మనసులోంచి ముందు ఆ భావన తీస్తే తొందరగా మనిషి తేరుకుంటుంది అని, విన్న సంగతిని ఆమెకు చెప్పాం. వినోద్ పాత్ర ఏమీలేదని విన్న ప్రీతి ... "నిజంగానా ... నిజమేనా ..." అని తిరిగి నిజమే అయి ఉండచ్చు. నాకు తెలిసిన వినోద్ అంత నీచంగా ప్రవర్తించలేడు. ఇంత క్రూరంగా నా మీద ప్రతీకారం తీర్చుకోడు ..." అంది మనసు కాస్త తేటపడినట్లు.

తర్వాత నెల, రెండు నెలలకి ఒకటి రెండు చిన్నచిన్న ప్రకటనల కోసం, రైవల్ కంపెనీవాళ్లు ప్రీతిని పిలిచారు. వాళ్లకి జైన్ కంపెనీతో ఎప్పుడూ పోటీయే. ప్రీతి చేసిన ప్రకటనల పొటెన్సీ వాళ్లకు తెలుసు. ప్రీతిని తమవైపు తిప్పుకోవాలన్న అప్పటి ప్రయత్నాలు సాగలేదు. ఇప్పుడు తనంతట తాను వచ్చింది. కాకపోతే ఇప్పుడు డిమాండ్ చేసే స్థితిలో లేదు. చవకలో కొట్టేయచ్చు. వాళ్ల ఆలోచనలవి. ఏదో ఒకటి ప్రీతి కాస్త దారిలో పడింది. చేతిలో డబ్బు ఉన్నరోజు, చిన్న రమ్ బాటిల్ కొనుక్కుని వచ్చేది. ఉన్న అలవాటుని ఒకేసారి మానడం కష్టమవుతుందని మేం కూడా చూసీ చూడనట్టు ఊరుకునేవాళ్ళం. ఇదీ ప్రీతి కథ. మన ఆడపిల్లలు ఎంత జాగ్రత్తగా ఉండాలో ఇప్పుడు పాఠాలు చెపుతుంది అందరికీ" సీమ ముగించి, తలగడలు సర్దుకుని, గుడ్‌నైట్ చెప్పేసి పడుకుంది.

కానీ మహిమకి చాలాసేపటి వరకు నిద్రపట్టలేదు.

⁎ ⁎ ⁎

మహిమ పనిలో చేరి నెలరోజులయింది. ఆఫీసు వాతావరణం అలవాట యింది. అక్కడి పనితీరు కూడా తెలిసింది. ఇచ్చిన ప్రకటనలకి భావయుక్తమైన, క్రిస్పీ, స్పార్క్ ఉండేలా తయారుచేసే మహిమ కాప్షన్స్, విశాల్‌కి బాగా నచ్చేవి. ఆమెలో భావుకత, అది మాటల్లో చెప్పగలిగే నైపుణ్యం - ఆ యాడ్స్ ప్రేక్షకులను, పాఠకులను ఆకట్టుకుంటున్నట్టు రిపోర్ట్స్ రావడం కంపెనీకి అస్సెట్ అయింది. మహిమకి ఏదన్నా పని ఇస్తే అది పూర్తి చేసేవరకు ఆలోచనలను చెదరనీయని ఏకాగ్రత, పట్టుదల మీనన్‌కే అర్థమైంది. ఒకసారి విశాల్ దగ్గర ఆ ప్రసక్తి తెచ్చాడు. విశాల్ కూడా అంగీకరిస్తున్నట్టు తల ఊపాడు. ఈ మధ్య ఒకటి రెండు కొత్త ప్రకటనలకి ఆమె ఇచ్చిన కాప్షన్స్ వెరైటీగా ఆకట్టుకునేటట్టున్నాయి.

"గులాబీలాంటి సౌకుమార్యం మీ సొంతం చేసుకోవాలనే మీ కలని కలలా మిగలనివ్వద్దు. రోజా సబ్బుతో మీ కల నిజం చేసుకోండి".

"నోరు తెరిస్తే ముత్యాలు రాలుతాయేమో అనుకోవాలి, పళ్లు కాదు అందానికి భరోసా ఇచ్చే మా పౌడరు".

"మీ ఆరోగ్యం మాకు మహాభాగ్యం ... 'మా మూలికా లేహ్యం' మీ ఆయుష్షుకి గ్యారెంటీ ఇస్తుంది" లాంటివి కొత్తగా ఉండి, ప్రకటనలను ఇచ్చే కస్టమర్లను కూడా ఆకట్టుకున్నాయి. కస్టమర్లనే కాదు, చదివిన అందరినీ ...

విశాల్ ఆ రోజు ఇంట్లో ఉదయం కాఫీ తాగుతూ, మహిమ రాసిన ఓ కాప్షన్ గురించి చెప్తూ, అదే మాట అన్నాడు. "డాడీ ! మహిమ కాప్షన్స్ కొత్త రకంగా ప్రెజెంట్ చేస్తోంది. చూశారా ?" అన్నాడు పేపర్లో వచ్చిన ప్రకటన చూపిస్తూ.

అవినాష్ తల ఊపాడు. "అవును ఇంటర్వ్యూలోనే అనిపించింది పొటెన్సీ ఉన్న కాండిడేట్ అని" అన్నాడు అవినాష్.

"ఈ అమ్మాయికి క్రియేటివ్ సైడ్ కాక, విజువల్స్ సైడ్ కూడా ... అంటే కెమెరా ఏంగిల్స్, ప్లేస్‌మెంట్, షాట్ డివిజన్ వగైరాల మీద కూడా నాలెడ్జ్ ఉంది.

"ఎలా తెలుసు" ?

"మన చీరల యాడ్ షూట్ అప్పుడు మహిమ షూటింగ్ స్పాట్‌కి వెళ్ళడానికి పర్మిషన్ అడిగింది. వెళ్ళి మూడు నాలుగు షాట్స్ ఎలా తీస్తే బాగుంటాయో సూచించిందట. కెమెరామేన్ రఘు చెప్పాడు".

"అలాంటప్పుడు తనకు ఇంటరెస్ట్ ఉంటే చిన్న ఛాన్స్ ఇచ్చి చూద్దాం. డెరెక్షన్‌కి. మనమూ కొత్తవారిని తయారుచేసుకోవాలి గదా ! ఏదన్నా ఆమె ఇంటరెస్ట్ చూసిన యాడ్‌కి ఛాన్స్ ఇచ్చిచూడు" అన్నాడాయన.

తల ఊపాడు విశాల్.

ఇద్దరి సంభాషణ విన్న వినోద్ "ఎవరి గురించి మీరు మాట్లాడుతున్నారు"? కుతూహలంగా అడిగాడు పేపరులోంచి చూస్తూ.

విశాల్ తండ్రి వంక చూశాడు. అవినాష్ ముభావంగా "మహిమ అని క్రియేటివ్ అసిస్టెంట్" అన్నాడు. వినోద్ ఇదివరకటి వినోద్ కాదు. పూర్తిగా మారిపోయాడని ఆయనకి తెలుసు. అయినా మహిమ లాంటి అమ్మాయి ... అన్నివిధాల ఆకర్షించగల అమ్మాయి అతని కంటపడితే ... మళ్లీ ... లేదు లేదు ... వినోద్‌లో గత ఏడాది నుంచి చాలా మార్పు వచ్చిందని తెలిసినా, అవినాష్ ఆలోచనలు అలా సాగుతూనే ఉన్నాయి.

నిజంగానే వినోద్ ఇదివరకటివాడు కాదు. ఒక ఆరు నెలలు ... వినోద్ జీవచ్ఛవంలాగే బతికాడు. ప్రీతి చేసిన అవమానం తట్టుకోలేక, ఇంట్లో భార్య సూటిపోటి మాటలతో తూట్లు పొడుస్తుంటే, అడుగడుగునా హీనాతిహీనంగా కుటుంబ సభ్యుల ముందు, ఆఖరికి పనివాళ్ల ముందు కూడా తీసిపారేస్తుంటే, తల ఎత్తలేక, జవాబిచ్చే ధైర్యం లేక, తలదించుకుని వెళ్లిపోయేవాడు. రోజులో మూడొంతుల టైము ఆఫీసులో ఉంటూ నిద్ర సమయానికి దొంగలా వచ్చి తిని పడుకునే కొడుకుని చూస్తే తల్లి తండ్రి తల్లడిల్లిపోయేవారు. కొడుకు చేసింది తప్పే. కానీ ఇంతటి కఠిన శిక్షా దానికి ? ఓ పక్క ప్రీతి, రెండో పక్క

భార్య చేసిన అవమానంతో అతనికి స్త్రీ జాతి అంటేనే అసహ్యం పుట్టిందని, విరక్తి కలిగిదని అవినాష్‌కి తెలుసు. కాలమే గాయాన్ని మాన్పుతుందని ఊరుకోలేక, ఓ రోజు కొడుకు ఇంట్లో లేని సమయంలో కోడలికి నచ్చచెప్పేందుకు ప్రయత్నించాడు. కానీ మామగారు అని కూడా లేకుండా, 'ఇంత జరిగినా నన్నే అంటారా' అని దులిపి పారేసింది. వియ్యంకుడితో మాట్లాడి చూద్దాం అనిపించి మాట్లాడితే ... ఆయన, 'దాని బాధ మీకర్థం కాదా ? మీకు మీ కొడుకెంతో, నాకు నా కూతురూ అంతే. దానికి ఆ బిడ్డే గనుక లేకపోతే దాన్ని ఆ కొంపనుంచి ఎప్పుడో నా ఇంటికి తీసుకొచ్చేవాడిని' అని నోరు మూయించాడు. 'మీరు చేయలేని పని నేను చేసి నా కూతుర్ని కాపాడుకున్నాను. ఇంటిపెద్దగా మీరేం చేశారు ? అన్నీ తెలిసి ఊరుకున్నారు' అని వాతపెట్టాడు. కొడుకు ఇంక జన్మలో ఆడదానివైపు వెళ్లడని, ఎవరినీ నమ్మడని ఆయనకి నమ్మకం. ప్రీతి మీద దాడి, జైలు కబురు విన్న అందరూ ఇది ఎవరు చేశారో తెలియక, నింద తమ మీద పడడంతో ఆఫీసులో తలెత్తుకోలేని పరిస్థితి ఏర్పడింది. కాని నాలుగైదు రోజుల తరువాత, సుస్మిత ఆవేశపు క్షణాలలో నోరు జారి 'మా నాన్న నాకు అండగా నిలబడ్డారు కనుక న్యాయం జరిగింది. లేకపోతే మీరంతా చోద్యం చూస్తూ నిలబడేవారు' అన్న మాటతో నిజం తెలిసి విస్తుపోయారు. అంత అవమానభారంలోనూ వినోద్, ప్రీతికి జరిగిన పరాభవం విని విచలితుడయ్యాడు. ప్రీతి తొందరపడింది. తనమీద నమ్మకం పోగొట్టుకుని విచక్షణ కోల్పోయి ప్రవర్తించింది. ఇంత అరాచకంగా ఓ అమ్మాయిని శిక్షించడం, ఆఫీసులో అమ్మాయిలంతా అతన్ని బెరుగ్గా చూడడం తనను చూసి తప్పుకు తిరగడం, ఆఫీసు పనిమీద మాట్లాడినా బిక్కుబిక్కుమంటూ చూడడం ... అందరూ ఈ సంఘటనకి ఎంత భయపడ్డారో తెలిసి ఎవరికీ మొహం చూపలేక, షూటింగులప్పుడు సెట్‌మీదకి వెళ్లడం మానేశాడు. పూర్తయ్యాక విజువల్స్ తెప్పించుకుని చూసి మార్పులు చేర్పులు చెపుతూ వీలయినంతవరకు రూముకే పరిమితమయ్యాడు.

అలాంటి వినోద్ ఇన్నాళ్ల తరువాత మహిమ గురించి చెప్పుకుంటుంటే వివరం అడగడం, అవినాష్‌కే కాస్త ఆశ్చర్యం అనిపించింది.

❊ ❊ ❊

"సీమా, ఆఫీస్ స్టాఫ్‌లో సగం మంది అమ్మాయిలున్నారు. మనం పురుషుల మధ్య స్నేహబాంధవ్యాలతో, సహృద్భావ వాతావరణంలో, ఒక కుటుంబంలా వెలగలేమా ? స్త్రీ పురుషుల మధ్య స్నేహం ప్రేమలోకి దించుతుందనే రూలు మారదా ఎప్పటికీ ? ఆడపిల్లలు మగవారి ప్రేమ మాటలకి మోసపోతూనే ఉంటారా''? మహిమ కాస్త ఆవేశం, ఆవేదన కలిపి అంది ఆ రోజు ఆఫీసులో లంచ్ చేస్తున్నప్పుడు సీమ.

"నువ్వు ఇంకా అవే ఆలోచనల్లో ఉన్నావా ? ఫర్‌గెట్ ఇట్ ! కొన్నాళ్లు మేము ఎంత బాధపడ్డామో ... ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. కాలం గాయాన్ని మాన్పుతుంది. అలాగే ప్రకృతి నైజం మారదు కదా ! ఎంత చదివినా, ఉద్యోగా లేలినా, స్త్రీ పురుష ఆకర్షణ ఎలా పోతుంది ? కాస్త తెలివైన అమ్మాయిలు ఒకటి రెండుసార్లు అన్ని కోణాల నుంచి ఆలోచిస్తారు. చూడు మహిమ ... ముఖ్యంగా పరిస్థితులు అలా తోసుకొస్తాయి. ఒక మధ్యతరగతి అమ్మాయి ఉద్యోగం కోసమో, బాస్‌ని ఇంప్రెస్ చేసి లాభపడ్డానికో, పేరు తెచ్చుకుని నిలబడడానికో ... తమ అవసరాల కోసం కొంతమంది, ప్రేమను నమ్ముకుని కొంతమంది ... ఇలా రకరకాలుంటారు. అన్నింటికి మగవాళ్లనే తప్పుపట్టలేం. ఆకర్షించడం దీపం లక్షణం, వెలుగు దరిచేరడం భ్రమర లక్షణం. తప్పదు ... జీవితం అంటే ఇదే'' !

"అవుననుకో. కనీసం ఒకే ఆఫీసులో పనిచేస్తున్న మనలో మనమన్నా ఆకర్షణకు లొంగకుండా జాగ్రత్తలు తీసుకోలేమా ! ఈ ఫ్యాషన్ వరల్డ్, యాడ్ వరల్డ్‌లో ఉండే ఆకర్షణలకు, ప్రలోభాలకు లొంగకుండా ... మన బాస్‌లు మనల్ని

లొంగదీసుకునే ప్రయత్నాలు చేయకుండా ... మనం ఏమీ చేయలేమా" ? సాలోచనగా అన్నది మహిమ.

"ఏమిటి నీ వెర్రి ? మనం చెప్పందే తెలీదనా అందరికి. అన్నీ తెలిసే ఆ టైము వచ్చేసరికి ఎవరి కారణాలతో వారు మెట్లమీద జారుతుంటారు" సీమ విరక్తిగా అంది.

మహిమ మౌనం దాల్చింది. ఆమె ఏదో ఆలోచిస్తోందని అర్థమై "టేకిట్ ఈజీ మహీ ..." అంది టిఫిన్ బాక్స్ మూతపెడుతూ.

⁕ ⁕ ⁕

ఆ రోజు రాఖీపూర్ణిమ. మహిమ క్రియేటివ్ సెక్షన్‌లో ఉన్న అమ్మాయిలతో కలిసి వినోద్ రూమ్‌లోకి వెళ్లింది. అంతమంది అమ్మాయిలు తన గదిలోకి రావడం చూసి ఆశ్చర్యంగా, కాస్త గాభరాగా వినోద్ తడబడుతూ, "ఎస్ ... !" అన్నాడు. మహిమ ముందుకు వచ్చింది. "సార్, ఈ రోజు రాఖీ పండగ కదా ... మేమందరం మీకు రాఖీ కట్టాలని వచ్చాం. ఇఫ్ యూ పర్మిట్ ..." అంటూ హారతి పళ్లెం పట్టుకుంది. ఇంకో అమ్మాయి స్వీట్లు పట్టుకుని నిలబడింది. వినోద్ ముందు బిత్తరపోయాడు. తరువాత తేరుకుని రిలీఫ్‌గా ఫీలయి, అతని మొహంలో ఆనందం తొంగిచూసింది. "ఈజిట్ ! యూ ఆర్ ఆల్ వెల్‌కం ! రండి లోపలికి. అఫ్‌కోర్స్, నాకు చాలా సంతోషంగా ఉంది. మీరంతా ఇంత ఆప్యాయంగా వచ్చి రాఖీ కడతానంటే వద్దంటానా ..." అంటూ చేయిచాపాడు. "సార్ ! ఇక్కడ పనిచేస్తున్న అమ్మాయిలు, అబ్బాయిలు అంతా ఒక కుటుంబానికి చెందినవాళ్లం. 'జైన్స్ అండ్ సన్స్' కుటుంబం మనది. మా అందరికి సోదరులు మీరు. ఈ రోజు నుంచి మమ్మల్ని మీ స్వంతచెల్లెళ్లలా భావించమని కోరుతూ రాఖీ కడుతున్నాం" అంటూ అతనికి బొట్టు పెట్టి, హారతిచ్చి రాఖీ కట్టింది మహిమ అందరికంటే ముందుగా. నోట్లో చిన్న స్వీట్ ముక్క పెట్టింది. "థాంక్ యూ సార్" అన్న మహిమతో.

"రాఖీ కట్టి సార్ ఏమిటి" ? వినోద్ నవ్వుతూ చలాకీగా అన్నాడు. "ఓకే భయ్యా" అంది మహిమ చనువుగా. వినోద్ చటుక్కున జేబులో చేయిపెట్టి చేతికందిన ఐదువందల రూపాయల నోటు మహిమ చేతిలో పెట్టాడు.

"ఇది వద్దు సార్, మీ అభిమానం చాలు" మహిమ మొహమాటంగా అంది.

"ఇది మా సంప్రదాయం. రాఖీ కట్టిన చెల్లెలికి బహుమతి ఇవ్వక తప్పదు" అన్నాడు వినోద్. "థాంక్ యూ సార్" ! అంటూ మహిమ పక్కకు తప్పుకుని, "సీమ ... వరసగా అందరూ కట్టండి" అంది. ముప్పైమంది అమ్మాయిలు ముందుకు వచ్చి వినోద్‌కి రాఖీలు కట్టారు. జేబులో డబ్బు అయిపోతే 'జస్ట్ ఎ మినిట్' అంటూ ఫోన్‌చేసి అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ నుంచి డబ్బు తెప్పించాడు. అందరికీ సమంగా ఇచ్చాడు. "థాంక్‌యూ ! ఈ రోజు నాకు దేవుడు చాలా గొప్ప బహుమతి ఇచ్చాడు. ఇంతమంది చెల్లెళ్ళు దొరకడం నా అదృష్టం. ఇది ఎవరి ఆలోచనో గాని రియల్లీ ఐయామ్ గ్రేట్‌ఫుల్ టు ఆల్ ఆఫ్ యూ ..." నిజాయితీగా అన్నాడు.

"మహిమ ! మహిమకు వచ్చిన ఆలోచనే ఇది" ! అన్నారు అందరూ ముక్త కంఠంతో.

వినోద్ "ఓ ... మహిమ అంటే మీరేనా ? హ్యాపీ టు మీట్ యూ. మీ గురించి విన్నాను" అన్నాడు మహిమని ప్రశంసాపూర్వకంగా చూసి.

"ఇది మంచి ఆరంభం. ప్రతి డిపార్ట్‌మెంట్‌లో అమ్మాయిలు, అబ్బాయిలకు రాఖీ కట్టి అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని పెంచుదాం !" అన్నాడు వినోద్.

"థ్యాంక్యూ సార్ !" సంబరంగా అన్నారు. "ఓకే సార్ ! గుడ్ డే ..." అంటూ ఎవరి సీట్లవైపు వారు వెళ్లారు.

⁕ ⁕ ⁕

"భలే ఐడియా తట్టింది నీకు. ఇన్నాళ్ల వినోద్‌గారిని తప్పుకు తిరిగాం. అతని దృష్టిలో పడకూడదని. రాఖీ కట్టిన చేతిని పట్టుకునేటంత నీచానికి దిగజారడని ఆశిద్దాం" ఎవరో అమ్మాయి అంది.

"పాపం వినోద్ సార్‌ని చూస్తే నాకెందుకో జాలిగా అనిపించింది. మగాళ్లంతా ఎన్నో తప్పు పనులు చేసి హాయిగా ఎస్కేప్ అవుతారు గడుసుగా. ఇతని ఖర్మకాలి బతుకు బట్టబయలైంది. అందరిచేత ఛీ అనిపించుకున్నాడు. పాపం ఏడాదిగా అతను మొహం ఎత్తుకు తిరగడం మానేశాడు" సీమ సానుభూతిగా అంది.

మహిల తల ఊపి ... "అతన్ని చూస్తే అంత నీచుడు అనిపించడు. అతనున్న పరిస్థితుల్లో కక్కుర్తో, ప్రేమకు మొహం వాచో, ఏదో చిక్కుకున్నాడు. దానికి పర్యవసానం ఇంత కఠినంగా ఉంటుందని ఊహించి ఉండడు. ఏమయినా మనం మరీ అతన్ని విలన్‌లా చూడకూడదు" అంతా తలలు ఊపి పనిలో పడ్డారు.

※ ※ ※

రాత్రి డిన్నర్ చేస్తున్నప్పుడు వినోద్ "డాడీ, ఇవాళ నాకు ముప్ఫై మంది చెల్లెళ్లు దొరికారు తెలుసా" ! అన్నాడు.

"ఏమిటి" ? విశాల్ ఆశ్చర్యంగా అడిగాడు.

"అంతమంది చెల్లెళ్లు ఎక్కడనుంచి వచ్చారు ? మీ అమ్మ ఈ మాట వింటే, 'నాకు తెలియకుండా ఇంతమందిని ఎందరితో కన్నావు' ? అని నిలేసి, చెవులు మెలేస్తుంది" అవినాష్ జైన్ చిలిపిగా భార్యవంక చూస్తూ అన్నాడు. అనసూయ నవ్వుతూ "ఏమో బాబూ, ఏం చేసినా చేస్తారు తెరచాటున ఈ మగాళ్లు. నిజానిజాలు మీ డాడీకే తెలియాలి" అంది ఆవిడ హాస్యంగా. ఆ రోజు సుస్మిత అన్నగారికి రాఖీ కట్టడానికి పుట్టింటికి వెళ్లిన సందర్భంలో డైనింగ్

టేబుల్ దగ్గర మనసు విప్పి నవ్వుతూ మాట్లాడాడు వినోద్. చాలా రోజుల తర్వాత ఫ్రీగా అందరూ నవ్వుతూ మాట్లాడుకుంటున్నారు. "చెప్పన్నయ్యా ... ఎవరా చెల్లెళ్లు ? నేనూ ఉన్నాగా ఒక అన్నయ్యని, నా దగ్గరికి ఎవరూ రాలేదే" ? అన్నాడు విశాల్.

"ముప్పైమంది మన ఆఫీసు అమ్మాయిలు మహిమ ఆధ్వర్యంలో వచ్చి నాకు రాఖీ కట్టారు. నిజంగా నాకు చాలా సంతోషం అనిపించింది. ఎంతో రిలీఫ్‌గా అనిపించింది".

"నిజమా ! బాగుంది ఆలోచన. మహిమ ఐడియా అన్నమాట. అంటే నీకు ముందరికాళ్ల బంధం ! 'ఇకపై పిచ్చివేషాలు వద్దు - మమ్మల్ని అందరినీ చెల్లెళ్లలా చూడు' అని చెప్పకనే చెప్పడం అన్నమాట. అర్థమైందా ? 'బి ఎ గుడ్‌బాయ్' అని రాఖీతో బంధించారు" జైన్ చలాకీగా అన్నాడు. ఒక్క సెకను వినోద్ మొహం మలినమైంది. కాని తండ్రి మాటని స్పోర్టివ్‌గా తీసుకుని "కరెక్ట్ డాడీ. నా గురించి, నా లీలలు విని భయపడి అమ్మాయిలంతా కలిసి ప్లాన్ వేశారులా ఉంది. మహిమ డైరెక్షన్‌లో ..."

"నే చెప్పలే. ఆ అమ్మాయిలో డైరెక్టర్ పొటెన్సీ ఉందని. మరి నా దగ్గరికి ఎవరూ రాలేదే ..." విశాల్ ఆశ్చర్యంగా అన్నాడు.

"మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్‌వి కదా నువ్వు. అమ్మాయిలు లైన్ వేయడానికి అన్ని అర్హతలున్నవాడివి. అన్నయ్య ముద్ర ఎలా వేస్తారు ..." వినోద్ హాస్యంగా అన్నాడు.

"అలా అయితే ఫరవాలేదు. నేనో చేతకాని దద్దమ్మనని, వీడివల్ల ప్రమాదం లేదని భావించి వదిలేశారేమోనని భయపడ్డా ..." తనూ హాస్యంగా అన్నాడు విశాల్.

"వీడో ముసలాడులే అని నన్ను వదిలేసినట్టున్నారు" అవినాష్ కూడా హాస్యంగా అన్నాడు. "అంటే అమ్మాయిల కళ్ళు విశాల్ మీద ఉన్నట్టు ప్రూవ్

అయింది. విశాల్ ... ఇంక నీదే ఆలస్యం ... నీ మనసులో ఎవరైనా ఉంటే చెప్పు. నీ పెళ్ళి కూడా చేసేస్తే నా బాధ్యత తీరిపోతుంది'' అవినాష్ అన్నాడు.

"చాలా రోజులయింది ఇంట్లో పెళ్ళిసందడి జరిగి. విశాల్ పెళ్ళి బాగా చెయ్యాలి డాడీ కిందటి సారిలా కాకుండా ...'' అంటూ ఆగిపోయాడు వినోద్.

అందరు నిశ్శబ్దం అయ్యారు. ఒక్కసారిగా నవ్వుల వాతావరణం గంభీరమైంది. వినోద్ వంక సానుభూతిగా చూసి దోషిలా తలదించుకున్నాడు అవినాష్. 'గతిలేని అప్పటి పరిస్థితి ఇప్పుడు లేదు. మంచి అయినింటి అమ్మాయి. చదువు, సంస్కారం, మంచితనం ఉంటే చాలు ...' మనసులో అనుకున్నాడు.

"ఓకే విశాల్ ! మంచి అమ్మాయిని నేను చూడనా ? అమ్మాయిలో ఏం ఉండాలో నాకు బాగా తెలుసు. ఎక్స్‌పీరియెన్స్‌డ్ హజ్బెండ్‌వి కదా ...'' వినోద్ వాతావరణం తేలికపరుస్తూ అన్నాడు. "ఓకే అన్నయ్యా ... డన్'' అన్నాడు విశాల్ అన్నగారి భుజం తట్టి.

⁕ ⁕ ⁕

ఆ రోజు ఒక బాడీలోషన్ షూట్ ప్రోగ్రాం ఉంది. డైరెక్టర్ ప్రమోద్ కారు కిందటి రాత్రి యాక్సిడెంట్‌కి గురైంది. ప్రమోద్‌కి పెద్ద దెబ్బలు తగలకపోయినా, కుడిచెయ్యి విరిగి ఆస్పత్రికి వెళ్లిన పరిస్థితి ఎదురయింది. షూటింగ్ సెట్, నటులు అందరూ బుక్ అయ్యారు. కాన్సిల్ చేస్తే షెడ్యూల్ తేదీ మారిపోవడం, నష్టం జరుగుతుంది. ఇంకెవరికన్నా ఈ పని అప్పగించాలి. షూటింగ్ ఆగడానికి వీలులేదు. విశాల్‌కి హఠాత్తుగా మహిమ గుర్తుకు వచ్చింది. ఒక ఛాన్స్ ఇచ్చి ప్రయత్నించు అన్న తండ్రి మాటలు గుర్తుకు వచ్చాయి.

"మహిమా, ఈ ప్రాజెక్ట్‌ని డైరెక్ట్ చేసే ఛాన్సు నీకిద్దామనుకుంటున్నాను. కెన్ యు హేండిల్ ఇట్ ...'' పరిస్థితి వివరించి, ప్రొడక్షన్ గురించి చెప్పాడు.

అది మహిమ రాసిన సబ్జెక్ట్ గనుక, అప్పటికే ఆమెకు దాని వివరాలు తెలుసు గనుక తను సులువుగా హాండిల్ చెయ్యగలదని అతని నమ్మకం.

మహిమ 'నేనా' ? అంటూ గాభరాపడలేదు. తడబడలేదు. "ఐ విల్ ట్రై మై బెస్ట్ సార్ ..." ఆత్మవిశ్వాసంతో ఆమె చెప్పిన జవాబుతో అతనికి ఆమెపట్ల భరోసా చిక్కింది. సెట్, యాక్టర్స్ అంతా రెడీగా ఉంది కనుక ఒక్కసారి వెళ్లి చూసుకుని ప్రొసీడ్ అవుతా" అంది మహిమ నిబ్బరంగా. "దెన్ గో ఎహెడ్ ! ఏదన్నా సాయం కావాలంటే కిశోర్ అనే అసిస్టెంట్ డైరెక్టరుని అడగండి" అన్నాడు.

మహిమ డైరక్షన్‌లో తయారయిన యాడ్‌ని ఫైనల్ చేసేముందు ... అవినాష్, వినోద్, విశాల్ ముగ్గురూ ఆ యాడ్ సి.డి. చూశారు. అందమైన అమ్మాయి తెల్లటి పల్చటి నైట్‌డ్రస్‌లో, అలా పక్కమీద నుంచి ఒళ్ళు విరుచుకుంటూ లేచి, చుట్టూ పరుచుకున్న పరిమళం ఎక్కడిదన్నట్టు ఆఘ్రాణిస్తూ, అలా ట్రాన్స్‌లో ఉన్నట్టు, గాలిలో తేలిపోతున్నట్టు దేవకన్యలా నడుస్తూ, ఓ పూలతోటలోకి వెళ్లిపోతుంది. అక్కడ జలజల చెట్ల నించి రాలుతున్న పూలన్నీ కుప్పగా పోగయి, ఆ కుప్పలో పూవులన్నీ వరుసగా చక్కటి అందమైన సీసాలోకి జారిపోతాయి. ఆ సువాసన అక్కడిది అన్నట్టు ఆ బాడీలోషన్ పేరు గల సీసా అమ్మాయి చేతిలోకి వస్తుంది. ఆ అమ్మాయి ఆ సువాసనను ఆఘ్రాణించి, అలా ట్రాన్స్‌లోంచి బయటికి వచ్చి ఆనందంగా సీసాను చూస్తుంది. అంటే ఆ బాడీలోషన్ చక్కటి, సున్నితమైన, సువాసనగల పూలతో చేసిందని, అలాంటి సౌకుమార్యమైన చర్మసౌందర్యాన్ని అందిస్తుందన్న భావంతో తీశారు. అవుట్ డోర్ షూటింగ్‌తో పనిలేకుండానే, ఇండోర్ షూటింగ్‌లోనే ఆ యాడ్‌ని తయారుచేశారు. బెడ్‌రూమ్ సీన్‌ని, గార్డెన్ సీన్‌ని రీ మిక్సింగ్ చేశారు. అనేక కొత్తకొత్త టెక్నిక్‌లు జతచేసి, మిక్స్‌చేసే మెళుకువలున్న ఈ రోజుల్లో అలాంటి సీన్లు యూనిట్, యాక్టర్లు వెళ్లనక్కర లేకుండానే, కంప్యూటర్ ముందు కూర్చుని తయారుచేస్తారు. మహిమ ఆ సీన్లలో చూపిన

టెక్నిక్, హీరోయిన్ భావప్రకటనలు ... సీను మొత్తం కనులవిందుగా, అందంగా తయారయిన ఆ యాడ్ చూసి "గ్రేట్" అన్నాడు అందరికంటే ముందు విశాల్. "గుడ్ వర్క్ ... ఈ అమ్మాయిలో టాలెంట్ ఉంది. తనను తాను మరోసారి ప్రూఫ్ చేసుకుంది" అవినాష్ అన్నాడు.

"ఐ థింక్ ... ఈ అమ్మాయిని ప్రొడక్షన్ సైడ్, యాడ్ డైరెక్టర్‌గా తీసుకో వచ్చనిపిస్తోంది" వినోద్ అన్నాడు.

"లెటజ్ వెయిట్ ఫర్ సమ్ మోర్ టైమ్ ! అసలు తన అభిప్రాయం తెలుసు కోవాలి గదా ..." అవినాష్ జైన్ అన్నాడు.

✳ ✳ ✳

రెండో యాడ్‌లో నటించే అవకాశం ఆరతికి రావడంతో, అదీ మహిమ డైరెక్షన్‌లో ప్రెజెంట్ చేయడంతో, మహిమ పట్ల అందరికి గౌరవం, అభిమానం పెరిగింది. ఆమె తమందరిలో ప్రత్యేకత ఉన్న వ్యక్తిగా గుర్తించి మహిమకి ఓ ప్రత్యేక స్థానం తెలీకుండానే ఇచ్చేశారు అమ్మాయిలు. తన ఆనందాన్ని, అభిమానాన్ని, కృతజ్ఞతలు తెలియపరుచుకోడానికి ఆరతి, అందరికి హోటల్లో ట్రీట్ ఇచ్చింది.

"ఇంకేం ... మన ఆరతి గొప్ప నటి, మన మహిమ గొప్ప దర్శకురాలు అయిపోయారు. ఉయ్ ఆర్ ప్రౌడ్ ఆఫ్ యూ బోత్" అంతా అభినందించారు.

"ఏయ్ మహిమా ! నీకింత అందమైన ఆలోచనలు. ఆలోచనలకి సరిపోయే మాటలు ఎలా తడతాయి ..." సీమ మెచ్చుకోలుగా అడిగింది.

"ఏమిటో మరి ... అదేనేమో క్రియేటివిటీ అంటే ! నాకు తెలియకుండానే, ఒక ప్రోడక్ట్ గురించి ఆలోచించగానే ఫ్లాష్‌లా కళ్ళముందు కొన్ని దృశ్యాలు కనిపిస్తాయి. అలా ఏకాగ్రతతో దాని గురించే ఆలోచిస్తుంటే ఇంకా కొన్నికొన్ని దృశ్యాలు సినిమాలా కదలాడతాయి. అవన్నీ గుదిగుచ్చితే కొన్ని సీన్లు కలిపి నే

చెప్పాల్సిందిదే' అనిపిస్తుంది. ఆ దృశ్యాన్ని మాటల్లోకి అనువదించడమే స్క్రీన్‌ప్లే! తెరపై ఎలా చూపాలి, పేపర్‌లో ప్రకటన ద్వారా ఎలా చెప్పాలి అనుకున్నప్పుడు మంచి మాటలు పది రకాలుగా ఆలోచిస్తా. అన్నింటిలోకి మంచివి ఏరుకోవడమే. అంటే నే చెప్పదలచిందానికి సరి అయిన మాట పడిందా, సరి అయిన రూపు వచ్చిందా ? అన్నదానికి కంప్యూటర్ ముందు కూర్చుని పర్ముటేషన్స్, కాంబినేషన్స్ సెట్ చేసుకుంటూ పోతే ... ఆఖరికి ఓ రూపు తయారై నాకు తృప్తినిచ్చాక ఫైనల్ వెర్షన్ తయారుచేస్తా ...'' తాను ప్రెజెంట్ చేసే పద్ధతి వివరించింది.

“గ్రేట్ !'' అన్నారంతా చప్పట్లు కొట్టి.

“నా యాక్షన్ ఎలా ఉందో చెప్పలేదు మీరెవరూ. నన్ను పొగడలేదు'' అలిగినట్టు అంది ఆరతి.

“మొదటి యాడ్ కంటే ఇందులో ఎక్కువ కాన్ఫిడెన్స్ కనిపించింది. అన్ని యాంగిల్స్‌లో అందంగా కనిపించావు'' మహిమ నిజాయితీగా అంది.

“ఎగైన్ దట్ క్రెడిట్ గోస్ టు యూ'' బుంగమూతి పెట్టింది.

“ఇది సక్సెస్ మీట్ అనే గదా అందరం పార్టీ చేసుకుంటున్నాం. మహిమ కొంగు వదలకు'' మంగళ నవ్వుతూ అంది.

''నాదేముంది ... ప్రోడక్ట్ అవసరాన్ని బట్టి యాక్టర్స్‌ని వాళ్లే చూసుకుంటారు. రాయడం వరకే నావంతు''.

“ఏమో ! రేపు డైరెక్టర్ ఛాన్స్ ఇస్తారేమో ఈ వర్క్ సక్సెస్ అయిందని'' ! అంది సీమ.

సీమ అన్నట్టే, మర్నాడు విశాల్ రూముకి పిలిచాడు. “కంగ్రాట్స్ మహిమ! మీరు డైరెక్ట్ చేసిన ప్రోడక్ట్ సక్సెస్ అయింది. డాడీ కూడా మెచ్చుకున్నారు. మీకు డైరెక్షన్ సైడ్ ఇంత పట్టు ఉందని మాకు తెలియలేదు. ఎనీహౌ ఉయ్ ఆర్ ఆల్ హ్యాపీ అండ్ ప్రౌడాఫ్ యూ ! మీకు డైరెక్షన్ సైడ్ ఇంటరెస్ట్ ఉందంటే, డాడీ మిమ్మల్ని విజువల్స్ సెక్షన్‌కి ప్రమోట్ చేయమన్నారు. ఈజిట్ ఓకే విత్

యూ"! విశాల్ మర్యాదగా అడిగాడు. ఒక్కక్షణం మహిమకి ఏం జవాబివ్వాలో తెలియలేదు.

'జాయిన్ అయిన రెండు నెలలకే డైరెక్షన్ వైపు అంటే ... ఇంతకంటే జీతం బాగుంటుంది. తొందరగా పేరు తెచ్చుకునే అవకాశం. క్రియేటివ్ సెక్షన్‌లో పేరు బయటికి తెలియదు. వెనకాల పేపర్ వర్క్ అంతా తమదే అయినా, డైరెక్ట్ చేసినవారికి వచ్చిన పేరు రాదు. ప్రకటనల యాడ్‌లో కూడా తయారుచేసిన వారి పేరు ఉండదు. ఇది తనకు దొరికిన గొప్ప అదృష్టం. కాని, విజువల్స్ అంటే ప్రలోభాలు, అవకాశాలు అందిపుచ్చుకోడానికి, బాస్‌లను ఇంప్రెస్ చేసేందుకు తంటాలుపడే నటీనటులు, డైరెక్టర్లు ... ఈ వాతావరణంలో తను ఇమడగలదా'?

"ఏమిటి ఆలోచిస్తున్నారు ? మీ క్రియేటివిటీని, మీ ఆలోచనని మీరే డైరెక్ట్ చేసుకుని ప్రజెంట్ చేయడం ... ఇటీజ్ ఏన్ గోల్డెన్ ఆపర్చునిటీ ఫర్‌యూ"!

"ఎస్ ! కాని, ఎక్స్‌పీరియన్స్ అంతగా లేదు గదా అని భయపడుతున్నాను" ఏదో ఒక జవాబివ్వాలి గదా అని అంది మహిమ.

"ఐ నో, యూ ఆర్ కాన్ఫిడెంట్ ? ఒకటి రెండుసార్లు చేస్తే అదే అలవాటవుతుంది. మీకు హెల్ప్ చేయడానికి మిగతా స్టాఫ్ ఉంటారు".

"థాంక్స్ సార్ ! మీ నమ్మకాన్ని నిలబెట్టే ప్రయత్నం చేస్తాను. నాకింత ప్రాముఖ్యం ఇచ్చినందుకు ఈ కంపెనీకి నా చేతనైనంత సపోర్ట్ ఇస్తాను".

ఆ రోజు ఆఫీసులో మహిమ అదృష్టానికి ఆనందించినవారూ, తమకన్నా జూనియర్‌కి మంచి పోస్టు వచ్చిందని లోలోన అసూయపడ్డవారూ ఉన్నారు.

ఇంటికి వెడుతూ స్వీట్స్, పకోడీలు ప్యాక్ చేయించి తీసుకెళ్లింది మహిమ. అమ్మాయిలంతా ఆటలు, పాటలతో సందడి చేస్తూ అభినందనలు అందించారు మహిమకి.

※ ※ ※

ఆరోజు క్రియేటివ్ డిపార్ట్‌మెంట్ నుండి ప్రొడక్షన్ డిపార్ట్‌మెంట్‌కి మారింది మహిమ. డిపార్ట్‌మెంట్ హెడ్ వినోద్ కాబట్టి మర్యాదపూర్వకంగా అతన్ని కలిసింది.

"ఓ ! వెల్‌కం మహిమా ! యూ ఆర్ మోస్ట్ వెల్‌కం ! ఐ యామ్ హ్యాపీ టు హావ్ యూ అండర్ మి ! నాకు విజువల్స్ అంటే ఎంతో ఇష్టం. దీన్లో మీరూ నేనూ కలిసి పనిచేసి, మంచి రిజల్ట్స్ సాధిద్దాం. ప్లీజ్ బి సీటెడ్" మర్యాదగా లేచి నిలుచుని విష్ చేసి, సీటు చూపి కూర్చోమన్నాడు. తరువాత కాస్త తటపటాయిస్తూ, "మహిమా! ఆ రోజు మీరంతా వచ్చి అలా 'రాఖీ' కట్టడం నాకెంత మేలు చేసిందో చెప్పలేను. మీరిక్కడికి రాకముందు జరిగిన దురదృష్ట సంఘటలన్నీ మీకు అమ్మాయిలంతా చెప్పే ఉంటారు. నా గురించి అమ్మాయిలేర్పరుచుకున్న అభిప్రాయాన్ని రాఖీ కట్టడం ద్వారా కొంత వరకు మీరు చెరిపేశారు. దానికి మీకు నేనెంతో ఋణపడి ఉంటాను. గత ఏడాది నుంచి తప్పుచేసినవాడిలా, దోషిలా ఎవరి మొహం చూడలేకపోయాను". విచలితుడై అంటున్న అతన్ని చూసి, "నో సార్ ! ప్లీజ్ ! అది మీరన్నట్టు దురదృష్ట సంఘటన. దానికి మీరెంత బాధ్యులో ప్రీతి కూడా అంతే బాధ్యురాలు. తనూ తొందర పడింది. ఆవేశపడింది. దానికి మూల్యం చెల్లించింది. తనూ, మీరూ ఇద్దరూ శిక్ష అనుభవించారు. ఇంక అది ఓ పీడకల అనుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించాలి సార్. క్షమించండి. చనువు తీసుకుంటు న్నందుకు" అంది.

"నో నో ! నాకెంతో మనశ్శాంతిగా ఉందిప్పుడు. నిజం చెప్పనా మహిమ. ఆ రోజు నిన్ను ... సారీ ... మీరు అనబుద్ధి వేయడం లేదు. ఆ రోజు మొదటిసారి నా రూములోకి రాఖీ కట్టడానికి మీరు చెప్పినప్పుడు నాకిలాంటి చెల్లెలుంటే ఎంత బాగుండును అనుకున్నాను. మీ ఆలోచన, మీ చొరవ, ఇంప్రెస్ చేసే ప్రవర్తన, మాటలు, పనిలో మీ సామర్థ్యం ... అన్నీ చూశాక నిజంగా నాకు ఇలాంటి చెల్లెలే కావాలనిపించింది. ప్లీజ్ నన్ను అన్నయ్యగా భావించు ..." చాలా ఎమోషనల్‌గా అన్నాడు.

మహిమ కూడా వినోద్‌ని చూసి ఎందుకో తెలియకుండానే ఎమోషనల్ అయింది.

"సార్ ! నిజం చెప్పనా ... మీ గురించి విన్నాక, జరిగిందంతా తెలిశాక, మిమ్మల్ని చూశాక ... మీ పట్ల కోపం, ఏహ్యత బదులు జాలి అనిపించింది. ఆ పరిస్థితిలో మీరు పడిన అవమానం, క్షోభ నాకు అర్థమైంది. పరిస్థితుల ప్రాబల్యంతో మీరు అనుభవించిన బాధ, మీ నిస్సహాయత అర్థం అయింది".

"మహిమా థాంక్స్ ! నిజంగా నన్నిలా అర్థం చేసుకుంటావని అనుకోలేదు. నా పట్ల ఇంత సానుభూతి చూపి, నాలుగు మంచిమాటలు చెప్పే మనిషి ఉంటారని ఎప్పుడూ అనుకోలేదు. రియల్లీ ... నాకివాళ మనసువిప్పి మాట్లాడగల మనిషి దొరికినందుకు ఎంతో ఆనందంగా ఉంది. గుండెలమీద నుంచి పెద్ద భారం దిగిన ఫీలింగ్. మన పరిచయం అతిస్వల్పం. అయినా నా ఫీలింగ్స్‌ని ఇంత బాగా అర్థం చేసుకున్నందుకు థాంక్స్. ఇంత మంచి సోదరినిచ్చినందుకు దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకుంటాను" చెమర్చిన కళ్ళను కర్చీఫ్‌తో తుడుచుకున్నాడు.

"సార్ ! మీరు నన్ను సోదరిగా భావించారు కాబట్టి, ఆ చనువుతో, మీరు అర్థం చేసుకుంటారని ఓ మాట చెబుతాను. ఒక స్త్రీ మనోభావాలు, అందులో ఒక భార్య మనోభావాలు ఎలా ఉంటాయో మీకు తెలియదు సార్. మీరు ఎంతసేపూ మీవైపునుంచే ఆలోచిస్తున్నారు. మీ భార్య గురించి నాకేం తెలియదు. ఒక స్త్రీగా మాత్రం ఆమె ఆలోచన ఎలా ఉంటుందని ఆలోచించి నేను చెపుతున్నాను. మీరు ఆమెను కేవలం డబ్బుకోసం పెళ్ళిచేసుకున్నారు. అదేగదా నిజం. అది ఆమెకీ తెలుసు. తను అందగత్తె కాదని, కేవలం తండ్రి దగ్గర డబ్బుండబట్టి తన డబ్బు కోసమే ఈ పెళ్ళి జరిగిందన్న ఆమె భావాన్ని మీరెప్పుడయినా అర్థం చేసుకున్నారా? మీ కోణం నుంచే ఆలోచించారు. ఆవిడ మనోభావాలు ఎలా ఉంటాయన్నది ఎప్పుడన్నా మీరు పట్టించుకున్నారా ? పెళ్ళయితే చేసుకున్నారు కానీ, ఆమెలో తను అందగత్తె కాదన్న అభద్రతా

భావాన్ని మీరు ఒక్కసారన్నా, కనీసం మాటల్లో కాకపోయినా చేతల్లోనయినా తొలగించే ప్రయత్నం చేశారా ? భర్తగా కాస్త ప్రేమ, అనురాగం చూపారా ? ఇష్టంగా మాట్లాడారా ? ప్రేమగా దగ్గరకి తీసుకున్నారా? ఏదో కొత్తరోజుల్లో ఆ అవసరం కొద్ది కొన్నాళ్ళు కాపురం చేశారు. అబ్బాయి పుట్టాడు. ఆ తర్వాత పిల్లాడి తల్లిగానైనా ఆమెపట్ల అభిమానం కలిగిందా ? నిజాయతీగా మీకు మీరే జవాబు చెప్పుకోండి''. మహిమ చెప్తున్న తీరుకి అలా తెల్లబోయి చూస్తూ విన్నాడు వినోద్.

"సార్, అందంగా లేనంత మాత్రాన తనకి మనసుండదా ? భర్త ఒకప్పుడు కాకపోతే ఒకప్పుడన్నా, ఏ చిన్న విషయంలోనన్నా తన గురించి కాస్త ప్రేమగా మాట్లాడాలనుకోదా ? నా డబ్బు తింటూ నన్ను నిర్లక్ష్యం చేస్తున్నాడు అన్న అహం ఆమెలో తలెత్తదా ? అసలే డబ్బుతో వచ్చానన్న అహంకారం ఉన్న మనిషికి 'తనకు భర్త గుర్తింపు ఇవ్వడు' అన్న కోపం ఉండి, అది మీ పట్ల మరింత విముఖత పెంచి, అడుగడుగునా తన దర్పం ప్రదర్శించి మిమ్మల్ని అదుపులో పెట్టుకుని మీమీద పైచేయి సాధించి, మిమ్మల్ని కంట్రోల్ చేసి కక్షసాధిస్తూ, మీ చర్యకి ప్రతిచర్యగా ఆమె మరింత అహంభావిగా తయారయిందనిపిస్తోంది. అదే మీరు కాస్త లోపల లేకపోయినా బయటికన్నా ప్రేమ, గౌరవం, అభిమానం చూపే చర్యలు నలుగురిలోనన్నా చూపిస్తే ఆమెలో కసి తగ్గేదేమో. పెళ్ళి చేసుకోవడం నా ఖర్మ అన్నట్టు, మీరు అయిష్టతని స్పష్టంగా చూపిస్తే ఏ స్త్రీ అవమానంగా భావించదు. ఆ అవమానం నుంచి పుట్టుకొచ్చిన కక్షసాధింపు చర్యలవల్ల మీ వివాహ జీవితం పాడయింది. సార్, ఇప్పటికీ మించిపోలేదు. మీ ప్రవర్తన ద్వారా ఆమెను మీరు అర్థం చేసుకున్నట్టు కొద్దిగా దయగా, సానుభూతిగా, ప్రేమగా పలకరిస్తూ ఉండి, 'భర్త తనను పట్టించుకుంటున్నాడు, కాస్త మారాడు' అని ఆమె సంతోషించి తన ఆధిక్యతను ప్రదర్శించడం తగ్గించుకుని కాస్తంత సామరస్యంగా మారచ్చు సార్! ఆడది కాస్తంత ప్రేమకే బానిస అవుతుంది. ప్రేమ దక్కకపోతే ఆమెలో రాక్షసత్వం

చోటు చేసుకుంటుంది. ప్రీతి కూడా అంతే ! మీరు తనకు దక్కరన్న అభద్రతకి లోనై, ప్రేమతో లొంగదీసుకోవాల్సింది పోయి, సాధించి బెదిరించి లొంగదీసుకోవాలనుకోవడం ఆమె చేసిన పొరపాటు. మీ భార్యకి మీ ఇతర స్త్రీ సంబంధాలు తెలియనంతవరకు, ఏదో భార్యగా, తల్లిగా, కోడలిగా ఆ ఇంట్లో తన స్థానం దక్కించుకుని, మీ ప్రేమ లేకపోయినా సర్దుకుంది. ఎప్పుడయితే భర్త జీవితంలో ఇంకో స్త్రీ తన స్థానంలో ఉందని తెలిసిందో, అదీ ప్రీతికోసం మీరు చేసిన ఏర్పాట్లు, ఆమె గర్భవతి అని తెలియడంతో, ఆమే కాదు, ఏ స్త్రీ తట్టుకోలేదు. మామూలు భార్య అయితే ఏడ్చి, చస్తానని, పోతానని బెదిరించేది. రకరకాలుగా భయపెట్టేది. కానీ ఆమెకి కొండంత అండగా తండ్రి, డబ్బుతో ఏదన్నా చేయగల తండ్రి ప్రేమ ఉన్నాయి. ఆయన కార్యదక్షతతో ప్రీతిని నామరూపాలు లేకుండా నల్లిలా నేలరాసింది. సమాజంలో తలెత్తుకోకుండా మీ మీద పగతీర్చుకుంది.

"అవును మహిమా ... నేను తప్పు చేశాను. తనకి ద్రోహం చేశాను. దానికి నన్నింతలా దెబ్బతీసింది. నాకంటే కూడా ప్రీతిని ఆమె అంత నిర్దాక్షిణ్యంగా, క్రూరంగా అణచివేయడం ... ప్రీతి తప్పుచేసింది. దానికి నేను కారణం. ఒక స్త్రీ అయి, అంత నిర్దాక్షిణ్యంగా అంత బాధకి గురిచేయడం నా బాధని మరింత పెంచింది. తనని బెదిరించి పొమ్మనచ్చు. ఏదో డబ్బు ముట్టచెప్పి మళ్ళీ ఇటు రాకుండా కట్టుదిట్టం చెయ్యచ్చు. ఎంతయినా నేనూ మనిషినే. ఆమె పట్ల నాకు ప్రేమలేదు గాని ఆమెను నేను ఏనాడూ అవమానపర్చలేదు. నన్ను అందరి ముందు అంత దిగజార్చింది. అలాంటి భార్యని నేను ఎలా క్షమించాలి ...'' వ్యధగా అన్నాడు.

"తప్పదు. తప్పు మీది, చక్కదిద్దుకోవాల్సింది కూడా మీరే. మీ ముందు ఇంకా ఎంతో జీవితం ఉంది. ఇంత అశాంతిగా, సుఖం, ఆనందం అన్నది లేకుండా, ఇంట్లో భార్యతో సామరస్యం అన్నది లేకుండా ఎన్నాళ్లు గడుపుతారు. దొరకని దానికోసం అర్రులు చాచేకంటే దొరికినదానిలో ఆనందం వెతుక్కోవడం

తెలివైన వాళ్లు చేసే పని వినోద్‌గారు. గతం మర్చిపోండి. కొత్త జీవితానికి తెరలేపండి. మీవైపు నుంచి దిద్దుబాటు చర్యలు చేపట్టి చూడండి. తప్పక ఆవిడ కూడా ఒక అడుగు ముందుకు వేస్తారని నా నమ్మకం. జీవితంలో బాహ్యరూపానికే కాదు, అంతరంగానికి కూడా ప్రాముఖ్యత ఇవ్వండి. ప్రేమకి లొంగని మనిషి ఉండడు''.

వినోద్ నిట్టూర్చాడు. "నిజమేనేమో ! ఎంతసేపూ నేనే నష్టపోయాననుకుని సెల్ఫ్ పిటీలో మునిగిపోయాను. ప్రేమరాహిత్యంతో బతుకుతూ, ప్రేమకోసం అలమటిస్తూ, ఆమె వైపు నుంచి ఆలోచించలేదు. అసలు ఇలా ఆలోచించాలన్నదే నాకు తట్టలేదు. మహిమా ! నువ్వు ఇంకాస్త ముందు, నీతో ఇంకొంచెం ముందు పరిచయం అయివుంటే ... నాకిలా కన్విన్సింగ్‌గా చెప్పగలిగే ఓ స్నేహితుడో, స్నేహితురాలో ఉండి ఉంటే ... ఇలా ధైర్యం చెప్పి ఉంటే ...'' విచలితుడై అన్నాడు.

"సార్, ఒక్క వారం పదిరోజులు మీలో కాస్త మార్పువచ్చి ఆమెను భార్యగా ప్రేమిస్తున్నట్టు ఆమెకు నమ్మకం కలిగించే ప్రయత్నం చెయ్యండి''.

వినోద్ తల ఊపాడు. "థాంక్స్ మహిమా ...'' అన్నాడు మనస్ఫూర్తిగా.

⁕ ⁕ ⁕

ఆరోజు వినోద్ ఇంటికి వెళ్ళేసరికి, గదిలో నైట్‌గౌనులో మంచం మీద పడుకుని కనిపించింది సుస్మిత. ఆ టైములో ఆమె అలా పడుకోవడం చూసి, అప్రయత్నంగానే, మూలుగుతున్న ఆమె మీద చెయ్యివేసి "ఏంటి పడుకున్నావు? ఒంట్లో బాగోలేదా'' ? అని అడిగాడు. ఒళ్ళు కాస్త వెచ్చగా తగిలి, "ఏమిటి జ్వరం వచ్చిందా'' ? అని అడుగుతున్న భర్తని సుస్మిత నమ్మలేనట్టు చూసింది. "జ్వరం ఉన్నట్టుంది. టాబ్లెట్ వేసుకున్నావా'' ? మళ్లీ అడిగాడు. విస్తుపోతూ లేదన్నట్టు తల అడ్డంగా తిప్పింది. అతను మెడికల్ కిట్ తీసి "తలనొప్పి, ఒళ్ళునొప్పులు కూడా ఉన్నాయా'' ? అంటూ అడిగేసరికి తల ఆడించింది. అతను టాబ్లెట్ తీసి, మంచినీళ్ళ గ్లాసు అందించాడు. ఏదో కలలో చూస్తూ

మాత్రలు వేసుకుని నీళ్ల తాగింది. "వేడిగా టీ తెమ్మంటానుండు" అన్నాడు. ఆ మాత్రానికే ఆమె కళ్ళలో తడి. చటుక్కున కళ్ళు మూసుకుంది. గదిలోంచి బయటికి వచ్చి, డ్రాయింగ్ రూములో టీ.వి. చూస్తున్న తల్లితో "అమ్మా, సుస్మితకి ఒంట్లో సరిగ్గా లేనట్టుంది. జ్వరం కూడా ఉన్నట్టుంది" అన్నాడు.

"మధ్యాహ్నం భోజనానికి రమ్మంటే తిననంది. ఏమడిగినా జవాబు చెప్పలేదు. పాలు పంపించాను గదిలోకి. చెప్పకపోతే ఎలా" ? అందావిడ.

"సరితా ..." అంటూ పనమ్మాయిని పిలిచి "వేడిగా టీ చేసి అమ్మగారికి ఇచ్చిరా" అన్నాడు. సరిత కాస్త వింతగా చూస్తూ, తల ఊపి వంటింట్లోకి వెళ్లింది. అనసూయ కొడుకువంక ఒకసారి చూసి ఊరుకుంది. ప్రీతి ఘటన తర్వాత వినోద్‌ని పలకరించడానికి కూడా అందరూ భయపడేవారు. ఇవాళ కొడుకు భార్య గురించి పట్టించుకోవడం చూసి ఆమెకి ఆశ్చర్యం కలిగింది.

ఆ రాత్రి టెంపరేచర్ నూరు లోపలే ఉండడం చూసి మరో మాత్ర ఇచ్చి "ఇవ్వాల్టికి బ్రెడ్, పాలు తీసుకో. తగ్గకపోతే రేపు డాక్టర్‌ని పిలుస్తా" అన్నాడు. అయోమయంగా చూస్తుండిపోయింది సుస్మిత. కొడుకు రాగానే హోమ్‌వర్క్ చేశాడో లేదో కనుక్కుని, డైనింగ్ టేబుల్ దగ్గర కొడుకు సరిగ్గా తింటున్నదీ లేనిదీ గమనించాడు. ఉదయం ఆఫీసుకు వెడుతూ సుస్మితకి ఎలా ఉందో ఆరా తీశాడు.

✻ ✻ ✻

పది రోజులు గడిచాక ... 'మహిమా, ఒక్కసారి రూముకి రా' అని పిలిచాడు వినోద్. అతని మొహం చాలా కళగా, సంతోషంగా, ఎంతో రిలీఫ్ కనిపించింది. మహిమ లోపలికి రాగానే లేచి నిల్చుని టేబుల్ మీది స్వీట్ ప్యాకెట్‌లోని స్వీట్ తీసి మహిమ నోట్లో పెట్టాడు. "థాంక్స్ మహిమా ! నేను చాలా హ్యాపీగా ఉన్నాను ఈరోజు. నా మనసు ఎంతో ప్రశాంతంగా ఉంది. రియల్లీ ఐయామ్

గ్రేట్‌ఫుల్ యువర్ అడ్వైజ్. మహిమ నీ మాటల్లో మహిమ ఉంది. అక్షరాలా ఆచరణలో పెట్టాను. సుస్మితలో పది రోజుల్లోనే చాలా మార్పు కనిపించింది. మాటల్లో, చేతల్లో సౌమ్యత, అభిమానం కన్పిస్తోంది. "ఏమిటి పెళ్ళాం మీద అంత ప్రేమ హఠాత్తుగా'' అంటూ ముందు ఒకటి రెండుసార్లు వ్యంగ్యంగా ఎత్తిపొడిచింది. 'జరిగింది మర్చిపోదాం నా తప్పు ఒప్పుకుంటున్నాను. ఇంకా ఇలా ఒకరిని ఒకరం ద్వేషించుకుంటూ బతకలేం. కొత్త జీవితం ఆరంభిద్దాం. పాతవిషయాలు ఎత్తొద్దు. నీవు సహకరిస్తే మనం ప్రశాంతంగా ఒకరినొకరు అర్థం చేసుకుంటూ కాపురం చేద్దాం' అని దగ్గర కూర్చుని ప్రశాంతంగా వివరించాను. పదిరోజుల్లో నేను నిజంగానే మారానని నమ్మకం కలిగింది గాబోలు, తనూ భార్యలా నా మీద శ్రద్ధ, ఆసక్తి, అభిమానం కనపరుస్తోంది. ఇద్దరం మామూలుగా మాట్లాడుకుంటున్నాం. మొన్న ఆదివారం బాబుని తీసుకుని సినిమాకి, డిన్నర్‌కి వెళ్లాం. ఇంట్లో వాళ్లు హాయిగా ఊపిరి పీల్చుకుంటున్నారు. మహిమా ... ఇది నీ చలవ. మా కాపురం చక్కబడింది. మనసు చల్లబడి ప్రశాంతంగా ఉంది'' నిజాయితీగా అంతా చెప్పాడు.

మహిమ స్వీట్ తీసి చిన్నముక్క అతని నోట్లో పెట్టింది. "కంగ్రాట్స్ సర్ ... సారీ, భయ్యా ! ఈ నమ్మకం ఆమెలో సడలిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీది. ఒక్కమాట చెప్పనా ? మగవాడు ఇంట్లో దొరకని సుఖం ఎక్కడో దొరుకు తుందన్న భ్రమలో ఇంకో ఆడదాని వెంట పరిగెడతాడు. ఆ పొందులో సుఖం నాలుగు రోజుల ముచ్చట. ఓ పక్క భార్యకి ద్రోహం చేస్తున్న గిల్టీ ఫీలింగు, ఇంట్లో అశాంతి, బయట పరువు పోతుందన్న భయం, పిల్లలుంటే భార్యాభర్తల మధ్య స్పర్థలతో నలిగిపోయే పిల్లలు ... దొరికే ఆనందం కంటే సమస్యలే ఎక్కువ. మన పెళ్ళిలో ఉన్న పవిత్రత, బంధం ఏదో కాని బయట ఎన్ని తిరుగుళ్ళు తిరిగినా కట్టుకున్న భార్యని, అందులో పిల్లలుంటే ఆ భార్యని వదలడు ఏ మగాడు. బయటి మోజు తీరగానే భార్య దగ్గరికే చేరతాడు. ఎటొచ్చి చెడిపోయేది ఆ రెండో ఆడదే. అటు సమాజం ఆమోదముద్ర దొరకదు.

ఈ బంధం శాశ్వతంగా నిలుస్తుందో లేదోనని అనుక్షణం ఆరాటపడుతూ, అందరిచేత ఛీ కొట్టించుకునేది రెండో స్త్రీ. పెళ్ళయిన మగాడితో ప్రేమలో ఇరుక్కున్న స్త్రీ అనుక్షణం అభద్రతా భావంతోనే బతకాలి. ఇద్దరికీ న్యాయం చేయగల మగాడు నూటికి, కోటికి ఉంటాడు. రెండు నావల మీద కాలుపెట్టి ఎన్నాళ్లు నడవగలడు ? ఈ సత్యాలన్నీ తెలిసి కూడా అమ్మాయిలు ఉద్యోగాల కోసమో, అవకాశాల కోసమో, డబ్బు కోసమో, గతిలేకో, తెలిసీ తెలియక ప్రేమ అనుకుని ... ఇలా కాలు జారుతుంటారు. ఒక మెట్టు జారాం ఎన్ని మెట్లు జారితేనేం అనుకుని కొందరు నిర్లక్ష్యం చేస్తారు. చేసిన తప్పుని సరిదిద్దుకోగలుతారు కొందరు. ఈ దేశంలో వివాహముద్ర లేని బంధాలు నిలిచేవి చాలా తక్కువ''.

“కరెక్ట్. నేను సుస్మితని కాదని బయట అమ్మాయిలతో ఎంజాయ్ చేసినన్నాళ్లు ఏదో గిల్టీ ఫీలింగ్. తను నన్ను ఎంత నిర్లక్ష్యంగా, హీనంగా చూసినా, నేను చేస్తున్నది తప్పు అన్న భావం లోలోపల పోయేది కాదు. నీవు చెప్పినట్టు ఈ ఆకర్షణల నుంచి తప్పించుకోలేక ఇరుక్కోవడం, మరో స్త్రీతో సంబంధం మగాడికి వరం కాదు శాపమే అని ఇప్పుడు అర్థం అయింది. ఇంట్లో దొరికే ప్రశాంతత ఎక్కడా దొరకదు. మహిమ, థాంక్‌యూ వన్స్ ఎగైన్ ! ఇంత చిన్న వయస్సులో ఇంత విచక్షణతో ఆలోచించే శక్తి ఎలా వచ్చిందోనని ఆశ్చర్యంగా ఉంది ...'' మెచ్చుకోలుగా అన్నాడు.

“ఇంట్లో పెంపకం కొంత, చదువు ఇచ్చిన జ్ఞానం, పుస్తకాలు చదివిన విజ్ఞానం, లోకాన్ని పరిశీలించి ఆకళింపు చేసుకోగలిగే శక్తి ... ఇవన్నీ ఎవరికి వారు నేర్చుకో వలసినవి'' వినమ్రంగా అన్న మహిమని చూస్తూ.

“మహిమా ! నిజం చెప్పనా ? ఇంత మంచి అమ్మాయిని ఊరికే పోనీయ కూడదనిపిస్తోంది. మా ఇంటి కోడల్ని చేసుకోవాలనిపిస్తోంది'' నవ్వుతూ అన్నాడు.

ఒక్క నిమిషం తెల్లబోయింది మహిమ. ఆమె మొహం అరక్షణంలో ఎర్రబడింది. "కోడలా ? ఉన్న కోడలిని ఏం చేస్తారు మరి ..." అదో రకంగా చూస్తూ అంది.

'ఏం, ఆ కోడలి స్థానం అలాగే ఉంటుంది. ఆ కోడలెక్కడికి పోతుంది"? మహిమ మొహం చూసి ఏదో అర్థమైనట్లు ... "ఓ మైగాడ్ ! మహిమా నీవేం అర్థం చేసుకున్నావు ? గాడ్ ! ఇంకా నీకు నామీద నమ్మకం కుదరలేదన్నమాట ..." పెద్దగా నవ్వుతూ అన్నాడు. మహిమ తెల్లబోయింది. "రియల్లీ మహిమ. ఇంత తెలివైనదానివి అంత తెలివితక్కువగా ఎలా ఆలోచించావు ..."

"ఏమిటి మీరంటున్నది ... ఇంటి కోడలేమిటి" ?

"ఓ గాడ్ ! మహిమా ... నేను అన్నది విశాల్ గురించి. మా ఇంటి కోడలుగా చేసుకోవాలని ... ! యార్, నువ్వేం చెప్పినా జనం నిన్ను నమ్మరు అని చెప్పకనే చెప్పేశావు. మై బ్యాడ్‌లక్ ..." వినోద్ వినోదంగా అన్నాడు.

ఈసారి మహిమ క్షణంలో తేరుకుని "ఓ సారీ ... సారీ ! ఏమిటో నా బుర్ర అంత దూరం ... అసలు విశాల్ గురించిన ఆలోచన రాలేదు. నన్ను కోడలిని చేసుకుంటాననగానే నాకు మతిపోయింది" సంజాయిషీ ఇచ్చింది.

"భలేదానివే. మా విశాల్ పాపం నా ఎపిసోడ్ తర్వాత ఆడపిల్లలంటేనే భయపడిపోయాడు. వాడు ఉత్త మంచివాడు. గర్ల్‌ఫ్రెండ్‌ని చూసుకోవడం కూడా రాదు. నేను చూసిపెడతానని మాటిచ్చాను వాడికి. ఇంత చక్కగా ఎనలైజ్ చేసి నిన్ను 'గర్ల్‌ఫ్రెండ్‌గా వెళ్లు' అంటే తంతావు అన్న భయంతో, డైరెక్ట్‌గా పెళ్ళి అనేశాను" వినోద్ సరదాగా మాట్లాడాడు.

"ఇంతకీ విశాల్ గురించి నీ అభిప్రాయం ఏమిటి ? నిర్మొహమాటంగా, సిగ్గుపడకుండా నీ అభిప్రాయం చెప్పు".

"ఏ ఆడపిల్ల అయినా మంచి కుటుంబం, మంచి ఉద్యోగం, మంచి వ్యాపారం, డబ్బు, సంస్కారం అన్నీ ఉన్న అబ్బాయి గురించి ఏమనుకుంటుందో నేనూ అదే అనుకున్నాను" నిబ్బరంగా అంది.

"అయితే ఓకే. మా విశాల్ అని కాదు కాని, వాడు జెంటిల్‌మేన్ ! నిజంగా చెప్తున్నా. వాణ్ణి చేసుకున్న అమ్మాయి సుఖపడుతుంది. వాడికి మంచి చదువు, సంస్కారం, నీలా తెలివి, సమర్థత అన్నీ ఉన్న అమ్మాయి దొరకాలి. అన్నీ ఉన్న అమ్మాయి ఎదుట ఉంచుకుని వేరే వెతకడం ఎందుకు ? నా ఆలోచన సరి అయినదే గదా ... ఇప్పుడు నీకు ఓకేనా కాదా ముందది చెప్పు' జాలీగా అన్నాడు.

"ఓకేనా అని నన్నడగడం కాదు. ఓకె చెప్పాల్సింది నా పేరెంట్స్" మహిమ ఆ ప్రస్తావనకి ఉబ్బి తబ్బిబ్బై పోకుండా నిబ్బరంగా అంది.

వినోద్ మహిమ వంక మెచ్చుకోలుగా చూసి "మళ్లీ మార్కులు కొట్టేశావు నీ జవాబుతో. ఇంత చక్కగా, నా పెళ్ళి విషయం నా పేరెంట్స్ ఇష్టం అని ఎంత బాగా చెప్పావు. రియల్లీ, యూ ఆర్ ఇంప్రెస్‌డ్ మి ..."

"నేను కొన్ని నిజాలని వంటబట్టించుకున్నాను. అమ్మాయి పెళ్ళి విషయంలో తల్లిదండ్రులు ఆలోచించినంతగా ఎవరూ ఆలోచించలేరు. కూతురి భవిష్యత్తు గురించి వారికంటే ఆరాటం ఎవరికుంటుంది. అమ్మ నాన్న అన్నీ చూసి చేస్తారని నా నమ్మకం. పెళ్ళి సంబంధాల విషయంలో ఆఖరి నిర్ణయం వారిదే. నాకు నచ్చినవాడైనా, వాళ్లు మెచ్చని వాడిని నేను చేసుకోను. కన్నవాళ్ల కంటే నా మేలు ఎవరు కోరతారు".

"గ్రేట్ ! నేను నాన్నగారితో మాట్లాడి, మీ నాన్నగారితో మాట్లాడమని చెపుతాను".

"అంతా మీరే మాట్లాడుతున్నారు. మీ తమ్ముడు లక్ష్మణస్వామి, రాముల వారి మాట జవదాటడా" ? హాస్యంగా అంది.

"నేనేం అంత చవటదద్దమ్మనా ? నీ పేరు చెప్పగానే వాడి కళ్లల్లో మెరుపు, నిన్ను చూడగానే వాడి మొహంలో వెలుగు, నీ గురించి మాటల్లో వాడి అడ్మిరేషన్ ... ఇవన్నీ గుర్తించకుండానే ... నాన్నగారికి నీ సమర్థత, తెలివి మీద కుదిరిన

గురి ఇవన్నీ వర్కవుట్ చేయకుండానే ... ఈ ప్రస్తావన తెస్తానా ? మా ఇంటికి కోడలిగా రాదగిన అమ్మాయివి నువ్వే. నువ్వు మా కుటుంబంలో సుఖ సంతోషాలు నింపుతావు ...''

"చాలా ఎక్కువగా అంచనాలు వేసేస్తున్నారేమో ... జాగ్రత్త'' నవ్వింది మహిమ.

"లేదు ... నిజంగా చెపుతున్నా నువ్వు సుస్మితని కూడా మార్చేయగలవు అనిపిస్తోంది''.

"ఆ మర్చిపోయాను. సుస్మిత గారికి కూడా ఈ ఆఫీసులో ఏదన్నా ఒక పోస్ట్ ఇస్తే తన సమర్థత మీద నమ్మకం కలిగించినట్టూ ఉంటుంది. ఆమెకీ కాలక్షేపం ఉంటే అనవసర ఆలోచనలు తగ్గుతాయి. భర్త ఆఫీసులో తనూ ఉద్యోగం చేస్తే ఆమెకి అనుమానాలు రాకుండా ఉంటాయి. ఆమె కంపెనీలో మేజర్ షేర్‌హోల్డర్ గదా, ఫైనాన్స్ సూపర్‌విజన్ అప్పగించండి. చెక్ పవర్ ఇస్తే, బిజినెస్ ఫైనాన్స్ నెమ్మదిగా అలవాటవుతుంది'' సలహా ఇచ్చింది మహిమ.

"రియల్లీ మహిమ, యూ ఆర్ గ్రేట్ ! ఈ ఆలోచన మాకెవరికీ రాలేదు. నిజమే ! కాలక్షేపంగానే కాక, కంపెనీ వ్యవహారాలు తను చూసుకుంటుంటే, ఇతర ఆలోచనలు, అనుమానాలకి తావు ఉండదు. ఇవాళే డాడీతో మాట్లాడతా. థాంక్స్ మహిమ. నీ మహిమతో మా ఇల్లు పావనం చేసే రోజు దగ్గరలోనే ఉండాలని ఆశిస్తాను ...'' నవ్వుతూ వంగి దండం పెట్టాడు.

మహిమ ఈసారి కాస్త సిగ్గుపడింది.

✻ ✻ ✻

"మహిమా, నీ కోసం చిన్న బహుమతి'' కాఫీ హౌస్‌లో టేబుల్ దగ్గర కూర్చున్నాక, జేబులో నుంచి చిన్న గిఫ్ట్ ప్యాక్ తీసి టేబుల్ మీద పెట్టాడు విశాల్, మహిమ కళ్లలోకి చూస్తూ.

"నాకోసమా ? ఇప్పుడు దీని అవసరం ఏముంది" ? మృదువుగా అంది మహిమ.

"అలా అనకు. ఇది నా సంతోషం, ముచ్చట. తీసి చూడవా" అన్నాడు.

మహిమ నవ్వి గిఫ్ట్ రేపర్ విప్పింది. చిన్న ముఖమల్ డబ్బాలో వజ్రపు టుంగరం.

"ఉంగరం ... మొన్న ఎంగేజ్‌మెంట్ నాడు తొడిగారుగా, మళ్లీ ఇదెందుకు"?

"అది కోడలికి అత్తవారు పెట్టింది. ఇది నా ఫియాన్సీకి ప్రేమకానుక" కొంటెగా అన్నాడు.

"బానే ఉంది. ఉన్నవారు ఎంతయినా ఖర్చు పెట్టగలరు. మరి నేనేం ఇవ్వాలి మీకు".

"ప్రేమకి విలువ కట్టకు. నీకంటే మంచి కానుక నాకింకేం కావాలి" మనస్ఫూర్తిగా అన్నాడు.

"ఫరవాలేదే, బాగానే మాట్లాడుతున్నారు మీ అన్నగారు. 'పాపం మా వాడికి అమ్మాయిలంటే భయం, జెంటిల్‌మేన్, నేనే వెతికి పెట్టాలి అమ్మాయిని' అన్నారు" మహిమ చిలిపిగా అంది.

విశాల్ కాస్త సిగ్గుగా నవ్వి ... 'అన్నయ్యకి నేనేం ఇచ్చి ఋణం తీర్చుకోవాలో ఇంత మంచి అమ్మాయిని వెతికిపెట్టినందుకు' నాటక ఫక్కీలో అన్నాడు.

"బానే ఉంది అన్నదమ్ముల వ్యవహారం. రామలక్ష్మణులని చరిత్రలోంచి తప్పించేట్లున్నారు ఇద్దరూ కలిసి ...'

"వినోద్ నిజంగా మంచివాడు. పాపం, వాడి జీవితం ఎందుకలా అయిందో ... బాధగా ఉంది".

"ఇంక ఆ పాత విషయం మరిచిపోయి, వాళ్లిద్దరిని మామూలు భార్యాభర్తల్లా కలిసి మెలిసి సంసారం చేసేట్టు చెయ్యాలి మనం. సుస్మిత గారిలో మార్పు తీసుకురావాలి. మనందరం కలిసి ఆవిడలోని భేదాభి ప్రాయాలను పోగొట్టి, మనలో కలుపుకునేందుకు ప్రయత్నించాలి. మొన్న ఎంగేజ్‌మెంట్ నాడు బాగానే మాట్లాడారు ఆవిడ ..."

"ఏమో ... ఏం చేస్తావో కానీ నీ మాటల మహిమ చూపు. అన్నయ్యకి దగ్గర చేసే బాధ్యత నీదే ! అవును మహిమ, ఒక్క విషయం అడగనా ? నీకు ఇలా జాయింట్ ఫ్యామిలీలో ఉండడానికి ఇబ్బంది ఏమీ లేదు గదా ? మా మార్వాడీ కుటుంబాలలో, ఇప్పటికీ అన్నదమ్ములం కలిసే ఉంటాం. మీ సౌత్‌లో ఈ పద్ధతి లేదు గదా ? నాకెందుకో ఈ విషయంలో నీ అభిప్రాయం తెలుసుకోవడం అవసరం అనిపించింది. తరువాత అభిప్రాయ భేదాలు రాకూడదు గదా ? నీకేమైనా అభ్యంతరం ఉందా ..." సందేహిస్తూ అడిగాడు.

మహిమ అరక్షణం ఆలోచించకుండా "అస్సలు లేదు. నాకు ఇలా అందరూ కలిసి మెలిసి ఉండే కుటుంబం, పెద్దవారి అండదండల మధ్య వారి నీడలో ఉండడంలో ఎంతో తృప్తి ఉందనిపిస్తుంది. అందులో అమ్మాయిలు ఉద్యోగాలు చేసే కాలం ... ఇంట్లో పెద్దవారుంటే ఎంతో నిశ్చింతగా ఉంటుంది. ఎప్పుడైనా ముందుముందు అలా అనిపిస్తే, అలాంటి పరిస్థితి వస్తే అప్పుడాలోచిద్దాం" నిజాయతీగా అంది.

విశాల్ మహిమ చేయి మీద అభిమానంగా చేయివేసి "థాంక్స్ మహిమ"! అన్నాడు. ఆ చేతి మీద తన చెయ్యివేసి చిన్నగా నొక్కింది అభయం ఇస్తున్నట్టు మహిమ.

రచయిత్రి ఇతర రచనలు

నవలలు

1. కొత్తనీరు (మొదటి నవల)
2. విధివంచితలు
3. అరుణ
4. చీకటి పొద్దున వెలుగు రేఖలు
5. ఇంటింటి కథ
6. తిరిగి దొరికిన జీవితం
7. వివాహబంధాలు
8. శిక్ష
9. కోరికలే గుర్రాలైతే
10. పడగనీడ
11. తీరంచేరిన నావ
12. కొత్తమలుపు (న్యాయంకావాలి)
13. మరో ప్రేమకథ
14. శుభోదయం
15. అగ్నిపరీక్ష
16. జీవితం చేజారనీయకు
17. ఎండమావులు
18. జన్మభూమి
19. పరాజితులు
20. మనసున మనసై
21. ఉషోదయం
22. మహిమ

కథాసంపుటాలు

1. వానచినుకులు
2. కన్నీటికి విలువెంత
3. తల్లిమనసు
4. అతకని బతుకులు
5. చీకటి తొలగిన రాత్రి
6. ఇది జీవితం
7. నయనతార
8. కాదేది కథ కనర్హం
9. డి. కామేశ్వరి కథలు
10. కాలాన్ని వెనక్కి తిప్పకు
11. మధుపం
12. గీతోపదేశం

✳ ✳ ✳

1. Living together (English)
2. Photo Frame (English)

✳ ✳ ✳

1. విదేశ యాత్రానుభవాలు
2. ప్రేమపక్షి (కవితా సంపుటి)
3. ఆజ్ కా నారీ (హిందీ కథాసంపుటం)

✳ ✳ ✳

తమిళ పుస్తకాలు - 3